సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16+40 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 6.00 | సంపుటి: 12 సంచిక: 71

ఆదివారం 2-6-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




‘ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు’

SUNDAY Special



## న్యూజిలాండ్ ఘనవిజయం

శ్రీలంకతో జరిగిన ప్రపంచకప్ మ్యాచ్‌లో 10 వికెట్లతో నెగ్గిన కివీస్


- స్పోర్ట్స్‌లో




## అభిమతం ఒకటే

రంజాన్ మాసంలో భర్త ఆచరిస్తున్న నియమాల గురించి ‘సాక్షి’తో నటి ప్రియమణి


- ఫ్యామిలీలో




## సుజనా ఇంట్లో సీబీఐ సోదాలు

- హైదరాబాద్, బెంగళూరు, చెన్నై సహా 12 చోట్ల ఏకకాలంలో దాడులు
- ఉదయం 8 నుంచి రాత్రి 11 గం. వరకు తనిఖీలు
- హైదరాబాద్‌లోని సుజనా గ్రూప్ కార్యాలయం సీజ్.. పలు హార్డ్ డిస్క్‌లు స్వాధీనం


- వివరాలు 2లో




శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌తో ముచ్చటిస్తున్న తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కె.చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


- వివరాలు 2లో


## దేశానికే ఆదర్శం తెలంగాణ

### రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ఐదు ప్రగతి వసంతాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న తెలంగాణ రాష్ట్రం, ఆరో వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ప్రజలకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. మహోద్యమాన్ని సాగించి, సాధించుకున్న తెలంగాణ ప్రగతిపథంలో పరుగులు పెడుతోందని, అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. తొలి ఐదేళ్ల కాలంలో బంగారు తెలంగాణ నిర్మాణానికి బలమైన అడుగులు పడ్డాయన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు, పారదర్శక పాలన అందించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నాలలో భాగస్వామ్యం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సంఘటిత శక్తిని ప్రదర్శించి, ఫలితాలు సాధించుకున్న స్వీయానుభవం కలిగిన తెలంగాణ సమాజం, అదే స్ఫూర్తితో నిర్దేశిత లక్ష్యాలను సాధించగలుగుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. స్వరాష్ట్రం కోసం తమ ప్రాణాలను బలిపెట్టిన అమర వీరులకు సీఎం నివాళులు అర్పించారు.

# 3.144% డీఏ పెంపు

### రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు తీపి కబురు

### 27.248 శాతం నుంచి 30.392 శాతానికి పెరిగిన కరువు భత్యం

- 2018 జూలై 1 నుంచి పెంపు వర్తింపు
- జూన్ నెల వేతనంతో పెరిగిన డీఏ చెల్లింపు
- జీపీఎఫ్ ఖాతాలో పాత పెన్షన్ ఉద్యోగుల డీఏ బకాయిలు జమ
- సీపీఎస్ ఉద్యోగుల ప్రాన్ ఖాతాలకు 10% డీఏ బకాయిలు
- జూన్ నెల వేతనంతో మిగిలిన 90 శాతం బకాయిల చెల్లింపు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ఆర్థికశాఖ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఉద్యోగుల కరువు భత్యాన్ని (డీఏ) 3.144 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.



ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగుల మూల వేతనంపై కరువు భత్యం 27.248 శాతం నుంచి 30.392 శాతానికి పెరిగింది. 2018 జూలై 1 నుంచి డీఏ పెంపు వర్తించనుంది. జూలైలో చెల్లించనున్న జూన్ నెల వేతనంతో పెరిగిన కరువు భత్యాన్ని ప్రభుత్వం చెల్లించనుంది.

**డీఏ బకాయిల చెల్లింపు ఇలా...**

2018 జూలై 1 నుంచి 2019 మే 31 మధ్యకాలానికి సంబంధించిన పెరిగిన డీఏ బకాయిలను సంబంధిత ఉద్యోగుల జీపీఏ ఖాతాలో ప్రభుత్వం జమ చేయనుంది. 2019 సెప్టెంబర్ 30కి ముందు పదవీ విరమణ చేసే ఉద్యోగులకు సంబంధించిన


మిగతా 2వ పేజీలో ▶


# ఎకరానికి రూ. 5,000

### ఈ ఖరీఫ్ నుంచి రైతుబంధు సాయం పెంపు

- మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఈ-కుబేర్ ద్వారా ఆన్‌లైన్‌లో రైతు ఖాతాల్లో జమ
- 54.5 లక్షల మంది రైతులకు ఈ నెల 4, 5 తేదీల నుంచి అందజేత
- పట్టాదారు పాసుబుక్ రానివారు తమను సంప్రదించాలన్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: రైతుబంధు సాయం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి ప్రతి రైతుకూ ఎకరానికి రూ. ఐదు వేల చొప్పున అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు 2019–20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అమలు మార్గదర్శకాలను వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి శనివారం విడుదల చేశారు. గతేడాది సీజన్‌కు ప్రతి రైతుకూ ఎకరానికి రూ. 4 వేల చొప్పున ప్రభుత్వం పెట్టుబడి సాయం చేయడం తెలిసిందే. గత ఖరీఫ్, రబీల్లో రైతులకు దాదాపు రూ. 10 వేల కోట్లు మేర అందించింది. ఈ ఖరీఫ్ నుంచి దాన్ని రూ. 5 వేలకు పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆ ప్రకారం ఈ ఖరీఫ్ నుంచి పెంచిన సొమ్మును ప్రతి రైతుకూ అందించనున్నారు. ఇందుకోసం రెండు సీజన్లకు కలిపి బడ్జెట్లో ప్రభుత్వం రూ. 12 వేల కోట్లు కేటాయించింది.



ఆర్‌బీఐకి చెందిన ఈ-కుబేర్ ద్వారా ప్రతి రైతు ఖాతాలోకి వారికున్న పట్టాదారు భూమి ప్రకారం పెట్టుబడి సాయం ఆన్‌లైన్‌లో జమ చేస్తామని పార్థసారథి వివరించారు. పట్టాదారు పాసుపుస్తకంగల రైతులు, ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాగల లబ్ధిదారులందరికీ ప్రభుత్వం రైతుబంధు సొమ్ము అందించనుంది. రెవెన్యూ శాఖ నుంచి వ్యవసాయ శాఖకు అందిన సమాచారం ప్రకారం 1.35 కోట్ల ఎకరాలకు చెందిన 54.50 లక్షల మంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఉండగా ఆ ప్రకారం ప్రభుత్వం రూ. 6,750 కోట్లు జమ చేయాల్సి ఉంది. అయితే రెవెన్యూ శాఖ నుంచి వచ్చిన రైతుల జాబితాలోని వారిలో కొందరు


మిగతా 2వ పేజీలో ▶



రాష్ట్ర ఆవిర్భావ ప్రత్యేక కథనాలు 14, 15 పేజీల్లో













## ఉన్మాది కాల్పులు



- అమెరికాలోని వర్జీనియాలో సహోద్యోగులపై దాడి
- 12 మంది దుర్మరణం, నలుగురికి గాయాలు
- ఉన్మాది క్రాడిక్‌ను కాల్చిచంపిన పోలీసులు


- వివరాలు 5లో


## ప్రజా సంక్షేమమే లక్ష్యం



- దేశ భద్రతకు ప్రాధాన్యమిస్తాం: అమిత్‌షా
- కేంద్ర హోంశాఖ ఉన్నతాధికారులతో భేటీ
- హాజరైన సహాయ మంత్రులు కిషన్‌రెడ్డి, నిత్యానంద్ రాయ్


- వివరాలు 5లో


## సీపీపీ నేతగా సోనియా



- పేరును ప్రతిపాదించిన మన్మోహన్, అంగీకరించిన కాంగ్రెస్ నేతలు
- కొదమసింహాల్లా పోరాడుతాం: రాహుల్


- వివరాలు 5లో


## భారత్‌కు ట్రంప్ వాణిజ్య దెబ్బ



- 560 కోట్ల డాలర్ల రాయితీలు రద్దు
- 5 నుంచి అమల్లోకి ‘జీఎస్‌పీ హోదా రద్దు’
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన


- వివరాలు 5లో










శనివారం సాయంత్రం రాజ్‌భవన్‌లో ఇఫ్తార్ సందర్భంగా ముస్లిం సోదరులతో కలసి నమాజ్ చేస్తున్న గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్, ఏపీ సీఎం వై.ఎస్. జగన్. చిత్రంలో ఏకే ఖాన్, ఎర్రబెల్లి, ఫరూక్ హుస్సేన్, మహమూద్ అలీ తదితరులు



ఇఫ్తార్‌లో ఏపీ సీఎం వై.ఎస్. జగన్‌కు ఖర్జూరం తినిపిస్తున్న సీఎం కేసీఆర్



సీఎం కేసీఆర్‌కు పండు తినిపిస్తున్న ఏపీ సీఎం వై.ఎస్. జగన్

# విభజన వివాదాలకు తెర!

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సీఎంల నిర్ణయం
- గవర్నర్ సమక్షంలో గంటకుపైగా కేసీఆర్, వై.ఎస్. జగన్ భేటీ
- ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులతో త్వరలో సమావేశం
- సీఎంల భేటీకి వేదికగా మారిన గవర్నర్ ఇఫ్తార్ విందు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర విభజన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకునే దిశగా మరో ముందడుగు పడింది. విభజన వివాదాల పరిష్కారం కోసం త్వరలో రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని తెలంగాణ సీఎం కె.చంద్రశేఖర్‌రావు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. రాష్ట్ర విభజన జరిగి ఐదేళ్లు పూర్తయినా ఇంకా కొలిక్కి రాని వివాదాలకు సత్వర ముగింపు పలకాలని అభిప్రాయానికి వచ్చారు. ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ సమక్షంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు శనివారం సాయంత్రం రాజ్‌భవన్‌లో సమావేశమయ్యారు. సుమారు గంటకుపైగా చర్చలు జరిపారు. రాష్ట్ర విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10లో ఉన్న ప్రభుత్వరంగ సంస్థల విభజనతోపాటు విద్యుత్ ఉద్యోగుల విభజన, విద్యుత్ సంస్థల మధ్య విద్యుత్ బిల్లులు, ఆస్తులు, అప్పుల పంపకాలు, ఏపీ భవన్ విభజన తదితర అంశాలు ఈ భేటీలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. రాష్ట్ర విభజన జరిగి ఐదేళ్లు గడిచినా ఇంకా అపరిష్కృతంగా మిగిలిపోయిన అంశాలను ఉభయ ప్రయోజనకరంగా పరిష్కరించుకోవాలని ఈ భేటీలో నిర్ణయించినట్లు సమాచారం. రంజాన్ మాసం సందర్భంగా రాజ్‌భవన్ కాంప్లెక్స్‌లోని 'సంస్కృతి'కమ్యూనిటీ హాల్‌లో గవర్నర్ శనివారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి సాయంత్రం 5 గంటలకు రాజ్‌భవన్ చేరుకున్న కేసీఆర్, జగన్... గవర్నర్ సమక్షంలో గంటకుపైగా చర్చలు జరిపారు.

### ప్రేమను పంచండి: గవర్నర్ సందేశం

ప్రేమను పంచండి.. ప్రేమను చాటండి అని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ పిలుపునిచ్చారు. రాజ్‌భవన్ కాంప్లెక్స్‌లోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఆయన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరినీ ప్రేమించండి.. ప్రేమను పంచండి అని అల్లా చెప్పారన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. అల్లా బోధనలను జీవితంలో ఆచరించాలని రంజాన్ సందేశమిస్తుందన్నారు. అందరికీ రంజాన్ పండుగ శుభకాంక్షలు తెలిపారు. ఇఫ్తార్ విందులో పాల్గొన్న తెలంగాణ సీఎం కేసీఆర్, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మత పెద్దలు, ప్రముఖులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇఫ్తార్ అనంతరం అక్కడే ముస్లిం సోదరులు మగ్రిబ్ నమాజ్ చేశారు. నమాజ్ అనంతరం గవర్నర్ అతిథులకు విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మంత్రులు మహమూద్ అలీ, ఈటల రాజేందర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు వై. విజయసాయిరెడ్డి, ఎంపీ వై.ఎస్. మిథున్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎకరానికి రూ. 5,000

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పటికీ తమ బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించలేదు. ఒక అంచనా ప్రకారం వ్యవసాయశాఖ వద్ద కచ్చితంగా 50 లక్షల మంది రైతుల బ్యాంకు వివరాలున్నాయి. వారికి మాత్రమే రైతుబంధు సొమ్ము అందే అవకాశముంది. మిగిలినవారు కూడా తమ బ్యాంకు ఖాతా వివరాలను అందజేయాలని వ్యవసాయశాఖ వర్గాలు రైతులకు విన్నవించాయి. ఒకవేళ ఎవరికైనా అన్నీ క్లియర్‌గా ఉండి పట్టాదారు పాసుపుస్తకం మాత్రమే రాకపోతే, వారు కూడా తమను సంప్రదించాలని అధికారులు రైతులకు విన్నవిస్తున్నారు. ఈ ఖరీఫ్‌కు సంబంధించిన రైతుబంధు సొమ్ము ఈ నెల 4, 5 తేదీల నుంచే రైతుల ఖాతాల్లోకి జమ అవుతుందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. రెండు మూడు వారాల్లోగా ప్రతి రైతుకూ సొమ్ము చేరుతుందని వెల్లడించాయి.

### సాయం వద్దనుకుంటే వదులుకోవచ్చు

తమకు పెట్టుబడి సాయం వద్దనుకునే రైతులెవరైనా ఉంటే వారు 'గివ్ ఇట్ అప్'ఫారాన్ని మండల వ్యవసాయాధికారి లేదా మండల వ్యవసాయ విస్తరణాధికారికి ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అలా మిగిలిన పెట్టుబడి సొమ్మును తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితికి అందించనుంది. గివ్ ఇట్ అప్‌పై ప్రచారం నిర్వహించాలని నిర్ణయించింది.

### పీఎం–కిసాన్ సాయం కూడా...

కేంద్ర ప్రభుత్వం పీఎం–కిసాన్ పథకాన్ని దేశంలోని రైతులందరికీ వర్తింపజేస్తూ ఏటా రూ. 6 వేల చొప్పున సాయం అందించాలని శుక్రవారం నిర్ణయించింది. ఈ పథకం కింద తెలంగాణలోని రైతులకు రూ. 3,270 కోట్ల మేర వచ్చే అవకాశముందని రాష్ట్ర వ్యవసాయశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ పథకాన్ని గత డిసెంబర్‌లో ఐదెకరాల లోపున్న రైతులకే కేంద్రం అమలు చేసింది. అప్పుడు తెలంగాణలో 25 లక్షల మందికి ఈ పథకం వర్తించింది. కానీ ప్రస్తుత ఏడాదిలో ఐదెకరాల పరిమితిని తొలగించి ఎంత భూమి ఉన్నా రైతులందరికీ రూ. 6 వేలు ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఆ ప్రకారం చూస్తే తెలంగాణలో పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్న రైతులు 54.50 లక్షల మంది ఉన్నారు. అయితే గతేడాది ఈ పథకం అమల్లో అనేక షరతులు విధించారు. ఇప్పుడు కేంద్రం అవే షరతులు విధిస్తుందా లేక రైతులందరికీ సొమ్ము ఇచ్చేస్తుందా అనే విషయం తెలియాల్సి ఉంది.

# 3.144% డీఏ పెంపు

▶ మొదటి పేజీ తరువాయి

డీఏ బకాయిలను మాత్రం ప్రభుత్వం నగదు రూపంలో చెల్లించనుంది. 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియామకమై కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం (సీపీఎస్) వర్తించే ఉద్యోగులకు, 2018 జూలై 1 నుంచి 2019 మే 31 మధ్యకాలానికి సంబంధించిన పెరిగిన డీఏ బకాయిల్లో 10 శాతాన్ని వారి ప్రాన్ (పీఆర్ఏఎన్) ఖాతాల్లో ప్రభుత్వ వాటా కలిపి జమ కానుంది. మిగిలిన 90 శాతం డీఏ బకాయిలను జూలైలో చెల్లించనున్న జూన్ నెల వేతనంతో కలిపి నగదు రూపంలో చెల్లించనుంది. జీపీఎఫ్‌కు అనర్హులైన ఫుల్‌టైం కంటిజెంట్ ఉద్యోగుల డీఏ బకాయిలను జూలైలో చెల్లించనున్న జూన్ నెల వేతనంతో కలిపి నగదు రూపంలో చెల్లించనుంది.

### 3.144 శాతం పెంపు వీరికే...

2015 పీఆర్సీ ప్రకారం వేతనాలు అందుకుంటున్న జెడ్పీ, మండల పరిషత్, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, జిల్లా గ్రంథాలయ సంస్థలు, వర్క్ చార్జ్‌డ్ ఎస్టాబ్లిష్‌మెంట్, ఎయిడెడ్ సంస్థలు, ఎయిడెడ్ పాలిటెక్నిక్‌ల బోధన, బోధనేతర సిబ్బంది, ప్రొఫెసర్ కె. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, జేఎన్టీయూహెచ్ సహా ఇతర వర్సిటీల బోధన, బోధనేతర సిబ్బందికి 3.114 శాతం డీఏ పెంపు వర్తించనుందని ప్రభుత్వం తెలిపింది.

### యూజీసీ వేతనాలపై 6 శాతం డీఏ పెంపు

సవరించిన యూజీసీ వేతనాలు–2006 అందుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏను 142 శాతం నుంచి 148 శాతానికి ప్రభుత్వం పెంచింది. సవరించిన యూజీసీ వేతనాలు–2006 అందుకుంటున్న ప్రభుత్వ, ఎయిడెడ్ అనుబంధ డిగ్రీ కళాశాలల బోధన, బోధనేతర సిబ్బంది, ప్రొఫెసర్ కె. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, జేఎన్టీయూహెచ్‌తోపాటు ఇతర వర్సిటీలు, ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల బోధన సిబ్బందికి ఈ పెంపు వర్తించనుంది.

- పద్మనాభన్ కమిటీ నివేదిక ఆధారంగా 2010లో జారీ చేసిన జీవో 73 మేరకు వేతన సవరణ పొందిన న్యాయాధికారుల కరువు భత్యాన్ని 142 శాతం నుంచి 148 శాతానికి ప్రభుత్వం పెంచింది.
- వేతన సవరణ–2010 ప్రకారం వేతనాలు పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగుల డీఏ రేటును 107.856 శాతం నుంచి 112.992 శాతానికి పెంచింది.
- పార్ట్‌టైం విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లకు నెలకు రూ. 100 వేతనం పెంచింది.
- ఈ ఉత్తర్వుల జారీకి ముందు ఎవరైనా ఉద్యోగులు మరణిస్తే వారి చట్టబద్ధ వారసులకు నగదు రూపంలో డీఏ బకాయిలను ప్రభుత్వం చెల్లించనుంది.

## బీజేపీలో చేరిన ఇద్దరు టీడీపీ నేతలు



బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్‌ను సత్కరిస్తున్న సురేశ్‌రెడ్డి, పెద్దిరెడ్డి. చిత్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్

**సాక్షి, హైదరాబాద్:** తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, మాజీ ఎంపీ సురేశ్‌రెడ్డి బీజేపీలో చేరారు. శుక్రవారం ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై రాంమాధవ్ వారితో చర్చించినట్లు తెలిసింది. వారి చేరికతో పార్టీ బలోపేతం అవు తుందని రాంమాధవ్ ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు.

# సుజనా ఇంట్లో సీబీఐ సోదాలు

## హైదరాబాద్, బెంగళూరు, చెన్నై సహా 12 చోట్ల ఏకకాలంలో తనిఖీలు

**సాక్షి, హైదరాబాద్:** బ్యాంకు రుణాల ఎగవేత కేసులో టీడీపీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి ఇళ్లు, కార్యాలయాలపై సీబీఐ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. బెంగళూరు నుంచి వచ్చిన అధికారులు బృందాలుగా విడిపోయి హైదరాబాద్, చెన్నై, బెంగళూరులో కలిపి మొత్తం 12 చోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. పలు హార్డ్ డిస్కులను స్వాధీనం చేసుకోవడంతోపాటు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని సుజనా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ కార్యాలయాన్ని సీజ్ చేశారు. ఉదయం 8 గంటలకు మొదలైన సోదాలు రాత్రి 11 గంటలకు ముగిశాయి. బ్యాంకుల నుంచి భారీ ఎత్తున రుణాలు తీసుకొని ఎగవేసిన కేసులో సీబీఐ అధికారులతోపాటు బ్యాంకింగ్ ఫ్రాడ్ సెల్ టీం సభ్యులు ఈ దాడుల్లో పాల్గొన్నారు. నకిలీ బిల్లులు సృష్టించి పెద్ద ఎత్తున బ్యాంకుల నుంచి పొందిన నిధులను ఇతర మార్గాల్లో డొల్ల కంపెనీలకు తరలించినట్లు సుజనా చౌదరిపై సీబీఐ అభియోగాలు నమోదు చేయడం తెలిసిందే. ఈ కేసులో మనీలాండరింగ్ కింద ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేస్తోంది. అయితే తాజాగా జరిగిన దాడులు మాత్రం సీబీఐ ఇటీవల సుజనాపై నమోదు చేసిన మరో కేసుకు సంబంధించినవి కావడం గమనార్హం. ఇందుకు సంబంధించి నలుగురు డైరెక్టర్లు శ్రీనివాస కల్యాణ్ రావు, వెంకట రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ వర్మను అదుపులోకి తీసుకొని విచారించారు.

### ఏం జరిగిందంటే?

బెస్ట్ అండ్ క్రాంప్టన్ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ (బీసీఈపీఎల్) కంపెనీ సుజనా గ్రూప్‌నకు చెందింది. దీన్ని సుజనా చౌదరి సీబీఐ మాజీ చీఫ్ విజయ రామారావు కుమారుడితో కలిసి ఏర్పాటు చేశారు. చెన్నైలోని ఆంధ్రా బ్యాంకు, సెంట్రల్ బ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకుల నుంచి 2010 నుంచి 2013 మధ్యకాలంలో రూ. 364 కోట్లు రుణం తీసుకుంది. బీసీఈపీఎల్‌కు రుణం ఇచ్చేందుకు ఈ బ్యాంకులు కన్సార్షియంగా ఏర్పడ్డాయి. ఈ మొత్తంలో ఆంధ్రా బ్యాంకు రూ. 71 కోట్లు, కార్పొరేషన్ బ్యాంకు నుంచి రూ. 120 కోట్లు, సెంట్రల్ బ్యాంకు నుంచి రూ. 124 కోట్లు తీసుకున్నారు. ఈ రుణాలను గంగా స్టీల్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్, భాగ్యనగర్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడింగ్ లిమిటెడ్, తేజస్విని ఇంజనీరింగ్ లిమిటెడ్, ఫ్యూచర్ టెక్ ఇండస్ట్రీస్ కంపెనీలకు బ్యాంకుల నుంచి రుణాలు పొందినట్లు సీబీఐ ఆధారాలు, పత్రాలు సేకరించింది. ప్రస్తుత దాడులు ఆంధ్రా బ్యాంకుకు సంబంధించి రూ. 71 కోట్ల ఎగవేతకు సంబంధించినవి కావడం విశేషం.



సుజనా ఇంట్లో తనిఖీల అనంతరం తిరిగి వెళ్తున్న సీబీఐ అధికారులు



హైదరాబాద్‌లోని సుజనా గ్రూప్ కార్యలయాన్ని సీజ్ చేసిన దృశ్యం

### అన్నీ డొల్ల కంపెనీలే...

బ్యాంకు రుణాన్ని ఎగవేసిన కేసులో బ్యాంకుల ఫిర్యాదు మేరకు సీబీఐ కేసు నమోదు చేసింది. కాకులమర్రి శ్రీనివాసరావుతో కలిపి ఐదుగురు డైరెక్టర్లు, మేనేజింగ్ డైరెక్టర్‌పై సీబీఐ కేసులో నిందితులుగా చేర్చింది. బ్యాంకుల నుంచి రుణాల రూపంలో పొందిన మొత్తాన్ని సుజనా బినామీ కంపెనీలకు నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి బదిలీ చేసినట్లు సీబీఐ విచారణలో గుర్తించింది. ఇందుకోసం పలు డొల్ల కంపెనీలను సృష్టించినట్లు, భారీగా మనీలాండరింగ్ జరిగినట్లు తేలింది. దీంతో మనీలాండరింగ్ కేసును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి బదిలీ చేసింది. సుజనా గ్రూప్‌లో పెద్ద మొత్తంలో డొల్ల కంపెనీలున్నట్లు ఈడీకీ సైతం ఆధారాలు లభించాయి. సుజనా సృష్టించిన వైస్రాయ్ హోటల్స్ అండ్ మహల్ హోటల్‌కు పొందిన రుణంలో నుంచి నగదును బదిలీ చేశారు. దీంతో వైస్రాయ్ హోటల్స్ అండ్ మహల్ హోటల్‌కు చెందిన రూ. 315 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ ఏప్రిల్‌లో అటాచ్ చేసింది. మనీలాండరింగ్ యాక్ట్ ప్రకారం హైదరాబాద్, ఢిల్లీ, చెన్నై, బెంగళూరులోని ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. ఈ సందర్భంగా పలు ఎల్రక్టానిక్ పరికరాలు, విలువైన పత్రాలను స్వాధీనం చేసుకోవడం తెలిసిందే.

# నౌహీరా ఆస్తుల అటాచ్‌కు ప్రభుత్వం ఓకే

- కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీలోని ఆస్తుల అటాచ్.. వాటి విలువ 400 కోట్లు!

**సాక్షి, హైదరాబాద్:** స్కీముల పేరుతో అక్రమ మార్గంలో డిపాజిట్లు సేకరించిన నౌహీరా షేక్‌కు సంబంధించిన హీరా గ్రూపు ఆఫ్ కంపెనీల ఆస్తుల అటాచ్‌మెంట్‌కు హైదరాబాద్ పోలీసులకు ప్రభుత్వం ఓకే చెప్పింది. కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీలో ఉన్న ఈ ఆస్తుల విలువ దాదాపు రూ. 400 కోట్ల వరకు పలుకుతుందని అంచనా. డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ (డీడీ) దర్యాప్తులో భాగంగా దాదాపు 80 చోట్ల నౌహీరాకు ఆస్తులు ఉన్నట్లు గుర్తించింది. వాటి విలువ దాదాపు రూ.1,500 కోట్ల వరకు ఉంటుంది. తొలి విడతలో భాగంగా కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీలోని 30 ఆస్తులను అటాచ్ చేసేందుకు పోలీసులు అనుమతి పొందారు. ప్రస్తుతం నౌహీరా ఆమె అనుచరులైన బిజూ థామస్, మాలీ థామస్‌లు చంచల్‌గూడ జైల్లో ఉన్నారు. దేశంలోని సంపదను విదేశాలకు అక్రమ మార్గంలో తరలించారన్న అభియోగాలపై ఈడీ కూడా నౌహీరాను ప్రశ్నించింది. ఇప్పటికే ఆమె సృష్టించిన 120 నకిలీ బ్యాంకు ఖాతాలను ఆదాయపు పన్ను శాఖ గుర్తించింది. వాటిలో ఉన్న రూ. 25 కోట్ల నగదును అధికారులు సీజ్ చేశారు.

## ఇద్దరు వైద్యుల సస్పెన్షన్

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తూ, ప్రైవేట్ ఆసుపత్రి నడిపిస్తున్న ఇద్దరు డాక్టర్లు సస్పెండ్ అయ్యారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ దేవ్‌రాజ్, డాక్టర్ ఎం.రామకృష్ణ డ్యూటీ సమయంలో తమ సొంత క్లినిక్‌లో పనిచేస్తున్నట్లు ఉన్నతాధికారుల ఆకస్మిక తనిఖీల్లో వెల్లడైంది. దీంతో వారిద్దరినీ సస్పెండ్ చేయాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ మాణిక్‌రాజ్‌కు సిఫార్సు చేశారు. వారిద్దరినీ సస్పెండ్ చేస్తూ ఆయన శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

# ఉపాధి కల్పనలో 'ఐటీ' మేటి

- ఐదేళ్లలో ఐటీ ఎగుమతుల్లో 190% వృద్ధి నమోదు
- గతేడాది 67,725 మందికి కొత్తగా ఉద్యోగాలు
- సామాజిక మాధ్యమ వేదిక 'టీ వెబ్' వీక్షకులు 3 కోట్ల మంది
- 'టీ వ్యాలెట్' ద్వారా రూ. 1,202 కోట్ల విలువైన లావాదేవీలు
- 'టాస్క్' ద్వారా 3 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ
- రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఐటీ పురోగతి నివేదిక విడుదల



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ఐదేళ్లుగా సాధించిన పురోగతి నివేదికను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పరిశ్రమలు, ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ శనివారం విడుదల చేశారు. రాష్ట్ర ఐటీ విభాగం వివిధ రంగాల్లో మెరుగైన సేవల కోసం చేపట్టిన కార్యక్రమాల పురోగతిని ఈ నివేదికలో వివరించారు. 'రాష్ట్రం నుంచి ఐటీ ఎగుమతులను రెండేళ్లలో రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుంది. గత నాలుగేళ్లలో జాతీయ స్థాయిలో 170 శాతం వృద్ధి కనిపించగా రాష్ట్రంలో 190 శాతం మేర వృద్ధి నమోదైంది. ఐటీ రంగంలో ఉద్యోగుల సంఖ్య త్వరలో 10 లక్షలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నాం. ఐటీ రంగానికి అనుబంధంగా ఏర్పాటు చేసిన టీ–హబ్, టాస్క్, టీ–సాట్, టీ–ఫైబర్, స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఏర్పాటు లక్ష్యాలకు మించి ఫలితాన్ని ఇస్తున్నాయి. కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత (సీఎస్సార్) మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి టీ–సింగ్ (తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్)ను ఐటీ విభాగానికి అనుబంధంగా ఏర్పాటు చేస్తాం'అని జయేశ్ రంజన్ పేర్కొన్నారు. ఐటీ రంగంలో 5.43 లక్షల ఉద్యోగాలను సృష్టించగా గతేడాది ఏకంగా 67,725 మంది వృత్తి నిపుణులకు కొత్తగా అవకాశం లభించిందన్నారు.

### ఐటీ పురోగతి నివేదికలో పేర్కొన్న అంశాలివీ

- ✦ మెరుగైన పౌర సేవలు అందించేందుకు 'మీ సేవ'అధునాతన వెర్షన్‌ను సిద్ధం చేశాం. ఆధార్ అనుసంధాన చెల్లింపుల విధానం (ఏఈపీఎస్)లో మీ సేవ కేంద్రాల్లో నగదు డ్రా చేసుకునే వీలుంటుంది. ఎల్రక్టానిక్ సర్వీసెస్ డెలివరీ (ఈఎస్‌డీ)లో భాగంగా రూపొందించిన రియల్ టైమ్ డిజిటల్ అథెంటికేషన్ ఆఫ్ ఐడెంటిటీ ద్వారా పెన్షనర్లు లైఫ్ సర్టిఫికేట్‌లు సమర్పించే విధానం సత్ఫలితాలిస్తోంది.
- ✦ నాస్కామ్ ఫౌండేషన్ రూపొందించిన టెక్నాలజీ ఎంపవరింగ్ గర్ల్స్ ద్వారా 66 మంది బాలికలకు డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ విభాగాలు ఐటీ సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, నీతి ఆయోగ్ భాగస్వామ్యంతో ఒప్పందం కుదుర్చుకుంది.
- ✦ ఎల్రక్టానిక్స్, ఎల్రక్టో మెకానికల్ స్టార్టప్స్‌కు సంబంధించి దేశంలోనే అతిపెద్ద ప్రొటోటైప్ సెంటర్ (టీ–వర్క్స్) గతేడాది ప్రారంభమైంది.
- ✦ రాష్ట్ర ప్రభుత్వ శాటిలైట్ నెట్‌వర్క్ 'టీ–శాట్' ద్వారా 4,612 కార్యక్రమాలను ప్రసారం చేయగా 2.39 లక్షల మంది వీక్షించారు.
- ✦ ప్రభుత్వ అధికారిక సామాజిక మాధ్యమ వేదిక 'టీ–వెబ్' ద్వారా సగటున ప్రతి నెలా 3 కోట్ల మందిని చేరుతోంది.
- ✦ తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ద్వారా టైర్–2, టైర్–3 పట్టణాల్లో ఐటీ రంగంలో ఔత్సాహికులను ప్రోత్సహిస్తుండగా ఇప్పటివరకు 12 జిల్లాల్లో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి.
- ✦ కార్మిక, పోలీసులు, స్త్రీ నిధి, ఆర్టీసీ, డెయిరీ, పౌర సరఫరాలు, జేఎన్టీయూ వంటి విభాగాల సేవలను ఒకేచోటకు తెస్తూ గతేడాది ప్రారంభించిన 'టీ–వ్యాలెట్' ద్వారా 2018–19లో రూ. 1,202 కోట్ల విలువ చేసే 28.8 లక్షల లావాదేవీలు జరిగాయి.
- ✦ నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన 'టీ–హబ్'కొత్త ఆవిష్కరణలు, కొత్త వ్యాపార నమూనాలు రూపొందించడంలో విజయవంతమైంది.
- ✦ 'టాస్క్'ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3 లక్షల మంది యువత ఏడాది కాలంలో వివిధ అంశాల్లో నైపుణ్య శిక్షణ పొందారు.
- ✦ ఆవిష్కరణ రంగంలో మహిళలను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన 'వీ హబ్' ద్వారా శిక్షణ, అవకాశాల కల్పన తదితరాలపై మద్దతు ఇస్తుండగా 245 మంది వారి ఆలోచనలు పంపారు. వాటిలోంచి 26 వినూత్న ఆలోచనలను ఎంపిక చేశారు.





రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యుత్ దీపాలతో అసెంబ్లీని ముస్తాబు చేసిన దృశ్యం



గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తుపానికి పూలతో అలంకరణ

# నేడు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

- పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించనున్న సీఎం కేసీఆర్
- మూడు రోజులపాటు ఘనంగా వేడుకలు
- నేటి సాయంత్రం ట్యాంక్ బండ్‌పై డ్రోన్లతో ప్రదర్శన
- రేపు ఎల్బీ స్టేడియంలో పేరిణి మహా నృత్య ప్రదర్శన
- ఎల్లుండి 5 వేల మందితో ఒగ్గు డోలు మహా విన్యాసం

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం ఐదు వసంతాలు పూర్తిచేసుకుని ఆరో వసంతంలోకి అడుగిడింది. ఎన్నో పోరాటాలు, ఎందరో బలి దానాల ప్రతిఫలంగా 2014 జూన్ 2న 29వ రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణ.. ఆది వారం ఐదో ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపు కుంటోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదివారం ఉదయం 9 గంటలకు జాతీయ జెండాను ఆవి ష్కరించనున్నారు. మూడు రోజుల పాటు వేడుకలు కొనసాగనున్నాయి. ఆదివారం సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై డ్రోన్లతో ప్రద ర్శన నిర్వహించనున్నారు. ఎల్బీ స్టేడియంలో జూన్ 3న 1,001 మంది కళాకారులతో పేరిణి మహా నృత్య ప్రదర్శన, 4న 5 వేల మంది కళాకారులతో ఒగ్గు డోలు మహా విన్యాసాన్ని ప్రదర్శించనున్నారు. తెలంగాణ సాంస్కృ తిక సారథి కళాకారులతో నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజా, రవీంద్రభారతిలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

**అన్ని జిల్లా కేంద్రాల్లో వేడుకలు..**

రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో సైతం ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్ర మాలు అధికారికంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించే బాధ్యతను రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సలహాదారులకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. మంత్రులు కొప్పుల ఈశ్వర్ (జగిత్యాల), తలసాని శ్రీనివాస్ (ఖమ్మం), ఈటల రాజేందర్ (కరీంనగర్), శ్రీనివాస్ గౌడ్ (మహబూబ్‌నగర్), మల్లారెడ్డి (మేడ్చల్), ఇంద్రకరణ్‌రెడ్డి (నిర్మల్), వి.ప్రశాంత్‌రెడ్డి (నిజామాబాద్), జగదీష్‌రెడ్డి (సూర్యాపేట), నిరంజన్‌రెడ్డి (వనపర్తి), దయాకర్‌రావు (వరంగల్ అర్బన్), ప్రభుత్వ సలహాదారులు కేవీ రమణాచారి (నారాయణపేట), జీఆర్ రెడ్డి (రాజన్న సిరిసిల్ల), రామ్ లక్ష్మణ్ (జయ శంకర్ భూపాలపల్లి), ఏకే గోయల్ (కొము రంభీం ఆసిఫాబాద్), ఏకే ఖాన్ (మహబూబా బాద్), రాజీవ్ శర్మ (మంచిర్యాల), అనురాగ్ శర్మ (నాగర్‌కర్నూల్), డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ (నల్లగొండ), ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి (వరంగల్ రూరల్), జెడ్పీ చైర్మన్లు శోభారాణి (ఆదిలాబాద్), వాసుదే వరావు (భద్రాద్రి కొత్తగూడెం) పద్మ (జన గామ), బండారు భాస్కర్ (జోగుళాంబ గద్వా ల), దఫేదార్ రాజు (కామారెడ్డి), రాజమణి (మెదక్), తుల ఉమ (పెద్దపల్లి), సునీత (వికారాబాద్), బాలు నాయక్ (యాదాద్రి భువనగిరి) ఆయా జిల్లాల్లో జరిగే వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొంటారు.

# తెలంగాణ సుభిక్షంగా ఉండాలి

## రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినో త్సవం సందర్భంగా ప్రజలకు గవర్నర్ ఈఎస్ఎల్ నర సింహన్ శుభాకాంక్షలు తెలిపారు. గడిచిన ఐదు సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కొరకు చేపట్టిన కార్యక్రమాలు కొనసాగించాలని, సంక్షేమ, అభివృద్ధి ఫలాలు చిట్ట చివరి వ్యక్తి వరకు అందేలా చూడాలన్నారు. 'ప్రజల సంతోషమే ప్రభుత్వ విజ యాలకి కొలమానం. రాబోయే రోజులలో ప్రభుత్వ కార్యక్రమాలు అన్నీ నిబద్ధ తతో, పారదర్శకంగా అందరికీ అందేలా చూడాలి. బంగారు తెలంగాణ సాధన దిశగా ప్రభుత్వానికి విజయం చేకూరాలని, తెలంగాణ సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నాను'అని అన్నారు.

# ఇస్టా సదస్సు నిర్వహణకు కమిటీ

**సాక్షి, హైదరాబాద్:** అంతర్జాతీయ విత్తన పరీక్షల సంస్థ (ఇస్టా) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 32వ అంతర్జాతీయ సదస్సుకోసం నిర్వహణ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 26వ తేదీ నుంచి జూలై 3 వరకు జరగనున్న ఇస్టా కాంగ్రెస్–2019 సదస్సుకు పాట్రా న్స్‌గా కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సంజయ్ అగర్వాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, కేంద్ర వ్యవసాయ శాఖ అదనపు కార్యదర్శి దేవేశ్ చతుర్వేది వ్యవహరించనున్నారు. అలాగే చైర్మన్‌గా వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారథి, కేంద్ర వ్యవసాయశాఖ అదనపు సంయుక్త కార్యదర్శి అశ్వనికుమార్ కో–చైర్మన్‌గా, 11 మంది అధికారులు సభ్యులుగా ఓ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా 70 దేశాల నుంచి సదస్సుకు వస్తున్న శాస్త్రవేత్తలకు, అధికారులకు వసతి, రవాణా, భద్రతా సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఈనెల 27వ తేదీన చేపట్టనున్న విత్తనోత్పత్తి రైతుల సమావేశ నిర్వహణపై కూడా పార్థసారథి ఉత్తర్వులు జారీ చేశారు. వ్యవసాయ, ఉద్యాన, సీడ్‌మెన్ అసోసియేషన్, ఐకార్ సంస్థలకు ఇందులో భాగస్వామ్యం కల్పించారు. వ్యవసాయశాఖ కమిషనర్ రాహుల్ బొజ్జా చైర్మన్‌గా ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీని కూడా ఏర్పాటు చేశారు. రైతుల సమీకరణ, వారి సౌకర్యాలపై ఈ కమిటీ దృష్టి కేంద్రీకరిస్తుంది.

# క్యాంప్‌లు నిర్వహిస్తే కోడ్ ఉల్లంఘించినట్టే..

## పరిషత్ పదవులపై రాజకీయ పార్టీలకు ఎస్‌ఈసీ స్పష్టీకరణ

**సాక్షి, హైదరాబాద్:** క్యాంపు రాజకీయాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్(ఎస్‌ఈసీ) స్పష్టతనిచ్చింది. పరిషత్ పదవులకు నిర్వహించే పరోక్ష ఎన్నికల సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులతో క్యాంప్ రాజకీయాలు నిర్వహిస్తే అది ఎన్నికల నియ మావళి ఉల్లంఘన కిందకే వస్తుందని వివిధ రాజకీయ పార్టీలకు ఎస్‌ఈసీ తెలి పింది. పార్టీలు క్యాంప్ రాజకీయాలకు పాల్పడినట్లు రుజువైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ నెల 7న మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ), 8న జిల్లా ప్రజాపరిషత్ (జెడ్పీపీ) పదవులకు నిర్వహించే ఎన్నికలకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీలతో ఎస్‌ఈసీ శనివారం ఎస్ ఈసీ కార్యాలయంలో అవగాహన సమావేశాన్ని నిర్వహించింది. మండల, జిల్లా ప్రజాపరిషత్ కో ఆప్టెడ్ సభ్యులు, ఎంపీపీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, జెడ్పీపీ చైర్ పర్సన్, వైస్‌చైర్‌పర్సన్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాల గురించి వివరించారు. కోఆప్టెడ్ ఎన్నికలకు పాటించాల్సిన నియమ, నిబంధనలు, జెడ్పీపీ, ఎంపీపీ ఎన్నికలకు రాజకీయ పార్టీలు విప్‌లు ఎలా జారీచేయాలి, ఎప్పటిలోగా వాటిని పంపించాలి తదితర అంశాలను గురించి రాజకీయపార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ ఎన్నికల్లో ఎస్‌ఈసీ నిర్దేశించిన మార్గదర్శకాలు ఏమిటీ, రాజకీయ పార్టీలవారీగా పాటించాల్సిన విధానాలు ఏమిటన్న దానిపై అవగాహన కల్పించారు. ఎంపీపీ, జెడ్పీపీ పదవులకు నిర్వ హించే ప్రత్యేక సమావేశాల్లో కోరం లేకపోతే ఏం చేయాలి, ఆ ఎన్నికల్లో అనుస రించాల్సిన విధానాలను వివరించారు. సమావేశంలో కమిషనర్ వి.నాగిరెడ్డి, కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్, సంయుక్తకార్యదర్శి జయసింహారెడ్డి పాల్గొన్నారు. సమావేశానికి జి.నిరంజన్, మర్రి శశిధర్‌రెడ్డి(కాంగ్రెస్), శ్రీనివాసరెడ్డి, గట్టు రామచంద్రరావు (టీఆర్ఎస్), ఎన్.బాలమల్లేశ్(సీపీఐ), నంద్యాల నర్సింహా రెడ్డి(సీపీఎం), ఇతర పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

# వినూత్నంగా ఆవిర్భావ వేడుకలు

- మూడు రోజులపాటు ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ సంబరాలు
- విభిన్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం అనగానే సీఎం అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించడం, జెండా ఆవిష్కరించడం, సీఎం ప్రసంగం, ఎట్‌హోం కార్యక్రమం లాంటి పలు అధికారిక కార్యక్ర మా లు అందరికీ గుర్తుకు వస్తాయి. వాటితో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా భాషా సాంస్కృతిక శాఖ విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తోంది. తెలంగాణ ఆవి ర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేయడంతో పాటు హైదరా బాద్ పబ్లిక్‌గార్డెన్, జూబ్లీహాల్, రవీంద్రభార తిలో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కవి సమ్మేళనం, ఒగ్గుడోలు కళాకారుల నృత్యం, కూచిపూడి నృత్యం, జయజయహే తెలంగాణ నృత్య రూపకం, పేరిణి నృత్యం, ఒడిస్సీ నృత్యం, అవతరణ ఫిల్మోత్సవం, షార్ట్‌ఫిల్మ్‌ల స్క్రీనింగ్ వంటి పలు కార్యక్రమాలు వేడుకల్లో భాగంగా నిర్వహించనున్నారు.

**ఆసక్తి కలిగించే 48 గంటల 'ఫిల్మ్ మేకింగ్ చాలెంజ్':**

ఇటీవలి కాలంలో లఘుచిత్రాలు, డాక్యుమెం టరీలు రూపొందించే యువ దర్శకులు ఎంతో మంది తమదైన సృజనాత్మకతతో ముందుకు వస్తున్నారు. తమ టాలెంట్‌కి పదును పెట్టు కుంటూ కొత్త కథలతో, కథనాలతో, టెక్నిక్, టెక్నాలజీతో తమ ప్రతిభని ప్రదర్శిస్తున్నారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరి కృష్ణ రవీంద్రభారతిలో ఉన్న పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్ కేంద్రంగా సినీవారం, సండే సినిమా అనే కార్యక్రమాలను రూపొందిం చారు. ప్రతియేటా నిర్వహించే పోటీలా కాకుండా ఈ సంవత్సరం అవతరణ ఫిల్మోత్స వాన్ని వినూత్నంగా నిర్వహించనున్నారు. సినీ నిర్మాణంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన 48 గంటల ఫిల్మ్ మేకింగ్ చాలెంజ్‌ని తెలంగాణ ఫిల్మ్ మేకర్స్ కి పరిచయం చేస్తు న్నారు. ఈ ఫిల్మ్ మేకింగ్ మారథాన్ గతనెల 24 సాయంత్రం 7 గంటలకు మొదలై 26 సాయంత్రం ఏడు గంటలకి ముగిసింది. భాషా సాంస్కృతిక శాఖ ప్రకటించే థీమ్, ప్రాప్, డైలాగ్ లేదా కేరెక్టర్‌ని వాడి నాలుగు నుంచి ఎనిమిది నిమిషాల షార్ట్ ఫిల్మ్ చేయడం ఇందులో ప్రత్యేకత. ఇందులోని విజేతలకు జూన్ 3న రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో అవార్డు ప్రదానోత్సవం ఉంటుంది.

**మాధ్యమాల ద్వారా చేరువవుతున్న తెలంగాణ సంస్కృతి**

ప్రజలకు తొందరగా చేరువయ్యే ప్రసార, సామాజిక మాధ్యమాల ద్వారా కొందరు యువత తెలంగాణ గొప్పతనాన్ని చాటి చెప్పడానికి కృషిచేస్తున్నారు. గానం, నృత్యం, హావభావాలు, వేషధారణ వంటి అంశాలు ప్రస్ఫుటంగా కనిపించేలా షార్ట్‌ఫిల్మ్స్ తీయడం ప్రస్తుతం నడుస్తున్న ట్రెండుగా మారింది. రోజురోజుకీ పెరుగుతున్న నెటిజన్ల సంఖ్య, యూ ట్యూబ్, అంతర్జాలవాడకం వంటి పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని తెలంగాణ ఉద్యమం, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే సినిమాలు, డాక్యు మెంటరీల ప్రదర్శన, ఉత్తమ విదేశీ సినిమాల ప్రదర్శన నిర్వహిస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం జూన్ 2న రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా అవత రణ 'ఫిల్మోత్సవం'పేరిట షార్ట్ ఫిలిం పోటీ లను నిర్వహిస్తున్నారు.

### ఘనంగా ...

రవీంద్ర భారతిలో మూడు రోజుల పాటు తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నాం. మొదటిరోజు అవార్డుల కార్యక్రమం, రెండోరోజు వివిధర కాల సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యం, గానం, అలాగే సాంస్కృతిక సారథి కళాకా రుల పాటలు, తెలంగాణ గీతాలు, జూన్ 2 న ఉదయం కవి సమ్మేళనం, సాయంత్రం చైతన్య గీతాలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అంశాలు ఉంటాయి. ప్రతియేటా నిర్వహించే అవతరణ దినోత్స వానికి కొంచెం భిన్నంగా 48 గంటల్లో ఫిల్మ్ మేకింగ్ చాలెంజ్‌ని నిర్వహించాలనుకు న్నాం. ఔత్సాహిక యువత తమ ప్రతిభను మెరుగుపరచడానికి సినీవారం, సండేసి నిమా, ఫిల్మ్ ఫెస్టివల్స్ నిర్వహించాం. వారి ప్రతిభను నిరూపించుకునేందుకు ఆసక్తిగల సినిమా దర్శకులకు, టెక్నీషియన్లకు ఇది ఒక గొప్ప అవకాశం.

–మామిడి హరికృష్ణ,
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్







TOLL-FREE Prestige CARE 1800-123-334411 | Follow 'prestigesocial' on | www.prestigesmartkitchen.com | BAJAJ FINSERV

Prestige
తనవాళ్ళ మీద ప్రేమ ఉన్నవారు ప్రెస్టీజ్‌ని ఎలా కాదనగలరు.

**Bhongir:** Sri Venkateswara Steel & Brass, Ph:08685242402, Kiran Electronics, Ph:08685242639, R.K ELECTRONICS, PH:9866070863, Maheshuni steel palace ph:9866444399; **Choutuppal:**Big Electronics, Ph:-9951178563, VaraLaxmi Home Needs. Ph:9948457897. A.R.Big bazaar PH:8977712306; **Devarakonda:** Samudrala sudharashan electronics, PH:9848436359; **Kodada:** Meenakshi electronics, PH:9849371909, Madhu Electronics, PH:9246170199, Shirdi sai agencies, PH:9010196666; **Miryalguda:** Sri Rama Steel Palace, Ph:-08689242357, Jaya Steel Palace,Ph:-9704640640; **Nalgonda:** Venkata sai steel palace, PH:9985233739; **Suryapet** : Ashwini steel palace, PH:7386693220, Murali Krishna steelbigbazar, PH:9440195871, AtoZ Bazar, PH:9848719872 **FRANCHISE ENQUIRES SOLICITED, CONTACT-MR.HIRISHIKKESH-9994145544, MADHAVAREDDY- 8008992637, SATYANARAYAN-9000303888. For DISTRIBUTION ENQUIRES CONTACT:-Mr.RajivBharadwaj Cell# 7359669999**

రేడియోను కనిపెట్టినందుకు ఇటలీకి చెందిన గుగ్లీమో మార్కోనీకి 1909లో ఫిజిక్స్ రంగంలో నోబెల్ బహుమతి లభించింది.



# దొంగోడొచ్చి ఇల్లు సర్దిపోయాడు!



అది అమెరికాలోని బోస్టన్ నగరం.. నేట్ రోమన్ అనే వ్యక్తి అతడి కుమారుడితో కలసి ఓ ఇంట్లో నివసిస్తున్నారు. ఓ రోజు స్నేహితుల ఇంటికి ఇద్దరూ వెళ్లారు. మరుసటి రోజు ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం తీసి ఉందట. దాంతో కంగారు పడిపోయిన రోమన్ ఇళ్లంతా వెతికి చూశాడు.. కానీ ఒక్కటంటే ఒక్క వస్తువు కూడా దొంగతనం జరగలేదు. ఇది ఆశ్చర్యం కాదు.. ఆ వచ్చిన దొంగ చిన్న వస్తువు కూడా తీసుకుపోకపోవడమే కాకుండా ఇళ్లంతా చాలా చక్కగా శుభ్రం చేసి వెళ్లిపోయాడు. పడకగదిలోని బెడ్ దగ్గరి నుంచి కిచెన్‌లో ప్రతి వస్తువును చాలా నీట్‌గా కడిగి ఎక్కడి వస్తువులు అక్కడ సర్ది వెళ్లారట. అయితే హౌజ్ కీపింగ్ వాళ్లు.. వేరే ఇళ్లు అనుకుని ఈ ఇల్లు తాళం పగులగొట్టి శుభ్రం చేసి ఉంటారేమోనని అనుమానిస్తున్నారు. ఈ మిస్టరీ ఏంటో ఇప్పటికీ తెలియక తికమకపడుతున్నారు.



ఇది 1934 నాటి పోర్ష్ టైప్ 64 లగ్జరీ కారు. జర్మనీకి చెందిన కారు డిజైనర్ ఫెర్డినాండ్ పోర్ష్‌కు చెందినది. దీన్ని ఇప్పుడు లండన్‌లోని సాత్‌బేలో వేలానికి ఉంచారు. పోర్ష్‌లోని 64 రకం కారు ఇదొక్కటే మిగిలి ఉందని చెబుతున్నారు. దీంతో దీనికి మంచి గిరాకీ వస్తుందని భావిస్తున్నారు. ఏకంగా దీనికి దాదాపు రూ.139 కోట్లు పలికే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ కారును రేసులో పాల్గొనేందుకు ఫెర్డినాండ్ తనకోసమే ఈ కారును డిజైన్ చేసుకున్నారు.

## మంత్రి ఎర్రబెల్లిని కలిసిన నవీన్‌రావు



**సాక్షి, హైదరాబాద్:** ఇటీవల నూతన ఎమ్మెల్సీగా ఎన్నికైన నవీన్‌రావు శనివారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నవీన్‌రావుకు పుష్పగుచ్ఛం ఇచ్చి ఎర్రబెల్లి అభినందనలు తెలిపారు.

## టీఆర్‌టీ నియామకాలు వెంటనే చేపట్టాలి

### సీఎంకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బహిరంగ లేఖ



**సాక్షి, హైదరాబాద్:** విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గతేడాది ఫిబ్రవరిలో నిర్వహించిన టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ) ద్వారా ఎంపికైన వారికి వెంటనే నియామక పత్రాలు అందజేయాలని శాసనమండలి సభ్యుడు టి.జీవన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ఆయన సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. 2017లో టీఆర్‌టీ నోటిఫికేషన్ ద్వారా 8,792 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారని, 2018లో పరీక్ష నిర్వహించగా ఇప్పటి వరకు వారికి నియామక పత్రాలను అందజేయలేదని ఆ లేఖలో పేర్కొన్నారు. ఇందులో కేవలం 7,414 మంది మెరిట్ లిస్ట్ మాత్రమే ప్రకటించారని, 1,378 మంది ఉపాధ్యాయ అభ్యర్థుల ఫలితాలను కూడా ప్రకటించలేదని తెలిపారు. వెంటనే ఈ నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులందరికీ నియామక పత్రాలు ఇచ్చి విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే నాటికి వారు ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తించేందుకు అందుబాటులోకి వచ్చేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో సీఎంను జీవన్‌రెడ్డి కోరారు.

## ఇకనైనా పాలనపై దృష్టి పెట్టండి: గూడూరు



**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికైనా పాలనపై దృష్టి పెట్టాలని టీపీసీసీ కోరింది. 'ఆరునెలల్లో కేసీఆర్ కేవలం కేబినెట్ సమావేశాలు మాత్రమే నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పాటై 169 రోజులు గడుస్తున్నా ఇంకా మంత్రివర్గంలో ఆరు ఖాళీలున్నాయి. ఈ తరహా పాలన ప్రజాస్వామ్యాన్ని కాకుండా నియంతృత్వాన్ని తలపిస్తోంది'అని టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేనిఫెస్టోలో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా ఎన్నికల నియమావళి పేరుతో ఆయన సెలవులు తీసుకున్నారని ఎద్దేవా చేశారు. వెంటనే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి నిరుద్యోగ భృతి, రైతుబంధు సాయం పెంపు తదితర అంశాలను పరిష్కరించాలని, ఆర్థికంగా కుంగిపోతున్న రాష్ట్రం కోలుకునేందుకు పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు.

## అమెరికాలో వైసీపీ విజయోత్సవాలు

**సాక్షి, హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ నూతన సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం సందర్భంగా అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో అభిమానులు విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది దాకా జగన్ అభిమానులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ అఖండ విజయానికి తోడ్పాటు అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, జగన్‌కు తోడుగా తమవంతు సహకారం అందించాలని తీర్మానించారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సంక్షేమ పథకాల అమలుకు ఆర్థిక సాయం అందించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనిత్య, సిరిరెడ్డి, పూజ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రివర్గంలో బీసీలకు అన్యాయం



**సాక్షి, హైదరాబాద్:** కేంద్రంలో రెండోసారి అధికారం చేపట్టిన ఎన్డీఏ ప్రభుత్వం మంత్రివర్గంలో బీసీలకు అన్యాయం చేసిందని బీసీ సంక్షేమ సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. బీసీల ఓట్లతో గెలుపొందిన బీజేపీ ప్రభుత్వం బీసీలను విస్మరించడం తగదని హెచ్చరించింది. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలో కేబినెట్ మంత్రులు, స్వతంత్ర, సహాయ మంత్రుల్లో కేవలం 12 మంది మాత్రమే బీసీలున్నారని, జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు పావువంతు పోస్టులు కూడా ఇవ్వలేదన్నారు. చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, బీసీని కేబినెట్ మంత్రిగా నియమించాలనే డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

## సోనియా ఎన్నిక పట్ల హర్షం

**సాక్షి, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్లమెంటరీ పక్ష (సీపీపీ) నేతగా సోనియా గాంధీ ఎన్నిక కావడం పట్ల పలువురు టీపీసీసీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. యూపీఏ చైర్‌పర్సన్‌గా పదేళ్లపాటు సమర్థంగా ప్రభుత్వాన్ని నడపిన సోనియా సీపీపీ నేతగా ఎన్నికవడం స్వాగతించదగిన విషయమని వారు అన్నారు. సోనియా నాయకత్వంలో కాంగ్రెస్ ఎంపీలు దేశంలోని ప్రజాసమస్యలపై విస్తృతంగా పోరాడతారని, ఆమె నేతృత్వంలో పార్టీ మరింత బలపడి రాబోయే రోజుల్లో అధికారంలోకి వచ్చే స్థాయికి చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, సీఎల్పీ మాజీ నేత కె.జానారెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రావణ్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు పొన్నం ప్రభాకర్, జెట్టి కుసుమకుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, బొల్లు కిషన్ తదితరులున్నారు.

## నిమ్స్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించరా?

### ఎస్సీ కమిషన్ సభ్యుడు రాములు ఆగ్రహం



**హైదరాబాద్:** నిమ్స్ ఆసుపత్రి వైద్యులు పేద రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యుడు కె.రాములు ఆరోపించారు. నిమ్స్‌లోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన ఉద్యోగులకు రాజ్యాంగం కల్పించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తున్నారా? లేదా? అనే అంశంపై శనివారం నిమ్స్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మనోహర్, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ ఇతర అధికారులు కమిషన్ ముందు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిమ్స్ ఆసుపత్రిలో అన్ని విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న షెడ్యూల్డ్ కులాల సిబ్బందితో సమావేశమయ్యారు. సుమారు 28 ఏళ్లపాటు నర్సింగ్ విభాగంలో విధులు నిర్వహించిన సావిత్రి అనే ఉద్యోగి ఉద్యోగ విరమణ చేయనుంది. ఎన్నో ఏళ్లు విధులు నిర్వహించినా.. పదోన్నతి లేకుండానే పదవీ విరమణ చేస్తున్నట్లు కమిషన్ దృష్టికి తీసుకువచ్చింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రాములు.. ఉద్యోగి చచ్చినా పదోన్నతి కల్పించరా? అని డైరెక్టర్‌ను ప్రశ్నించారు. నిమ్స్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించడం లేదని, ఎస్సీలకు పదోన్నతిలో అన్యాయం జరుగుతోందని పలువురు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరుగుతున్న అన్యాయంపై షెడ్యూల్డ్ కులాల ఉద్యోగ సంఘాల నాయకులు రాములుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

# జీ 'హుజూర్'.. ఎవరో?

- హుజూర్‌నగర్ అసెంబ్లీ స్థానానికి రేపు ఉత్తమ్ రాజీనామా
- అనివార్యం కానున్న ఉపఎన్నిక.. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరన్నదానిపై సర్వత్రా ఆసక్తి
- ఆసక్తి లేదంటున్న ఉత్తమ్ సతీమణి పద్మావతి
- కొత్త అభ్యర్థి కోసం ఉత్తమ్ వెతుకులాట

**సాక్షి, హైదరాబాద్:** నల్లగొండ లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికైన టీపీసీసీ చీఫ్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి సోమవారం ఎమ్మెల్యే పదవికి రాజీనామా సమర్పించనున్నారు. ఎంపీగా ఎన్నికైన నేపథ్యంలో అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలసి హుజూర్‌నగర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా ఇవ్వనున్నారు. ఆయన రాజీనామాతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యం కానుంది. దీంతో హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఉత్తమ్ స్థానంలో ఎవరు పోటీ చేస్తారన్నది ఆసక్తిగా మారింది.

**సతీమణే వారసురాలా..?**

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామా అనివార్యం కావడంతో ఆ స్థానం ఏర్పాటైన నాటి నుంచి ఎమ్మెల్యేగా ఉన్న ఉత్తమ్ వారసత్వం ఎవరికి వస్తుందన్నది నియోజకవర్గంలోనూ, రాష్ట్ర రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. నియోజకవర్గ వ్యాప్తంగా గట్టి కేడర్, అనుచరులున్న ఉత్తమ్ స్థానంలో ఎవరికి అవకాశం వస్తుందన్న దానిపై పలు రకాల చర్చలు జరుగుతున్నాయి. ఈసారి అక్కడి నుంచి కోదాడ మాజీ ఎమ్మెల్యే, ఉత్తమ్ సతీమణి పద్మావతిరెడ్డి బరిలో ఉంటారని ప్రచారం జరుగుతోంది. ఆమెకు కూడా నియోజకవర్గ ప్రజలతో మంచి సంబంధాలున్నాయి. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్ బిజీగా ఉంటే నియోజకవర్గంలో ఆమె పర్యటించి ప్రజాసమస్యల్ని పరిష్కరిస్తుంటారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు అన్ని మండలాల్లోని నేతలను ఆమె గుర్తుపట్టి పలకరించగలిగేంత సంబంధాలున్నాయి. అయితే, ఈ దఫా పోటీకి ఆమె ఆసక్తిగా లేరని తెలుస్తోంది. తనకూ ఓ నియోజకవర్గం ఉన్నందున దాన్ని వదులుకుని భర్త ప్రాతినిధ్యం వహించిన స్థానానికి వెళ్లడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులొస్తాయనే ఆలోచనతో ఆమె పోటీకి నిరాకరిస్తున్నట్టు సమాచారం. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పద్మావతి కోదాడలో పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయినా నల్లగొండ లోక్‌సభ ఎన్నికల్లో తన భర్తకు మంచి మెజార్టీ సాధించిపెట్టారు. హుజూర్‌నగర్ నుంచి ఆమె పోటీ చేయబోరని ఉత్తమ్ కుటుంబ సన్నిహితుల ద్వారా తెలుస్తోంది.

### మరి ఎవరు..?

ఉత్తమ్ పద్మావతి ఉప ఎన్నిక బరిలో లేకపోతే ఎవరు పోటీ చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. నియోజకవర్గ నేతలకే చాన్సిస్తారా...లేక జిల్లాకు చెందిన బిగ్‌షాట్స్‌ను ఎవరినయినా తీసుకువస్తారా.. అన్నది ఇప్పుడు హుజూర్‌నగర్ నియోజకవర్గంలో హాట్‌టాపిక్ అయింది. ఉత్తమ్ కూడా దీనిపై సీరియస్‌గా ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. కొత్తవారిని బరిలో దింపాల్సి వస్తే ఎవరికి అవకాశం ఇవ్వాలనే దానిపై ఆయన అంతర్గతంగా లెక్కలు వేసుకుంటున్నట్టు తెలుస్తోంది. దేశంలో చాలామంది ఎమ్మెల్యేలు ఎంపీలుగా గెలిచారని, ఆయా స్థానాలకు ఉప ఎన్నికలు జరగాలంటే కనీసం మూడు, నాలుగు నెలల సమయం ఉన్నందున ఉత్తమ్‌కు ప్రత్యామ్నాయం ఎవరనే విషయం ఇంకా చర్చకు రాలేదని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. కాంగ్రెస్‌కు కంచుకోట కావడంతోపాటు టీపీసీసీ చీఫ్ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గంలో బలమైన అభ్యర్థిని బరిలోకి దింపుతామని అంటున్నాయి. ఈ నేపథ్యంలో పద్మావతి చివరకు పోటీకి ఒప్పుకుంటారా... ఉత్తమ్ వారసత్వాన్ని కొత్త నేతలు తీసుకుంటారా.. అన్నది ఉపఎన్నిక నోటిఫికేషన్ తర్వాతే తేలనుంది.



## బాధ్యతలు స్వీకరించిన కిషన్‌రెడ్డి

**సాక్షి, న్యూఢిల్లీ:** హోం శాఖ సహాయ మంత్రిగా గంగాపురం కిషన్ రెడ్డి శనివారం ఢిల్లీలోని హోం శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ హాజరై కిషన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు, ఎంపీ అరవింద్, బీజేపీ నేతలు డీకే అరుణ, విష్ణువర్ధన్ రెడ్డి, సత్యకుమార్, ఆర్.శ్రీధర్‌రెడ్డి, వై.ఎల్.శ్రీనివాస్ తదితరులు హాజరై కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కిషన్‌రెడ్డి సతీమణి, కుమారుడు, కుమార్తె కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కేంద్ర హోం మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అమిత్‌షాను కలిసి కిషన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

# డీఎల్ పోస్టుల భర్తీ మరింత ఆలస్యం!

**సాక్షి, హైదరాబాద్:** గురుకుల డిగ్రీ కాలేజీల్లో డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీ మరింత ఆలస్యం కానుంది. జూన్ మొదటివారంలోగా భర్తీ పూర్తి చేసి రెండో వారంలో జూనియర్ లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలని గురుకుల నియామకాల బోర్డు (టీఆర్‌ఈఐఆర్‌బీ) భావించింది. ఇందులో భాగంగా మే మొదటి వారంలోనే డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాలకు సంబంధించి 1:2 జాబితా విడుదల చేసింది. ఉద్యోగాలకు ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మే 7 నుంచి నిర్వహించింది. ఈ క్రమంలో నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా అర్హతలు పరిశీలించారు. కానీ చాలా మంది అభ్యర్థులు నిర్దేశిత తేదీ తర్వాత పొందడంపై బోర్డు అధికారులు తెల్లముఖం వేశారు.

**నోటిఫికేషన్ నాటికి పరీక్ష రాసినా..**

డిగ్రీ లెక్చరర్ ఉద్యోగానికి పీజీతో పాటు నెట్ (నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్) లేదా సెట్(స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్) లేదా పీహెచ్‌డీ ఉండాలి. ఈ క్రమంలో కొందరు అభ్యర్థులు సెట్ అర్హతను దరఖాస్తులో పేర్కొన్నా అప్పటికి పరీక్ష మాత్రమే రాశారు. డీఎల్ నోటిఫికేషన్ వెలువడిన తర్వాత సెట్ ఫలితాలు వచ్చాయి. దీంతో ఆ మేరకు అర్హత పత్రాలను సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియకు తీసుకొచ్చారు. వీటిని గమనించిన అధికారులు ఆయా అభ్యర్థుల జాబితాను రూపొందించారు. నోటిఫికేషన్ వెలువడిన నాటికే పరీక్ష రాశామని అభ్యర్థులు అధికారులకు చెప్పారు. నోటిఫికేషన్‌లో ఉన్న నిబంధన ప్రకారం అప్పటికే అర్హత పొంది ఉండాలి. ఈ క్రమంలో ప్రక్రియ నిలిచిపోయింది.

**కొత్త జాబితా ఇవ్వాల్సిందే..**

డీఎల్ ఉద్యోగాలకు సంబంధించి విడుదల చేసిన 1:2 ప్రాథమిక జాబితాను సవరించాలని గురుకుల నియామకాల బోర్డు భావిస్తోంది. నోటిఫికేషన్ నాటికి అర్హతలున్న వారినే పరిగణనలోకి తీసుకుంటూ మిగతా వారిని తొలగించేందుకు గురుకుల బోర్డు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. రోస్టర్ పాయింట్ల ఆధారంగా జాబితా రూపకల్పనకు ఉపక్రమించినట్లు సమాచారం. ఈ తంతు పూర్తికావాలంటే కనీసం నెలరోజుల గడువు పడుతుందని బోర్డు అధికారి ఒకరు పేర్కొన్నారు. మరోవైపు నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతలు, గడువు ఆధారంగానే నియమాకాలు చేపట్టాలని పలువురు అభ్యర్థులు ఇప్పటికే గురుకుల బోర్డు అధికారులను కలిసి వివరించారు. కాగా, ప్రాథమిక జాబితా నుంచి తొలగిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని కొందరు అభ్యర్థులు చెబుతున్నారు. దీంతో గురుకుల డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాల భర్తీ మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది.

# గిరిజన వర్సిటీ మరింత ఆలస్యం!

- కేంద్ర కేబినెట్ ఆమోదం తర్వాతే ప్రారంభం
- 2019–20లో తరగతుల ప్రారంభం లేనట్లే

**సాక్షి, హైదరాబాద్:** గిరిజన యూనివర్సిటీ ప్రారంభం మరింత ఆలస్యం కానుంది. 2019–20 విద్యా సంవత్సరం నుంచి వర్సిటీ కార్యకలాపాలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించి చర్యలు చేపట్టినప్పటికీ అడ్డంకులు మాత్రం తొలగలేదు. తాత్కాలిక భవనం ఏర్పాటు చేసి మౌలిక వసతులు సైతం ఏర్పాటు చేసుకున్నప్పటికీ ఈ ఏడాది ప్రవేశాల ప్రక్రియ కొలిక్కి రాలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చట్టంలో రాష్ట్రానికి గిరిజన యూనివర్సిటీని కేంద్రం మంజూరు చేసింది. ఈ మేరకు రెండేళ్ల క్రితమే కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించింది. అయితే గిరిజన వర్సిటీకి సంబంధించి ప్రత్యేక చట్టం రూపొందించి కేబినెట్ ఆమోదం పొందాలి. కానీ ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. ఆరు నెలలుగా ఎన్నికల వాతావరణం ఉండటం.. ఇటీవల పార్లమెంటు ఎన్నికలు జరగడంతో ఈ ప్రక్రియ పెండింగ్‌లోనే ఉంది. దీంతో వర్సిటీ ప్రారంభ ప్రక్రియ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఇంకా కొలువుదీరలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జరిగే కేబినెట్ సమావేశంలో తీసుకునే నిర్ణయంపైన గిరిజన వర్సిటీ ఏర్పాటుపై స్పష్టత వస్తుంది.

**కేటాయింపులు పూర్తయినా..**

ఉమ్మడి వరంగల్ జిల్లా జాకారం సమీపంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 483 ఎకరాలు కేటాయించింది. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు సర్వే పూర్తి చేసి అందుకు సంబంధించి భూమిని గిరిజన సంక్షేమ శాఖకు అప్పగించింది. భవన నిర్మాణాలు పూర్తి చేయాలంటే ఎక్కువ సమయం పడుతుందని భావించిన గిరిజన సంక్షేమ శాఖ.. అక్కడ అందుబాటులో ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్(వైటీసీ)ని గిరిజన వర్సిటీకి కేటాయించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి గిరిజన సంక్షేమం, విద్యా శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి గిరిజన వర్సిటీపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. దీనిలో భాగంగా గిరిజన వర్సిటీ నిర్వహణను హెచ్‌సీయూ (హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ) వీసీకి అప్పగించారు. కోర్సులు నిర్ధారించి ప్రవేశాలకు సంబంధించి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కానీ ప్రవేశాల ప్రక్రియ ఏ మాత్రం ముందుకు సాగడం లేదు.

## కేంద్ర కేబినెట్ ఆమోదం లభిస్తేనే..

వాస్తవానికి 2019–20 విద్యా సంవత్సరంలో గిరిజన వర్సిటీ ప్రారంభిస్తే ముందుగా ఆరు కోర్సులను ప్రారంభించాలని యంత్రాంగం నిర్ణయించింది. ఇందులో డిగ్రీ, పీజీ కోర్సులున్నాయి. డిగ్రీలో బీఏ (హోటల్ మేనేజ్‌మెంట్), బీసీఏ, బీబీఏ, పీజీ కేటగిరీలో ఎంసీఏ, ఎంబీఏ (మార్కెటింగ్, ప్యాకేజింగ్), ఎంఏ (గిరిజన సంస్కృతి, జానపద కళలు) కోర్సులను ప్రారంభిస్తారు. మరిన్ని పీజీ, పీహెచ్‌డీ కోర్సులను దశల వారీగా అందుబాటులోకి తెస్తారు. తొలి ఏడాది ప్రారంభించే కోర్సుల్లో మొత్తంగా 180 మందికి ప్రవేశాలు కల్పిస్తారు. ఏటా తరగతులు పెరుగు తుండటం, కొత్త కోర్సుల్లో ప్రవేశాలతో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. గిరిజనుల నేపథ్యంలో ఏర్పాటు చేసిన యూనివర్సిటీ కావడంతో వారికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రవేశాల్లో 30 శాతం సీట్లు వారికి కేటాయించనుంది. ఈ మేరకు యూనివర్సిటీ చట్టంలో పొందుపరుస్తారని, చట్టం ప్రకారమే ప్రవేశాలు, నిర్వహణ కార్యక్రమాలు జరుగుతా యని అధికారులు చెబుతున్నారు. త్వరలో జరిగే కేబినెట్ సమావేశంలో గిరిజన వర్సిటీ బిల్లుకు ఆమోదం లభిస్తేనే అందుబాటులోకి వస్తుందని, ఆ మేరకు చట్టం ఆమోదం కొరకు వేచిచూస్తున్నట్లు ఉన్నతాధికారి ఒకరు 'సాక్షి'తో అన్నారు.

# అశోకా.. ఏంటీ లీల!

- అనామిక పాసైనట్లా.. ఫెయిలైనట్లా..?
- రీవెరిఫికేషన్ తరువాత ఫలితాల వెల్లడిలోనూ తప్పులు
- ఇంటర్ తెలుగులో ఫెయిలై మనస్తాపంతో ఆత్మహత్య
- 48 మార్కులతో పాసైనట్లు రీవెరిఫికేషన్‌లో వెల్లడి
- అయితే జవాబు పత్రంలో వచ్చింది.. 21 మార్కులే!
- ఇంటర్ బోర్డు తప్పులతో విద్యార్థుల్లో గందరగోళం



అనామిక (ఫైల్)




రీవెరిఫికేషన్‌లో అనామిక 48 మార్కులతో పాసైనట్లుగా బోర్డు వెలువరించిన మెమో

**హైదరాబాద్:** ఇంటర్ ఫలితాల్లో ఫెయిలైనట్లు వచ్చిన మార్కులతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని అనామిక రీవెరిఫికేషన్‌లో ఉత్తీర్ణురాలైనట్లు బోర్డు ప్రకటించింది. అయితే జవాబు పత్రాల ఫొటో స్టాట్‌లో మాత్రం 21 మార్కులే వచ్చినట్లు చూపించారు. దీంతో అనామిక పాసైయినట్లా.. ఫెయిలైనట్లా..? అన్నది సందిగ్ధంగా మారింది. రీవెరిఫికేషన్ చేసిన తరువాత కూడా ఇలాంటి తప్పిదాలు చోటుచేసుకోవడంతో ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ కుమార్ తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. మెమోలో ఒకటి కాదు.. రెండు కాదు.. ఆమెకు ఏకంగా 28 మార్కులు పెరిగినట్లు చూపించారు. ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌కి చెందిన గణేష్‌కుమార్, హారిక దంపతులకు అనామికతో పాటు ఉదయ, సీతల్, భావేష్ అనే పిల్లలున్నారు. కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగించే వీరికి పిల్లలను చదివించే ఆర్థిక స్థోమత లేదు. దీంతో అనామిక సికింద్రాబాద్ చాచానెహ్రూనగర్‌లో ఉంటున్న అమ్మమ్మ ఉమా వద్దే ఉంటూ చదువుకుంది. కింగ్‌కోఠిలోని ప్రగతి మహావిద్యాలయలో ఇంటర్ సీఈసీ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. చదువులోనే కాదు.. ఆటలు, ఎన్‌సీసీ, ఇతర కార్యక్రమాల్లో ఆమె చురుగ్గా పాల్గొనేది. ఇంటర్ బోర్డు నిర్లక్ష్యంతో నిండు ప్రాణంబలైంది.

**చనిపోయిన తర్వాత ఫలితాలా?: ఉమ, ఉదయ**

అనామిక పాసైందన్న మెమోను చూసిన తరువాత ఆమె అమ్మమ్మ ఉమ, సోదరి ఉదయ మీడియాతో మాట్లాడారు. చనిపోయిన అనామిక పాసైనందుకు ఆమె ప్రాణాలను తెచ్చి ఇవ్వాల్సిన బాధ్యత అధికారులదేనని, ఈ అంశంపై న్యాయం కోసం కోర్టుకెళ్తామని, న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ఉదయ బోరున విలపిస్తూ చెప్పింది. ఫలితాలు ముందే సరిగ్గా వచ్చి ఉంటే అనామిక బతికేదని, ఇంటర్ బోర్డు అధికారులు తమ పిల్లను పొట్టనబెట్టుకున్నారని ఉమ ఆవేదన వ్యక్తం చేశారు.

## అనామిక పాస్ కాలేదు: ఇంటర్ బోర్డు

అయితే అనామిక పాస్ కాలేదని ఇంటర్ బోర్డు సాయంత్రం ఓ ప్రకటన చేసింది. అనామిక సోదరి ఉదయ ఇంటర్ బోర్డు తప్పిదం కారణంగానే తన సోదరి ఆత్మహత్యకు పాల్పడిందన్న ఆరోపణను ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ ఖండించారు. ఈ విషయంలో తాము హైకోర్టు ఆదేశాల మేరకు పూర్తి పారదర్శకతతో వ్యవహరించామని, రీ వెరిఫికేషన్‌లో అనామికకు కేవలం 20 నుంచి ఒకే ఒక్క మార్కు పెరిగి 21 వచ్చాయని తెలిపారు. కానీ, క్లరికల్ మిస్టేక్ వల్ల ఫలితాల వెల్లడిలో 48 మార్కులు వచ్చినట్లు చూపించిందని వివరించారు. ఈ మేరకు అశోక్ శనివారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. అనామిక రాసిన 24 పేజీల బుక్‌లెట్‌ను కూడా జత చేశారు.

## నాడు 20.. మెమోలో 48... జవాబు పత్రంలో 21...

ఇంటర్ బోర్డు వెల్లడించిన ఫలితాల్లో అనామిక (హాల్‌టికెట్ నంబర్ 1961112037)కు ఇంగ్లిష్–64, ఎకనామిక్స్–55, సివిక్స్ –67, కామర్స్–75, తెలుగు–20 మార్కులు వచ్చినట్లు ప్రకటించింది. మిగతా సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించిన ఆమెకు తెలుగులో 20 మార్కులు మాత్రమే రావడంతో ఫెయిలైంది. పరీక్ష బాగా రాసినప్పటికీ ఎందుకు ఫెయిలైందో అర్థం కాక ఆమె ఒత్తిడికి గురైంది. అదే బాధతో ఏప్రిల్ 18న ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫెయిలైన విద్యార్థులందరి జవాబు పత్రాలను రీవెరిఫికేషన్ చేయడంతో.. అందులో అనామిక పాసైనట్లు వెల్లడైంది. తెలుగులో ఆమెకు 28 మార్కులు పెరిగి.. మొత్తంగా 48 మార్కులు వచ్చినట్లు ఇంటర్ బోర్డు తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. తమ కుమార్తె పాసైనట్లు తేలడంతో అనామిక కుటుంబం మరోసారి శోకసంద్రంలో మునిగిపోయింది. అధికారులు మూల్యాంకనాన్ని సరిగ్గా చేపట్టి ఉంటే తమ చిన్నారి బతికి ఉండేదని అమ్మమ్మ ఉమ, సోదరి ఉదయ కన్నీటిపర్యంతం అయ్యారు. అయితే జవాబు పత్రంలో ఫొటో స్టాట్‌లో మాత్రం అనామికకు 21 మార్కులే వచ్చినట్లు చూపించారు. దీంతో తీవ్ర గందరగోళం నెలకొంది.



సహోద్యోగులపై క్రాడిక్ విచక్షణారహితంగా కాల్పులు జరిపిన బహుళ అంతస్తుల ప్రభుత్వ భవంతి ఇదే

# అమెరికాలో ఉన్మాది కాల్పులు

- వర్జీనియాలో సహోద్యోగులపై ఇంజనీర్ దాడి
- 12 మంది దుర్మరణం • ఉన్మాదిని హతమార్చిన పోలీసులు

**వాషింగ్టన్:** అగ్రరాజ్యం అమెరికా మరోసారి నెత్తురోడింది. వర్జీనియా రాష్ట్రంలోని వర్జీనియా బీచ్ సిటీలో ఓ ఇంజనీర్ శుక్రవారం తుపాకీతో సహోద్యోగులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ దుర్ఘటనలో 12 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కాల్పుల సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నిందితుడ్ని కాల్చిచంపారు. కాల్పులు జరిపిన వ్యక్తిని డ్వేన్ క్రాడిక్(40)గా గుర్తించారు. ఈ విషయమై వర్జీనియా బీచ్ పోలీస్ చీఫ్ జేమ్స్ సెర్వెరా మాట్లాడుతూ.. నగర మున్సిపల్ శాఖలోని ప్రజాపనుల విభాగంలో గత 15 సంవత్సరాలుగా డ్వేన్ క్రాడిక్ ఇంజనీర్‌గా సేవలు అందిస్తున్నాడని తెలిపారు. అయితే తన విధుల పట్ల అసంతృప్తిగా ఉన్న డ్వేన్ క్రాడిక్.. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు(స్థానిక కాలమానం) సైలెన్సర్ అమర్చిన తుపాకీతో తన కార్యాలయం ఉన్న వర్జీనియా బీచ్ మున్సిపల్ సెంటర్ వద్దకు చేరుకున్నాడు. ఆఫీసులోకి వచ్చేముందు గేటుదగ్గర ఒకరిని తుపాకీతో కాల్చాడు. అనంతరం మున్సిపల్ శాఖ కార్యాలయాలున్న రెండో భవంతిలోకి దూసుకెళ్లాడు. ఆ భవంతిలోని మూడు అంతస్తుల్లోని సహోద్యోగులపై విచక్షణారహితంగా కాల్పులు జరుపుతూ ముందుకు సాగాడు.

**గదుల్లో దాక్కున్న ఉద్యోగులు..**

ఈ సందర్భంగా కాల్పుల శబ్దం విన్న కొందరు ఉద్యోగులు.. గది తలుపులు మూసేసి 911కు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, క్రాడిక్‌ను నిలువరించే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య భీకర కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో పోలీసులు డ్వేన్ క్రాడిక్‌ను కాల్చిచంపారు. క్రాడిక్ జరిపిన కాల్పుల్లో ఓ కాంట్రాక్టర్‌తో పాటు 11 మంది సహోద్యోగులు ప్రాణాలు కోల్పోయారు.



ఘటనాస్థలిలో రక్తసిక్తమైన ఉద్యోగి

క్రాడిక్ ఈ హత్యలు ఎందుకు చేశాడు? సహోద్యోగులతో ఏమైనా గొడవపడ్డాడా? ఉన్నతాధికారులు మందలించారా? అన్న విషయమై పోలీసులు స్పష్టత ఇవ్వలేదు. ఇది వర్జీనియా బీచ్ చరిత్రలోనే అత్యంత దుర్దినమని నగర మేయర్ అన్నారు.

# సీపీపీ నేతగా సోనియా

- పేరును ప్రతిపాదించిన మన్మోహన్, అంగీకరించిన కాంగ్రెస్ నేతలు
- కొదమసింహాల్లా పోరాడుతాం: రాహుల్ గాంధీ



కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చీఫ్‌గా సోనియాను ఎన్నుకుంటున్న దృశ్యం. చిత్రంలో రాహుల్, మన్మోహన్

**న్యూఢిల్లీ:** యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీలో కీలక బాధ్యతలు చేపట్టారు. పార్లమెంటులోని సెంట్రల్‌హాలులో శనివారం జరిగిన సమావేశంలో కాంగ్రెస్ నేతలు ఆమెను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ(సీపీపీ) నేతగా ఎన్నుకున్నారు. తొలుత సోనియాగాంధీ పేరును మాజీ ప్రధాని, కాంగ్రెస్ సీనియర్ నేత మన్మోహన్‌సింగ్ ప్రతిపాదించగా, మిగతా కాంగ్రెస్ ఎంపీలు, ముఖ్య నేతలు చేతులు పైకెత్తి తమ అంగీకారం తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ లోక్‌సభ పక్షనేతను ఎంపిక చేసే బాధ్యతను పార్టీ సోనియాకు అప్పగించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సోనియాగాంధీ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమితో కాంగ్రెస్ శ్రేణులు దిగులుపడొద్దని సూచించారు. పార్లమెంటులో సమర్థవంతమైన ప్రతిపక్ష పాత్ర పోషించాలనీ, రాజ్యసభలో ఒకేరకమైన భావజాలం ఉన్న రాజకీయ పార్టీలతో కలిసి ముందుకు సాగాలని కాంగ్రెస్ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు.

**నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తాం..**

'ఈ సంక్షోభ సమయంలో కాంగ్రెస్ పార్టీకి ఎదురవుతున్న పలు సవాళ్లను మనం గుర్తించాలి. ఇటీవల సమావేశమైన సీడబ్ల్యూసీ పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించింది. పార్టీని పటిష్టం చేయడానికి తీసుకోవాల్సిననిర్ణయాలపై చర్చించాం. యూపీఏ ప్రభుత్వం గతంలో తీసుకొచ్చిన చరిత్రాత్మక చట్టాలను గత ఐదేళ్ల కాలంలో ఎన్డీయే ప్రభుత్వం రద్దుచేయకుండా అడ్డుకోగలిగాం. సంస్కరణలు, కీలక అంశాల విషయంలో నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాం. ప్రభుత్వం చేసే విభజన, తిరోగమన రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తాం' అని సోనియా స్పష్టం చేశారు.

**రాహుల్‌పై ప్రశంసలు..**

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌గాంధీ అద్భుతంగా పోరాడారని సోనియా కితాబిచ్చారు. 'కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఆయన కోట్లాది మంది ఓటర్లతో పాటు ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త ప్రేమను, గౌరవాన్ని చూరగొన్నారు. రైతులు, చిరువ్యాపారులు, యువత, మహిళలు, సమాజంలోని బలహీనవర్గాల పట్ల మోదీ ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరించడాన్ని ధైర్యంగా నిలదీశారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో అవిశ్రాంతంగా, ధైర్యంగా దూసుకుపోయిన రాహుల్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. లోక్‌సభలో 44 మంది, రాజ్యసభలో 55 మంది ఎంపీల బలం మాత్రమే ఉన్నప్పటికీ రాహుల్ నాయకత్వంతో కాంగ్రెస్ ప్రభుత్వ తప్పులను వెలుగులోకి తీసుకొచ్చింది. నేనిక్కడ మాట్లాడుతున్నప్పుడు కూడా రాహుల్ పార్టీ అధ్యక్ష పదవికి చేసిన రాజీనామాను వెనక్కి తీసుకోవాలని దేశవ్యాప్తంగా విజ్ఞప్తులు వస్తున్నాయి. రాహుల్ నాయకత్వంలోనే కాంగ్రెస్ ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చింది' అని తెలిపారు. రాజ్యసభలో కాంగ్రెస్ బలం తగ్గనున్న నేపథ్యంలో భావసారూప్య పార్టీలతో కలిసి ముందుకెళ్లాలని సోనియా పునరుద్ఘాటించారు. మరోవైపు సీపీపీ నేతగా సోనియా ఎంపికపై రాహుల్ స్పందిస్తూ..'పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నికైన సోనియాకు శుభాకాంక్షలు. ఆమె నాయకత్వంలో కాంగ్రెస్ భారత రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేస్తుందని ఆశిస్తున్నా' అని ట్వీట్ చేశారు.

**బీజేపీని ఇష్టానుసారం వ్యవహరించనివ్వం: రాహుల్:** లోక్‌సభకు కొత్తగా ఎన్నికైన 52 మంది కాంగ్రెస్ ఎంపీలు రాజ్యాంగాన్ని, రాజ్యాంగబద్ధమైన సంస్థలను కాపాడేందుకు కొదమసింహాల గుంపులా పోరాడుతారని కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభుత్వాన్ని పార్లమెంటులో తమ ఇష్టానుసారం వ్యవహరించనివ్వబోమని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. 'బ్రిటిష్ హయాంలో ఉన్నట్టు ఈ ఎన్నికల్లో ఏ రాజ్యాంగబద్ధమైన సంస్థ కూడా సహకరించకపోయినా కాంగ్రెస్ పోరాడి గెలిచింది. ఇప్పుడు మళ్లీ పోరాడుతాం. మనమంతా కులం, మతం, రంగు, జాతి, రాష్ట్రం అనే భేదభావం లేకుండా రాజ్యాంగ పరిరక్షణకు, దేశంలోని ప్రతీఒక్కరి హక్కుల కోసం పోరాడుతున్నామని గుర్తుంచుకోవాలి. ఎన్నికల సందర్భంగా బీజేపీ విద్వేషం, ఆగ్రహాన్ని కాంగ్రెస్ ప్రేమ, ఆప్యాయతతో అడ్డుకుంది. అందుకే ఆ పార్టీ నేతలు కాంగ్రెస్ ముక్తభారత్ అని కలవరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ లేకపోతే తమకు అడ్డుకునేవారే ఉండరని భావిస్తున్నారు' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈసారి పార్లమెంటులో మరింత తక్కువ సమయం లభించే అవకాశముందనీ, కాబట్టి ప్రజావాణిని గట్టిగా వినిపించాలని సూచించారు. ఈ ఎన్నికల్లో కొందరు పాతముఖాలు (మల్లికార్జున ఖర్గే, సునీల్ కుమార్ జాఖడ్, జ్యోతిరాదిత్య సింధియా) ఇక్కడుంటే బాగుండేదని విచారం వ్యక్తం చేశారు.

## అధ్యక్ష పదవి రేసులో నలుగురు..

**సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తాను ఉండబోనని రాహుల్ ప్రకటించిన నేపథ్యంలో కొత్త అధ్యక్షుడిగా ఎవరు బాధ్యతలు చేపడతారన్న విషయమై రాజకీయవర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ పదవిలో గాంధీయేతర నేతను నియమించి, ఆయనకు సాయంగా సీనియర్ నేతలతో ఓ కమిటీని నియమించవచ్చని పార్టీ వర్గాల్లో జోరుగా చర్చసాగుతోంది. కేరళ పీసీసీ మాజీ చీఫ్, 7 సార్లు లోక్‌సభ సభ్యుడిగా గెలుపొందిన కొడికున్నిల్ సురేశ్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి రేసులో తొలిస్థానంలో ఉన్నట్లు తెలుస్తోంది. బెంగాల్‌లో టీఎంసీ, బీజేపీ హవాను తట్టుకుని ఐదోసారి ఎంపీగా గెలిచిన అధిర్ రంజన్ చౌదరి, కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనోజ్ తివారీ, కేంద్ర మాజీ మంత్రి శశిథరూర్ పేర్లు వినిపిస్తున్నాయి. జూన్ 17 నుంచి లోక్‌సభ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సోనియా వీలైనంత త్వరగా ఈ నియామకం చేపట్టే అవకాశముందని భావిస్తున్నారు.



అమిత్‌షాకు పుష్పగుచ్ఛమిస్తున్న సహాయ మంత్రి కిషన్ రెడ్డి. చిత్రంలో సహాయమంత్రి నిత్యానంద్

# ప్రజా సంక్షేమమే లక్ష్యం

**హోం మంత్రి అమిత్ షా**

**న్యూఢిల్లీ:** దేశ భద్రత, ప్రజా సంక్షేమమే మోదీ ప్రభుత్వ ప్రథమ లక్ష్యాలని నూతన హోం మంత్రి అమిత్ షా తెలిపారు. హోం మంత్రిగా రెండు రోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అమిత్ షాకు హోం మంత్రిత్వ శాఖ పనితీరు, ప్రస్తుతం శాఖకు సంబంధించిన కీలక అంశాలను అధికారులు వివరించారు. షాతో పాటు సహాయ మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన జి.కిషన్‌రెడ్డి, నిత్యానంద్ రాయ్ కూడా దాదాపు గంటసేపు జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్నారు. అంతకుముందు నార్త్‌బ్లాక్‌లోని హోం శాఖ కార్యాలయంలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి రాజీవ్ గౌబా, ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ రాజీవ్ జైన్ తదితర సీనియర్ అధికారులు మంత్రి అమిత్ షాకు ఘన స్వాగతం పలికారు. సమావేశం అనంతరం అమిత్ షా ట్విట్టర్‌లో..'దేశ భద్రత, ప్రజా సంక్షేమం మోదీ ప్రభుత్వం ప్రథమ లక్ష్యాలు. మోదీజీ నేతృత్వంలో ఈ లక్ష్యాల సాధనకు శాయశక్తులా కృషి చేస్తా' అని అన్నారు.

## రక్షణ బాధ్యతల్లో రాజ్‌నాథ్



**న్యూఢిల్లీ:** రక్షణ శాఖ మంత్రిగా రాజ్‌నాథ్ సింగ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్, ఎయిర్ చీఫ్ మార్షల్ బీఎస్ ధనోవా, నూతన నేవీ చీఫ్ కరంబీర్ సింగ్‌లతో రైసినా హిల్స్‌లోని రక్షణ మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లు, త్రివిధ దళాల పనితీరుపై వేర్వేరు నివేదికలు సిద్ధం చేయాలని వారికి సూచించారు. ఈ సమావేశంలో రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ నాయక్, రక్షణ కార్యదర్శి సంజయ్ మిత్రా, సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. త్రివిధ దళాల్లో సుదీర్ఘకాలంగా సుప్తావస్థలో ఉన్న ఆధునీకరణను వేగవంతం చేయడంతో పాటు వారి పోరాట సంసిద్ధతకు భరోసా ఇవ్వడం, అలాగే చైనాతో సరిహద్దు వద్ద శాంతి నెలకొల్పటం, చైనా నుంచి వచ్చే ఎలాంటి వ్యతిరేకతనైనా ఎదుర్కోడానికి అవసరమైన సైనిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం వంటివి రక్షణ మంత్రిగా రాజ్‌నాథ్ సింగ్ ముందున్న అత్యంత కీలక సవాళ్లు.



డెక్కన్ క్వీన్ రైలులో శనివారం మహిళా ప్రయాణికుల ఆనందం

| పంజాబ్ మెయిల్ | డెక్కన్ క్వీన్ |
|---|---|
| 107 | 90 |

**ముంబై:** మన దేశంలోనే అత్యంత దూరం నడిచే ఆ పాత రైలు బండి పంజాబ్ మెయిల్. ఆ రైలు జూన్ 1తో 107 ఏళ్లను పూర్తి చేసుకుంది. ముంబై నుంచి పుణెకు నడిచే డెక్కన్ క్వీన్ 89 ఏళ్లు పూర్తి చేసుకుంది. పంజాబ్ మెయిల్ ఆవిరితో నడిచే రైలు. ముంబై నుంచి పెషావర్ (ప్రస్తుతం పాక్‌లో ఉంది) వరకు నడిచింది. ఈ రైలు సర్వీసు మొదట్లో బ్రిటిషర్ల కోసమే ఉండేది. తర్వాత దిగువ తరగతి వారికీ అందుబాటులోకొచ్చింది. 1930లో ఈ రైలుకి మూడో తరగతి బోగీలను అమర్చారు. 1945లో ఏసీ సౌకర్యం వచ్చింది. ప్రస్తుతం ఈ రైలు విద్యుత్‌పైనే నడుస్తోంది. దేశ విభజనకు ముందు పంజాబ్ మెయిల్ ముంబై నుంచి పెషావర్ వరకు 2,496 కి.మీ. దూరం 47 గంటల్లో వెళ్లేదని సెంట్రల్ రైల్వేకు చెందిన చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి సునీల్ చెప్పారు. బ్రిటిష్ ఇండియాలో అత్యంత వేగంతో ప్రయాణించే రైలు ఇదే. ప్రస్తుతం ఈ రైలు ఫిరోజ్‌పూర్ వరకు నడుస్తోంది. అప్పట్లోనే పంజాబ్ మెయిల్లో బాత్‌రూమ్, రెస్టారెంట్ కార్, లగేజ్ పెట్టుకోవడానికి కంపార్ట్‌మెంట్ ఉండేవి. ఆరు బోగీలు ఉండే మెయిల్‌లో 3 ప్రయాణికుల కోసం కేటాయిస్తే మిగతావి ఉత్తరాల రవాణాకు వాడారు. ఈ 3 బోగీల్లో కేవలం 96 మంది ప్రయాణించే వీలుండేది. ఇక డెక్కన్ క్వీన్ రైలు 1930జనవరి 1న ప్రారంభమైంది. పుణె నుంచి ముంబై వరకు నడిచిన ఈ రైలు దేశంలో తొలి డీలక్స్ రైలు. ఈ డెక్కన్ క్వీన్ ఠంచనుగా షెడ్యూల్ టైమ్‌కు నడిచేది. అందుకే ఈ రైల్లో ప్రయాణించడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపించేవారని సునీల్ వివరించారు.

## హాక్ జెట్ తొలి మహిళా పైలట్ మోహనా



**నాగ్‌పూర్:** ఫ్లైట్ లెఫ్టినెంట్ మోహనా సింగ్ అరుదైన ఘనత సాధించారు. అత్యాధునిక హాక్ యుద్ధవిమానాన్ని పగటిపూట నడిపిన తొలి మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. బెంగాల్‌లోని కలైకుండా వాయుసేన కేంద్రంలో మోహనాసింగ్ శిక్షణను పూర్తిచేసుకున్నట్లు రక్షణశాఖ తెలిపింది. శిక్షణలో రాకెట్ల ప్రయోగం, బాంబులు జారవిడవడం, లక్ష్యాలను గురిచూసి కాల్చడం వంటి ప్రక్రియల్ని పూర్తిచేశారు. ఆమెకు 500 గంటలకుపైగా ఫ్లయింగ్ అనుభవం ఉండగా, ఇందులో 380 గంటలు హాక్ ఎంకే–132 జెట్‌ను నడిపారు.

## టీ షర్టు.. లెగ్గింగ్‌లు వద్దు

**ప్రభుత్వ ఉద్యోగుల డ్రెస్‌కోడ్‌పై తమిళనాడు ఆదేశం**

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** ప్రభుత్వ ఉద్యోగులు హుందాగా ఉండే సంప్రదాయ డ్రెస్‌కోడ్ పాటించాలని తమిళనాడు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా సచివాలయ మహిళా ఉద్యోగులు ధరించాల్సిన దుస్తులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గిరిజా వైద్యనాథన్ జీవో జారీ చేశారు. మహిళా ఉద్యోగులు ఇకపై చీర, సల్వార్ కమీజ్, చుడీదార్‌లను మాత్రమే ధరించి విధులకు హాజరు కావాలని కోరింది. చీర మినహా మిగిలిన అన్ని డ్రస్సులను విధిగా దుపట్టాతో ధరించాలని స్పష్టం చేసింది. దుస్తుల రంగులు సైతం సున్నితమైనవిగా ఉండాలని తెలిపింది. అలాగే పురుషులు ప్యాంటు, షర్టు ధరించి రావాలి. అలాగే, రంగు రంగుల టీ షర్టులు ధరించరాదని పేర్కొంది. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తెలిపింది.

# భారత్‌కు ట్రంప్ వాణిజ్య దెబ్బ

- భారత్‌కు 560 కోట్ల డాలర్ల రాయితీలు రద్దు
- జూన్ 5 నుంచి అమల్లోకి 'జీఎస్‌పీ హోదా రద్దు'



**వాషింగ్టన్:** భారత్‌కు కల్పించిన ప్రాధాన్య వాణిజ్య హోదా(జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్స్–జీఎస్‌పీ)ని ఈ జూన్ 5వ తేదీ నుంచి రద్దు చేస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దాంతో ఈ హోదా కింద భారత్‌కు అమెరికా నుంచి అందుతున్న సుమారు రూ.39 వేల కోట్ల(560 కోట్ల డాలర్లు) విలువైన వాణిజ్య రాయితీలు రద్దవుతాయి. తన మార్కెట్లలోకి అమెరికా ఉత్పత్తులకు సమానమైన అవకాశం కల్పిస్తామని భారత్ హామీ ఇవ్వదని అమెరికా నిర్ధారణకు రావడంతో అమెరికా ఈ చర్య తీసుకుంది. వర్ధమాన దేశాల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా అమెరికా చాలా ఏళ్ల నుంచి ఈ జీఎస్‌పీ హోదా విధానాన్ని అమలు పరుస్తోంది. ఈ హోదా పొందిన దేశాల నుంచి అమెరికా ఎలాంటి సుంకాలు విధించకుండా వేలాది ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటుంది.'భారత్ తన మార్కెట్లలో అమెరికాకు సమానమైన, సహేతుకమైన అవకాశం కల్పిస్తామని హామీ ఇవ్వదని నేను నిర్ధారణకొచ్చా. అందుకే భారత్‌కు కల్పించిన జీఎస్‌పీ హోదాను రద్దుచేస్తున్నాం' అని ట్రంప్ అన్నారు. కాగా, తమకు జీఎస్‌పీ హోదాను రద్దు చేసినప్పటికీ ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాల బలోపేతానికి అమెరికాతో కలిసి పని చేస్తూనే ఉంటామని భారత్ పేర్కొంది. అమెరికా చర్యపై స్పందిస్తూ భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటన జారీ చేసింది. జీఎస్‌పీ హోదా కింద భారత్ దాదాపు 2వేల ఉత్పత్తులను అమెరికాకు ఎలాంటి సుంకాలు చెల్లించకుండా ఎగుమతి చేసేది. ఈ హోదా కింద అమెరికా 2017లో 570 కోట్ల డాలర్ల విలువైన ఉత్పత్తులను భారత్ నుంచి సుంకాలు లేకుండా దిగుమతి చేసుకుంది. హోదా పొందాలంటే అమెరికా కంపెనీలు, పౌరులకు అనుకూలంగా వచ్చే మధ్యవర్తిత్వ తీర్పులను గౌరవించడం, అంతర్జాతీయ గుర్తింపు పొందిన కార్మిక హక్కులను గౌరవించడం,మేథో హక్కులను పరిరక్షించడం, అమెరికా కంపెనీలకు సమానమైన, సహేతుకమైన అవకాశం కల్పించడం వంటి నిబంధనలు పాటించాల్సి ఉంటుంది.

# 'త్రిభాష'పై తమిళ పార్టీల కన్నెర్ర

**చెన్నై/న్యూఢిల్లీ:** జాతీయ విద్యా విధానంలో భాగంగా త్రిభాషా విధానం అమలుకు కేంద్ర ప్రయత్నిస్తోందంటూ తమిళ రాజకీయ పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. హిందీని బలవంతంగా తమపై రుద్దేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించాయి. ద్వి భాషా విధానాన్నే కొనసాగిస్తామని తమిళ సర్కార్ తెలిపింది. ప్రముఖ శాస్త్రవేత్త కస్తూరిరంగన్ నేతృత్వంలో రూపొందించిన జాతీయ విద్యా విధానంలోని ప్రతిపాదనలు శుక్రవారం వెల్లడయ్యాయి. కొన్ని మార్పులు చేర్పులతో అన్ని రాష్ట్రాల్లోని పాఠశాలల్లో త్రిభాషా సూత్రం (మాతృభాష, ఇంగ్లిష్ తోపాటు హిందీ)అమలు చేయాలని ఈ కమిటీ ప్రతిపాదించింది. దీనిపై తమిళనాడులోని పలు పార్టీల నేతలు స్పందించారు. 'త్రిభాషా విధానం అమలు, హిందీని పాఠశాల స్థాయి నుంచి 12వ తరగతి వరకు నేర్వాలనడం పెద్ద షాక్. ఈ ప్రతిపాదన దేశాన్ని విభజిస్తుంది' అని డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ అన్నారు. 'పాఠశాలల్లో త్రిభాషా సూత్రం అమలు అర్థం ఏమిటి? హిందీని తప్పనిసరి చేయాలని చూస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం అసలు స్వరూపం మొదట్లోనే బయటపడుతోంది' అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం అన్నారు.

**అది ప్రతిపాదన మాత్రమే: కేంద్రం**

త్రి భాషా సూత్రాన్ని అమలు చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందంటూ తమిళ పార్టీలు చేస్తున్న ఆరోపణను సమాచార, ప్రసార శాఖ మంత్రి ప్రకాశ్ జవడేకర్ ఖండించారు. జాతీయ విద్యా విధానం(ఎన్‌ఈపీ) ముసాయిదాలో అది ఒక ప్రతిపాదన మాత్రమేనని స్పష్టం చేశారు. 'మోదీ ప్రభుత్వం అన్ని భాషల అభివృద్ధిని కోరుకుంటోంది. ఎన్‌ఈపీ కమిటీ ప్రతిపాదనలపై అపోహలు అవసరం లేదు. అది ప్రతిపాదన మాత్రమే. ప్రజాభిప్రాయాన్ని తెలుసుకున్నాకే నిర్ణయిస్తాం' అని అన్నారు.



# సుర్రుమన్న చురు

- రాజస్తాన్‌లో ఏకంగా 50.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- రాయలసీమలో సాధారణం కంటే 3–5 డిగ్రీలు అధికం

**న్యూఢిల్లీ:** భారత్‌పై భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో శనివారం సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాజస్తాన్‌లోని ఛురు ప్రాంతంలో ఏకంగా 50.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే వారం రోజులవరకూ దేశమంతటా ఇదేతరహా వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఢిల్లీలో 46.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు పాలమ్ అబ్జర్వేటరీ తెలిపగా, 46.1 డిగ్రీలు నమోదైనట్లు ఐఎండీ తెలిపింది. ఢిల్లీలో ఎండ తీవ్రతను సూచించే రెడ్ కేటగిరి హెచ్చరికను ఐఎండీ జారీచేసింది. రాజస్తాన్‌లోని గంగానగర్‌లో 49 డిగ్రీలు, ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా బందాలో 48.4 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. రాబోయే ఐదు రోజులు మధ్యప్రదేశ్, రాజస్తాన్, విదర్భ ప్రాంతాల్లో తీవ్రమైన వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.హరియాణాలోని నర్నౌల్‌లో 47.2 డిగ్రీలు,పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో 45.7 డిగ్రీలు, లూథియానాలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. చల్లగా ఉండే హిమాచల్‌ప్రదేశ్‌లోనూ ఎండలు చుక్కలు చూపిస్తున్నాయి. రాష్ట్రంలోని ఉనాలో శనివారం 44.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. ఇక జమ్మూకశ్మీర్‌లోని జమ్మూలో 43.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. మహారాష్ట్ర, హిమాచల్, తూర్పు మధ్యప్రదేశ్ ఉత్తర కర్ణాటకలోని కొన్నిప్రాంతాల్లో సాధారణం కంటే 5.1 డిగ్రీల ఉష్ణోగ్రత అధికంగా నమోదైనట్లు వెల్లడించింది. రాయలసీమ, కేరళ, విదర్భ, హరియాణాలోని కొన్నిప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే 3–5 డిగ్రీలు అధికంగా రికార్డైనట్లు పేర్కొంది. ఒడిశాలోని దక్షిణ భాగంలో అధికతేమ కారణంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయని చెప్పింది.

## రుతు పవనాల రాక మరింత ఆలస్యం

**న్యూఢిల్లీ:** రుతుపవనాల రాక మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయని ప్రైవేట్ వాతావరణ సంస్థ స్కైమెట్ తాజాగా అంచనా వేసింది. రుతుపవనాల్లో మందగమనం కారణంగా జూన్ 7వ తేదీకి రెండు రోజులు అటూఇటుగా కేరళను తాకనున్నాయని పేర్కొంది. ఇంతకు ముందు అంచనా ప్రకారం జూన్ 4వ తేదీకి రెండు రోజులు అటూఇటుగా కేరళను తాకవచ్చని తెలిపింది. రుతుపవనాల పురోగమనం మందకొడిగా సాగడంతో ఈ అంచనాలను మార్చుకోవాల్సి వచ్చిందని స్కైమెట్ ప్రెసిడెంట్ జీపీ శర్మ తెలిపారు. రుతుపవనాలు నెమ్మదిగా కదలటానికి సొమాలియా తీరంలో అల్పపీడనం, మధ్య అరేబియా సముద్రంపై అధికపీడనం, సొమాలియా తీరంపై వైపు నుంచి వీస్తున్న బలమైన గాలులే కారణమన్నారు.



# మళ్లీ అదే జోడీ

**పార్టీ ఒక్కటే.. పేర్లే వేరు**



**కేం**ద్ర హోంశాఖ మంత్రిగా అమిత్ షా నియామకంపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నప్పటికీ భారతీయ జనతా పార్టీలో సీనియర్లకు మాత్రం కొన్ని మధుర స్మృతులు కళ్ల ముందు మెదులుతున్నాయి. మోదీ–షా ద్వయాన్ని చూస్తున్న వారందరూ ఒక్కసారిగా రెండు దశాబ్దాలు వెనక్కి వెళ్లి అటల్‌జీ రోజుల్లో విహరిస్తున్నారు. 1998లో ప్రధానమంత్రిగా అటల్ బిహారి వాజపేయి నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటైంది. లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో లక్నో నియోజకవర్గం నుంచి వాజపేయి ఎన్నికైతే, గుజరాత్‌లో గాంధీనగర్ నుంచి ఎన్నికైన ఎల్.కె. అద్వానీ హోం మంత్రి పదవిని అందుకున్నారు. ఆ తర్వాత ఉప ప్రధాని పదవిని చేపట్టారు. వాజపేయి–అద్వానీ జోడీ తమకున్న పరస్పర సహకారంతో బీజేపీకి ఎనలేని పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టారు. దశాబ్దాల తరబడి కాంగ్రెస్ వంశపారంపర్య పాలనతో విసిగిపోయిన జనంలో వాజపేయి–అద్వానీ జోడీ పట్ల ఎనలేని నమ్మకం ఏర్పడింది. బీజేపీ తొలిసారిగా స్వర్ణయుగం అనుభవించిన రోజులవి. మళ్లీ ఇరవై సంవత్సరాల తర్వాత అదే రిపీట్ అయింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నుంచి ప్రాతినిధ్యం వహిస్తే, హోంమంత్రి అమిత్ షా ఇన్నాళ్లుగా అద్వాణీ ప్రాతినిధ్యం వహించిన గాంధీనగర్ నుంచే నెగ్గారు. యూపీ పీఎం, గుజరాత్ హెచ్ఎం ఫార్ములా అప్పట్లో బీజేపీని తారాపథంలోకి తీసుకువెళ్లింది. ఇప్పుడు హోం మంత్రిగా షా నియామకంతో అదే యూపీ, గుజరాత్ కాంబినేషన్ ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందోనన్న ఆసక్తి నెలకొంది

**మోదీ షా ద్వయం ఎదుర్కోనున్న సవాళ్లు**

అప్పట్లో వాజపేయి అద్వాణీ జోడి ఎదుర్కొన్న సవాళ్లే ఇప్పుడూ మోదీ, షా ఎదుట ఉన్నాయి. అయితే అప్పటి పరిస్థితులకి, ఇప్పటి పరిస్థితులకి ఎంతో వ్యత్యాసం ఉంది. వికాస్ పురుష్‌గా పేరుతెచ్చుకున్న వాజపేయి, లోహ్‌పురుష్ అని పిలుచుకునే అద్వాణీ కాంబినేషన్ అందరినీ ముచ్చటగొలిపింది. బీజేపీకి ఒక గుర్తింపు తేవడానికి వారు ఎంతో కృషి చేశారు. వాళ్లిద్దరు వేసిన బాటలోనే నడుస్తున్న మోదీ–షా ద్వయం దృష్టంతా ఇప్పుడు మోదీ తరహా రాజకీయాలను తిరస్కరిస్తున్న రాష్ట్రాల్లో పట్టు బిగించడంపైనే ఉంది. వివిధ రాష్ట్రాల్లో పార్టీని క్షేత్రస్థాయిలో విస్తరింపజేయడమే మోదీ–షా ద్వయం ముందున్న అసలు సిసలు సవాల్. రాష్ట్రాల్లో పట్టుబిగిస్తే తప్ప రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వానికి మెజార్టీ దక్కదు. కొత్త చట్టాలు చేసి పరిపాలనలో సంస్కరణలు తీసుకురావాలన్నా, బూజుపట్టిన పాత చట్టాలకు సవరణలు చేయాలన్నా పెద్దల సభలో బీజేపీకి మెజార్టీ అత్యవసరం. అప్పుడే ఈ జోడీ తాము అనుకున్నది సాధించగలదు. యూపీ, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైతేనే పెద్దల సభలో పట్టు బిగించగలరు.

## ప్రఫుల్‌కు ఈడీ సమన్లు



**న్యూఢిల్లీ:** యూపీఏ హయాంలో జరిగిన ఏవియేషన్ స్కాంలో మాజీ మంత్రి, ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం సమన్లు జారీ చేసింది. జూన్ 6వ తేదీన ఉదయం దర్యాప్తు సంస్థ అధికారి ముందు హాజరుకావాలని ఆయనకు నోటీసు ఇచ్చింది. విమానయాన మంత్రిగా తన హయాంలో వివిధ ఏవియేషన్ సంస్థలకు లాభం చేకూర్చే క్రమంలో ప్రభుత్వం కోట్లాది రూపాయలు నష్టపోయిందని ఈడీ ఆరోపిస్తోంది. అరెస్టయిన లాబీయిస్ట్ దీపక్ తల్వార్ విచారణలో వెల్లడించిన వివరాల ప్రకారం, లభించిన సాక్ష్యాధారాల ఆధారంగా ఈ కుంభకోణంలో కోట్లాది రూపాయల ముడుపులు చేతులు మారాయని ఇది మనీలాండరింగ్ కేసుగా భావిస్తున్నామని ఈడీ తెలిపింది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి బ.చతుర్దశి సా.4.09 వరకు తదుపరి అమావాస్య, నక్షత్రం కృత్తిక రా.12.45 వరకు, తదుపరి రోహిణి వర్జ్యం ప.12.25 నుంచి 2.03 వరకు దుర్ముహూర్తం సా.4.40 నుంచి 5.32 వరకు, అమృతఘడియలు... రా.10.14 నుంచి 11.54 వరకు.

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం : 6.24
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

నితీశ్ కుమార్ (బిహార్ సీఎం)

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఢిల్లీ నుంచి శుక్రవారమే పట్నా వచ్చేశాను. ఇంకో రోజు ఢిల్లీలోనే ఉండి ఉన్నా అక్కడ నేను మాట్లాడవలసిన వాళ్లెవరూ లేరు. వాళ్లూ అంతే. ఎక్కడ నాతో మాట్లాడవలసి వస్తుందోనని నేను అక్కడ ఉండగానే ఎవరి శాఖల్లో వాళ్లు బిజీ అయిపోడానికి తొందరపడుతున్నారు.

"వెళ్లొస్తాను" అన్నాను.. ప్రమాణ స్వీకారాలు, పోర్ట్‌ఫోలియోలు అవగానే.

"ఏమీ తీసుకోకుండానే వెళ్తున్నారు" అన్నారు అమిత్ షా, ఆయన పక్కన ఉన్నాయన.. బాగా బాధపడిపోతూ!

"ఒకటే ఇస్తామని మీరు అన్నందుకు నేను బాధపడాలి కానీ, ఇస్తానన్న ఆ ఒక్కటి కూడా వద్దన్నందుకు మీరెందుకు బాధపడాలి అమిత్‌జీ?" అని అడిగాను.

"ఇస్తుంటే వద్దని వెళ్లిపోవడం బాధ కలిగించే సంగతే కదా నితీశ్‌జీ. అయినా బిహార్‌కి ఐదు ఇచ్చాం కదా" అన్నారు షా!

"బిహార్‌కి ఐదు ఇచ్చారు కానీ, జేడీయూకి ఐదు ఇచ్చారా అమిత్‌జీ. ఐదు కూడా వద్దు. మూడే కదా మేము అడిగింది. ఒక కేబినెట్, ఒక ఇండిపెండెంట్, ఒక సహాయ మంత్రి" అన్నాను.

"ముందైతే ఒకటి తీసుకోండి నితీశ్‌జీ" అన్నారు. వద్దంటే వద్దన్నాను.

వచ్చింది కదా అని తీసేసుకుంటే, తీసుకున్నాక ఇక వచ్చేదేమీ ఉండదు. ఎవరికైనా ఇచ్చిందే గుర్తుంటుంది. 'ఇస్తానన్నారు కదా' అని గుర్తు చేస్తే 'ఇచ్చేశాం కదా గుర్తులేదా' అని మనకే గుర్తు చేస్తారు!

"అమిత్‌జీ.. ఏ సభలోనూ సభ్యులు కాని పాశ్వాన్‌ని, జైశంకర్‌ని కూడా కేబినెట్‌లోకి తీసుకున్నారు. మాకివ్వడానికి మాత్రం మీకు చేతులు రావడం లేదు. ఎంత బాధగా ఉంటుందో తెలుసా?!" అన్నాను.

"మీ బాధకు అర్థం లేదు నితీశ్‌జీ"



అన్నాడు హఠాత్తుగా.. అమిత్ షా పక్కన ఉన్నాయన! ఆయన్ని ఎక్కడో చూసినట్లుంది కానీ ఎక్కడ చూసిందీ గుర్తుకు రావడం లేదు.

"మీరెవరో గుర్తు చేసుకోడానికి మీ ముందే నేను ప్రయత్నిస్తూ కనిపించడం మీకు ఇబ్బందిగా ఏమీ అనిపించదు కదా" అన్నాను ఆయనతో. ఆ మాట ఆయన్నేమీ కదలించలేదు. అమిత్ షా మాత్రం బాగా కదిలిపోయారు.

"నా పక్కన ఉన్న మనిషిని గుర్తు చేసుకోడానికి ప్రయత్నిస్తున్నానని చెప్పడం ద్వారా మీరేమి సంకేత పరచదలచుకున్నారో రెండు విధాలుగా నేను అర్థం చేసుకోగలను నితీశ్‌జీ. అమిత్‌షా పక్కన కూర్చొని ఉన్నా కూడా, మీరు ఆ మనిషికి ప్రాధాన్యం ఇచ్చేందుకు ఏమాత్రం ఇష్టపడటం లేదనేదొకటి. బిహార్‌లోని మొత్తం నలభై సీట్లలో బీజేపీకి పదిహేడు సీట్లు సంపాదించి పెట్టిన వ్యక్తిని ఒక ప్రముఖుడిగా గుర్తించడానికి మీరు సిద్ధంగా లేరనేది మరొకటి. వినండి నితీశ్‌జీ.. ఈయన పేరు భూపేందర్ యాదవ్. బిహార్ బీజేపీ ఇన్‌చార్జి" అన్నారు అమిత్‌షా.

'ఓ! మీరేనా!' అన్నట్లు భూపేందర్ వైపు చూశాను. 'అవును.. నేనే' అన్నట్లు చూశాడు భూపేందర్.

"కానీ అమిత్ జీ.. బిహార్‌లో పదిహేడు సీట్లు గెలవడానికి కారణమైన భూపేందర్‌ని గుర్తించలేదని మీరు కదలిపోయారు. పదహారు సీట్లు గెలిచిన జేడీయూని గుర్తించకుండా ఒకే మంత్రి పదవి ఇస్తామన్నందుకు నేనెంత కదలిపోవాలి" అన్నాను.

అమిత్ షా, భూపేందర్ అక్కడి నుంచి కదిలి వెళ్లిపోయారు!

పట్నా వచ్చి ఇరవై నాలుగు గంటలు దాటింది. ఢిల్లీ నుంచి ఎవరూ ఫోన్ చెయ్యలేదు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర టైముంది. ఆలోపైనా చెయ్యాలి. చెయ్యలేదంటే.. బిహార్‌లో ఈసారి తనవాలికీ, తనకెవరూ సపోర్ట్ చేసే అవసరం ఉండదన్న గట్టి నమ్మకంతో బీజేపీ ఉందని.

# పెడధోరణికి సమాధి–ప్రగతికి పునాది



కె. రామచంద్రమూర్తి

త్రికాలమ్

'వెల్ బిగన్ ఈజ్ హాఫ్ డన్.' సవ్యంగా, సలక్షణంగా ప్రారంభమైన పని సగం పూర్తయినట్టే అంటారు. గురువారంనాడు అమరావతిలో, ఢిల్లీలో పదవీ ప్రమాణ స్వీకారోత్సవాలు అద్భుతంగా జరిగాయి. ఎన్నికలలో ప్రజలు తమ నిర్ణయం నిర్ద్వంద్వంగా, ప్రస్ఫుటంగా ప్రకటించారు. ప్రజల తీర్పును అనుసరించి అమరావతిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటిసారి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, ఢిల్లీలో నరేంద్రమోదీ రెండోసారి ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. జగన్ ఒంటరిగా ప్రమాణం చేయగా, మోదీ మరి 53 మంది సహచరులతో కొలువుదీరారు. వారం రోజుల తర్వాత ఆంధ్రప్రదేశ్ మంత్రుల నియామకం జరుగుతుందని అంటున్నారు. నవ్యాంధ్ర ప్రజలు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ (టీడీపీ)ని తిరస్కరించి ప్రతిపక్షమైన వైఎస్ ఆర్‌సీపీకి పట్టం కట్టారు. దేశ ప్రజలు అధికారంలో ఉన్న మోదీ సారథ్యాన్ని ఆమోదించి మరో ఐదేళ్ళు సమధికోత్సాహంతో పొడిగించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ ప్రజలు ఒకే విధమైన తీర్పు ఇచ్చారు. తెలుగు రాష్ట్రాలలో కనీవినీ ఎరుగని రీతిలో జగన్‌కు అఖండ విజయం ప్రసాదించారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ 90 కోట్లమంది ఓటర్లూ దాదాపుగా ఒకే తరహాలో తీర్మానించారు. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ప్రభావం అంతగా లేకపోయినా కర్ణాటకలో అధికంగానూ, తెలంగాణలో గణనీయంగానూ మోదీ హవా పని చేసింది. దేశం మొత్తం మీద బీజేపీది గొప్ప విజయం. బీజేపీ ప్రచారం చేసిన 'మోదీ హై తో ముమ్కిన్ హై'(మోదీ ఉంటే ఏదైనా సాధ్యమే) నినాదాన్ని ఓటర్లలో అధిక సంఖ్యాకులు విశ్వసించారు. 'ఆయేగా తో మోదీ హీ' (మోదీయే వస్తాడు) నినాదం ముమ్మాటికీ నిజమై కూర్చున్నది.

వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్ర తర్వాత 2004లో జరిగిన ఎన్నికలలో ఘనవిజయం సాధించి వేలాది ప్రజల సమక్షంలో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన మీదట తొలిసంతకం వ్యవసాయదారులకు ఉచిత విద్యుత్తు సరఫరా చేయడానికి ఉద్దేశించిన ఫైల్ పైన చేశారు. ఆయన కుమారుడు తండ్రి కంటే ఎక్కువకాలం, ఎక్కువ దూరం పాదయాత్ర చేసి, ఎన్నికలలో తండ్రికంటే ఘనమైన విజయం సాధించి తండ్రిని మించిన తనయుడని నిరూపించుకున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే వృద్ధాప్య పింఛన్ మొత్తాన్ని రూ. 2,250లకు పెంచే ఫైలుపైన తొలిసంతకం చేసి అవ్వాతాతలకు మోదం కలిగించారు. ప్రజాసంక్షేమం విషయంలో వైఎస్ ఒక అడుగు ముందుకు వేస్తే తాను రెండడుగులు ముందుకేస్తానన్న హామీని నిలబెట్టుకుంటూ త్రికరణశుద్ధిగా ప్రస్థానం ప్రారంభించారు.

### అధ్వానంగా ఆర్థిక పరిస్థితి

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ ప్రమాదపుటంచుల్లో ఉన్నది. ఇప్పుడున్న సంక్షేమ పథకాలకు తోడు జగన్ ఎన్నికల ప్రచారానికి ముందే ప్రకటించిన నవరత్నాలలో భాగంగా చేపట్టవలసిన పథకాలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు కొత్త ప్రభుత్వం వేతనాలు ఉదారంగా పెంచుతుందనే ఆశతో ఉన్నారు. రాజధాని నగర నిర్మాణం భారీ ఖర్చుతో కూడిన పని. కాంట్రాక్టర్లకు చెల్లించవలసిన బిల్లులు ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కబెట్టడం, ఇచ్చిన హామీలను అమలు జరపడం ప్రభుత్వం ఎదుట ఉన్న పెనుసవాళ్లు. టీడీపీ ప్రభుత్వం దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసి చిరు ఆస్తి కూడా నిర్మించకుండా ఖజానాను ఖాళీ చేసింది. కేంద్రం బకాయిలు చెల్లించడంతో సరిపుచ్చుకోకుండా అదనపు ఆర్థిక సహాయం చేయాలి. ప్రత్యేక హోదా మంజూరు చేసి ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకుంటే రాష్ట్రంలో కొత్త పరిశ్రమలూ, వ్యాపార సంస్థలూ వెలసి ఆర్థిక వనరులు పెంపొందుతాయి. తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్) జగన్ ప్రమాణస్వీకార మహోత్సవానికి వచ్చి 'కావలసింది ఖడ్గ చాలనం కాదు, కరచాలనం' అని హితవాక్యం చెప్పారు. తెలుగు రాష్ట్రాలు రెండూ పరస్పరం సహకరించుకుంటూ ప్రగతి పథంలో ప్రయాణం చేయాలని అనడం ఆప్తవాక్యం. నదీజలాల విషయంలో కేసీఆర్ ఇచ్చిన భరోసా స్వాగతించదగినది. తమిళనాడు నుంచి డీఎంకే అధినేత స్టాలిన్ వచ్చి శుభాకాంక్షలు తెలియజేయడం ఆనందదాయకం. సంక్షేమం, అభివృద్ధి జోడు గుర్రాలుగా పరుగులెత్తిస్తూ నవ్యాంధ్ర ప్రగతి రథాన్ని జగన్ ఎంత వేగంగా, ఎంత లాఘవంగా, ఎంత సమర్థంగా నడిపిస్తారోనని ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలూ, దేశంలోని ఇతర ప్రాంతాల నేతలూ, ప్రజలూ ఆసక్తిగా గమనిస్తున్నారు.

వైఎస్ఆర్‌సీపీ విజయం సాధించిన తీరు జగన్ ఎటువంటి సవాళ్ళనైనా జయప్రదంగా ఎదుర్కోగలరనే విశ్వాసం కలిగిస్తుంది. 2014లో ఓడిపోకుండా



స్వల్ప మెజారిటీతో ఆ పార్టీ గెలుపొంది ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది. అప్పుడు జగన్‌కు సుదీర్ఘమైన పాదయాత్ర చేసి చరిత్ర సృష్టించే అవకాశం ఉండేది కాదు. పాదయాత్రలో సుమారు కోటిమందిని కలుసుకొని వారి వెతలు ఆలకించి మనస్సులో నమోదు చేసుకునే సందర్భం ఉండేది కాదు. పాదయాత్ర ఫలితంగానూ, ప్రత్యేక హోదా కోసం ఉద్యమాల కారణంగానూ, ప్రతిపక్ష నాయకుడిగా సమర్థమైన పాత్ర పోషించడం వల్లనూ ప్రజల గురించీ, వారి సమస్యల గురించీ సంపూర్ణమైన అవగాహన ఏర్పడింది. క్షేత్రజ్ఞానం విశేషంగా పెరిగింది. ఒక రకంగా ప్రతిపక్షంలో ఉండటం వల్ల మేలు జరిగింది. అప్పుడే గెలిచి ఉంటే అనుభవం లేని వ్యక్తి ముఖ్యమంత్రి వచ్చారనీ, విశేష అనుభవం కలిగిన చంద్రబాబుకి అధికారం అప్పగిస్తే అద్భుతాలు చేసేవారనీ ప్రచారం చేయడానికి వీలుండేది. చంద్రబాబు పాలన చూసిన తర్వాత ఆయనను ముఖ్యమంత్రిని చేసినందుకు చింతించి, వగచిన ప్రజలు కసితో టీడీపీని చిత్తుగా ఓడించారు. వైఎస్ఆర్‌సీపీ అఖండ విజయానికి రెండు కారణాలు–ఒకటి, జగన్ మాట తప్పని, మడమ తిప్పని మనిషనీ, హామీలు తు.చ. తప్పకుండా అమలు చేస్తారనీ, ప్రజలను మనస్ఫూర్తిగా ప్రేమిస్తాడనీ, సమర్థంగా పరిపాలిస్తారనీ బలమైన విశ్వాసం. రెండు, చంద్రబాబుపట్ల పెరిగిన అవిశ్వాసం, అసహనం, ఆగ్రహం. ఫలితంగా చంద్రబాబుకి అవకాశం ఇవ్వకుండా తప్పు చేశామని ఓటర్లు అనుకునే అవకాశం లేదు. జీవితంలో సంభవించే పరిణామాలను ప్రశ్నించకుండా స్వీకరించాలని తత్త్వవేత్తలు చెప్పిన హితవు జగన్‌కు అక్షరాలా వర్తిస్తుంది. 'ఫెయిల్యూర్ ఈజ్ హైరోడ్ టు సక్సెస్' (పరాజయం విజయానికి రహదారి) అనే నానుడిని సత్యమని నిరూపిస్తూ అద్భుత విజయం సాధించిన జగన్ ఉత్తమ ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోవడానికి అనువైన వాతావరణం ఈ రోజు ఆంధ్రావనిలో నెలకొన్నది.

### పెరిగిన మోదీ ఆత్మవిశ్వాసం

రెండోసారి ప్రధానిగా ప్రమాణం చేసిన నరేంద్రమోదీ తనతో పాటు పాతిక మంది కేబినెట్ మంత్రులనూ, అంతకంటే ఎక్కువ మంది సహాయ మంత్రులనూ ఒకే విడత నియమించడం పెరిగిన ఆత్మవిశ్వాసానికి నిదర్శనం. కొత్త మంత్రిమండలిలో విధిగా చెప్పుకోవలసిన విశేషాలు ముచ్చటగా మూడు ఉన్నాయి. ఒకటి, బీజేపీ అధ్యక్షుడుగా అనేక విజయాలు అందించిన అమిత్‌షాని మంత్రిమండలిలోకి తీసుకోవడం. అమిత్‌షా తన వారసుడని మోదీ చెప్పకనే చెప్పారు. తన కంటే 14 ఏళ్ళు చిన్నవాడైన అమిత్‌షాను తన తర్వాత స్థానంలో దేశీయాంగమంత్రిగా నిలపడం మోదీ చేసిన సరికొత్త ప్రయోగం. గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ ఉన్నప్పుడు సహాయమంత్రి హోదాలోనే అమిత్‌షా హోంశాఖను నిర్వహించేవారు. షా పట్ల మోదీకి ఉన్న అచంచలమైన విశ్వాసానికి తాజా నిర్ణయం నిదర్శనం. కశ్మీర్‌లో శాంతి స్థాపనకు ఆయన ఎటువంటి చొరవ ప్రదర్శిస్తారో చూడాలి. ఎన్నికల ప్రచారంలో చెప్పినట్టు కశ్మీర్‌లో 370వ అధికరణను రద్దు చేస్తారా? మందిర నిర్మాణానికి ముందడుగు వేస్తారా? గోరక్షకుల పేరిట అన్యమతస్తులపై జరుగుతున్న దాడులను అరికడతారా? ఏం జరుగుతుందో చూడాలి. కేంద్ర దర్యాప్తు సంస్థలకూ, నిఘా సంస్థలకూ ఎటువంటి స్వేచ్ఛ ఇస్తారో గమనించాలి. మంత్రిమండలిలో అగ్రస్థానం అమిత్‌షాకు ఒక రకంగా అగ్నిపరీక్ష. రెండు, నిర్మలా సీతారామన్‌ను ఆర్థికమంత్రిగా నియమించడం మరో సాహసోపేతమైన ప్రయోగం. ఆమెకు రక్షణశాఖ అప్పగించినప్పుడే మోదీ చరిత్ర సృష్టించారు. అంతవరకూ ఆ శాఖను పూర్తిస్థాయిలో నిర్వహించిన మహిళా మంత్రి ఎవ్వరూ లేరు. ఇప్పుడు ఆర్థికశాఖా అంతే. దీన్ని స్వతంత్రంగా నిర్వహించే బాధ్యత ఒక మహిళకు అప్పగించడం ఇదే ప్రథమం. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉంటూ రక్షణ, ఆర్థిక శాఖలను కొంతకాలం పర్యవేక్షించారు. అంతే. పార్టీ ప్రవక్త(ప్రతినిధి)గా తన ప్రతిభాపాటవాలతో అగ్రనాయకులను మెప్పించి, మంత్రిమండలిలో సహాయ మంత్రిగా ప్రవేశించి, రాజ్యసభలో సభ్యత్వం సంపాదించిన నిర్మల అధికార సోపానంలో వేగంగా అడుగులు వేస్తూ ఎదిగారు. తమిళనాట పుట్టి, తెలుగునాట మెట్టి, కన్నడసీమ నుంచి రాజ్యసభకు ఎన్నికైన విద్యాధికురాలు ఆమె. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌యూ) ఆర్థిక శాస్త్రంలో ఎంఏ చేసి, ఇండో–యూరోపియన్ వాణిజ్యంపైన పీహెచ్‌డీ చేశారు. ప్రైస్‌వాటర్ కూపర్స్ అనే బహుళజాతి సంస్థలో సీనియర్ మేనేజర్‌గా పని చేశారు. నిర్మల రక్షణమంత్రిగా రాణించినట్టే ఆర్థికమంత్రిగా సైతం మోదీ నమ్మకాన్ని వమ్ము చేయరని చెప్పవచ్చు.

### విదేశాంగమంత్రిగా మాజీ దౌత్యాధికారి

మూడు, విదేశాంగమంత్రిగా నియుక్తుడైన జయశంకర్. ఆయనా జెఎన్‌యూలో పీహెచ్‌డీ చేశారు. ఇండో–అమెరికన్ అణు ఒప్పందంపైన 2005 నుంచి 2007లో మన్మోహన్‌సింగ్, జార్జి బుష్‌ల సంతకాలు జరిగే వరకూ జరిగిన చర్చలలో క్రియాశీలక పాత్ర పోషించిన దౌత్యవేత్త. 2017లో డోక్లాం వివాదం కారణంగా చైనాతో సంబంధాలు దెబ్బతిన్నాయి. పాకిస్తాన్‌తో కయ్యం నిత్యకృత్యమై సంబంధాలు నానాటికీ తీసికట్టుగా దిగజారుతున్నాయి. వీటితో సంబంధాలు పెంపొందించగలిగితే జైశంకర్ జన్మ ధన్యమైనట్టు భావించాలి. ఆయన తండ్రి కె. సుబ్రహ్మణ్యం రక్షణ వ్యవహారాలలో అగ్రశ్రేణి విశ్లేషకుడు. చాలా మంది ప్రధానులు ఆయన సలహాలు సగౌరవంగా స్వీకరించేవారు. ఆరోగ్యం సహకరించకపోయినా మనసున్న విదేశాంగమంత్రిగా మంచిపేరు తెచ్చుకున్న సుష్మాస్వరాజ్ స్థానంలో నియుక్తుడైన జయశంకర్ కేబినెట్ మంత్రి పదవి పొందిన ప్రథమ భారత దౌత్యాధికారి. మేనకాగాంధీకీ, కల్నల్ రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్‌కీ, మరికొందరు ముఖ్యులకూ ఎందుకు ఉద్వాసన చెప్పారో తెలియదు. ఎప్పటిలాగానే కేంద్ర మంత్రిమండలిలో దక్షిణాదికి తగిన ప్రాతినిధ్యం లేదు. ఉత్తరభారతం, పశ్చిమభారతం ఎన్‌డీఏ ప్రభుత్వంలో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ స్థానం ఆక్రమించాయి. రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రాబల్యం, పరిచయాలూ కలిగిన కిషన్‌రెడ్డిని హోంశాఖ సహాయమంత్రిగా తీసుకోవడం విశేషం. యువమోర్చా కార్యనిర్వాహకుడిగా, బీజేపీకి అవిభక్త ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి పనిచేశారు. ప్రధానితో సాన్నిహిత్యం ఉంది. కిషన్‌రెడ్డికి మంత్రిపదవి రావడం సముచితమేనంటూ అందరూ హర్షం ప్రకటిస్తున్నారు. అమిత్‌షా స్థానంలో బీజేపీ అధ్యక్షుడిగా ఎవరిని నియమిస్తారనే అంశంపైన ఊహాగానాలు సాగుతున్నాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేంద్ర పరిశీలకుడిగా పని చేసిన జగత్ ప్రసాద్ నడ్డా లోక్‌సభ ఎన్నికలలో ఉత్తరప్రదేశ్ పర్యవేక్షకుడిగా అనూహ్యమైన విజయాలు సాధించిన నేపథ్యంలో ఆయనను పార్టీ పదవి వరించవచ్చునని సంకేతాలు వెలువడుతున్నాయి. బీజేపీ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ పేరు కూడా వినిపిస్తున్నది.

కేంద్రంలోనూ, రెండు తెలుగు రాష్ట్రాలలోనూ సంపూర్ణ మెజారిటీలు సాధించిన పాలకపక్షాలు ఉండటం, ప్రధానికీ, రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకూ మధ్య స్పర్థలు లేకపోవడం సంతోషించదగిన పరిణామం. ఇది ప్రగతికీ, సుస్థిరతకూ దారితీసే సానుకూల వాతావరణం. అయిదేళ్ళపాటు కుటిల రాజకీయాలకూ, స్వార్థప్రయోజనాలకూ, ఎత్తులకూ, జిత్తులకూ, అవినీతికీ తావు లేకుండా ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రభుత్వాలు అంకిత భావంతో, ఏకాగ్రదృష్టితో కృషి చేస్తే ఇటీవలి ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన వివేకవంతమైన తీర్పు సార్థకం అవుతుంది. ఎన్నికల ప్రచారంలో విచ్చలవిడిగా బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ, టీఎంసీ వంటి పార్టీలు సాగించిన పెడధోరణులకు తెరపడుతుంది. సకారాత్మక, నిర్మాణాత్మక రాజకీయాలకు పాలకులందరూ శ్రీకారం చుట్టవలసిన శుభసందర్భం ఇది.

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### సాహసి



"తన ప్రాణాలను పణంగా పెట్టి పర్యాటకులను కాపాడిన సాహసి కశ్మీర్ గైడ్ రవూఫ్ అహ్మద్ దార్‌కు నా వందనాలు. కశ్మీరీ ప్రజలంతా దయార్ద్ర హృదయులు. మీడియా ద్వారా వారిపై ద్వేషాన్ని వెళ్లగక్కకుండా, ప్రేమతో వారి హృదయాలను గెలుచుకోవాల్సి ఉంది. పహల్గాం దగ్గర రాఫ్టింగ్ బోట్ బోల్తా పడితే విదేశీయులతో సహా ఐదుగుర్ని కాపాడిన రవూఫ్ మృతదేహం లిడ్డర్ నదిలో లభించింది. అతని కుటుంబ సభ్యులకు నా సానుభూతి తెలియజేస్తున్నా"
– నగ్మా, సినీ నటి

### విధాత



"హోంమంత్రి అమిత్ షాని ఆయన ఇంట్లోనే కలుసుకున్నా. పాండిచ్చేరిలో సవాళ్ల గురించి చర్చించాం. పంచాయతీ ఎన్నికల నిర్వహణ ద్వారా కింది స్థాయి నుంచి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించాం. సుప్రీంకోర్టు ఆదేశాల వల్ల గత పదేళ్లుగా ఇక్కడ ఎన్నికలు నిర్వహించలేదు"
– కిరణ్ బేడీ, గవర్నర్

### కొత్తరూపం



"శ్రీ కందుకూరి వీరేశలింగం కాలం నాటి సామాజిక సమస్యలు కొత్తరూపును సంతరించుకుని ఇవాళ్టి సమాజాన్ని కూడా ప్రశ్నిస్తున్నాయి. తమ రచనల్లో సామాజిక జీవనాన్ని ప్రతిబింబించడం ద్వారా కవులు, రచయితలు, పాత్రికేయులు సమాజాన్ని చైతన్యపరచగలరని ఆకాంక్షిస్తున్నాను"
– ఎం.వెంకయ్య నాయుడు, ఉపరాష్ట్రపతి

### వన్ సైడ్



"ఈ రోజు న్యూజిలాండ్ ఏమీ తప్పులు చేయలేదు. శ్రీలంక ఆడాల్సిన స్థాయిలో ఆడలేదు. ఈసారి ప్రపంచకప్ ప్రారంభంలో జరిగిన మూడు మ్యాచ్‌లూ ఏకపక్షంగానే సాగాయి. ఇంగ్లండ్‌లో జరుగుతున్న క్రికెట్ టోర్నీలో పోటాపోటీగా జరిగే మ్యాచ్‌ల కోసం ఎదురు చూడాలి"
– మహమ్మద్ కైఫ్, క్రికెటర్

### చెత్త



"ప్రజలంతా ఈ చెత్తను ఎలా చూస్తున్నారో నాకు అర్థం కావడం లేదు. అర్నాబ్ గుక్కతిప్పకోకుండా సుమారు రెండు నిమిషాలపాటు మాట్లాడుతూ సుమంత్ రామన్‌తో వ్యవహరించిన తీరు చూస్తే చాలా బాధ కలిగింది. చర్చలో పాల్గొనే వారితో వ్యవహరించాల్సినది ఇలా కాదు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు"
– పింకీ రాజ్ పురోహిత్, జర్నలిస్ట్ ఏబీపీ న్యూస్

## వివాద 'శిఖరాగ్రం'

దేశాలు పరస్పరం కయ్యానికి కాలుదువ్వుతున్నప్పుడు శిఖరాగ్ర సదస్సుల నిర్వహణ కత్తి మీది సామే. మక్కాలో శనివారం ప్రారంభమైన ఇస్లామిక్ దేశాల సహకార సంస్థ(ఓఐసీ) సదస్సు తీరు దీన్నే నిరూపించింది. ఇరాన్ ఉగ్రవాద ముఠాల కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నదని సౌదీ అరేబియా ఆరోపిస్తే... ఇది నిజం కాదని ఇరాన్ ఖండించింది. ఈ సదస్సుకు ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీని నిర్వాహకులు అసలు ఆహ్వానించనే లేదు. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి మాత్రమే ఆ దేశం తరఫున హాజరయ్యారు. సౌదీలో సదస్సు జరగడాన్ని ఆసరా చేసుకుని అది ఇస్లామిక్ దేశాల మధ్య విద్వేష బీజాలు నాటుతున్నదని ఆయన ఆరోపించారు. అటు సౌదీ అరేబియాకు ఇరాన్‌పై చాలా ఫిర్యాదులున్నాయి. ఓఐసీలో కొన్ని దేశాలు ఇరాన్‌ను సమర్థిస్తుంటే, మరికొన్ని సౌదీ అరేబియాకు నిర్ద్వంద్వంగా వంతపాడుతున్నాయి. ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ నుంచి జెరూసలేంకు అమెరికా తన రాయబార కార్యాలయాన్ని తరలించడాన్ని నిరసిస్తూ ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు సౌదీ చెప్పుకున్నా, ఇరాన్‌కు వ్యతిరేకంగా ఇస్లామిక్ దేశాలను కూడగట్టడమే దాని అసలు ఆంతర్యం. ఇటీవల యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తీరంలో సౌదీ చమురు ట్యాంకర్లను ఉగ్రవాదులు ధ్వంసం చేశారు. అలాగే సౌదీ చమురు పైప్‌లైన్లను డ్రోన్‌లతో పేల్చేశారు.

సందర్భం



రాఘవ శర్మ

# విదురుడిలా! వికర్ణుడిలా!

ఎన్నికల్లో ఎవరు గెలుస్తారన్నది పది రోజుల క్రితం వరకు రాష్ట్రమంతా ఉత్కంఠ! ముఖ్యంగా పాత్రికేయుల్లో మిలియన్ డాలర్ల ప్రశ్న! ఎన్నికలు జరగడానికి నెలముందు హైదరాబాదు నుంచి టంకశాల అశోక్ గారు ఫోన్‌చేసి 'ఆంధ్రప్రదేశ్‌లో ఎట్లుంది?' అని అడిగారు. 'కాస్త జగన్ వేవ్ కనిపిస్తోందండీ' అన్నాను.

హైదరాబాద్‌లో ఉంటున్న మరో సీనియర్ జర్నలిస్ట్ (పీకాక్ క్లాసిక్స్) గాంధీ గారు ఫోన్ చేసి 'ఏపీలో ఎలా ఉందండి' అన్నారు. 'కాస్త జగన్ వేవ్ ఉందండి' అన్నా. 'బీజేపీపై వ్యతిరేకత జగన్‌పైన ఏమైనా పడుతుందా?' అని అడిగారు. 'బీజేపీపైన వ్యతిరేకత ఉంటే అది ఆ ప్రభుత్వంలో భాగస్వామి అయిన టీడీపీపైనే ఉంటుంది కానీ జగన్‌పైన ఎలా ఉంటుంది' అన్నాను. హైదరాబాదులోని మరో సీనియర్ జర్నలిస్ట్(80 ఏళ్లు) ఫోన్ చేసి 'శర్మాజీ రాయలసీమలో ఎట్లా ఉంది?' అని అడిగారు. 'సీమ ప్రజలు టీడీపీ అంటే చాలా కోపంగా ఉన్నారు' అన్నా. 'ఎందుకు' అని అడిగారు. 'వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు కృష్ణా నీళ్ళు రాయలసీమకు రావడానికి ముఖద్వారం లాంటి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచితే, దేవినేని ఉమ ప్రకాశం బ్యారేజిని దిగ్బంధం చేశారు. దాని వెనుక బాబు ఉన్నారు. గాలేరు నగరి, హంద్రీనీవాలను పూర్తి చేయకుండా పట్టిసీమను పూర్తి చేశారు. టీడీపీకి అనంతపురం జిల్లాలో కొన్ని సీట్లు రావచ్చునేమో కానీ, మిగతా సీమలో రావు' అని కరాఖండిగా చెప్పాను. 'హంద్రీనీవాకు నీళ్లొదిలారు కదా! చిత్తూరు జిల్లాలో పీలేరు వరకు నీళ్ళొచ్చాయట గదా' అని అడిగారు. 'నిజమే సార్.. ఎన్నికల ముందు కాలువల్లోకి కాసిని నీళ్లొదిలితే, ఆ నీళ్లను చూసి వెంటనే పంటలేసి, వేసిన పంటలన్నీ నెలరోజుల్లో పండిపోయి, ఆ వెంటనే దారిద్ర్యమంతా తీరిపోయి రైతులు ఆనంద తాండవమాడతారా!?' అని ప్రశ్నించాను. 'సిద్దేశ్వరం అలుగు కోసం ఆందోళన చేసిన వేలాది మంది రైతులను అరెస్టులు చేస్తే అంతా మర్చిపోయి టీడీపీకి ఓట్లు గుద్దేస్తారా!?' అని అడిగేశాను. 'లేదు శర్మాజీ... మహిళలంతా టీడీపీ పక్కే ఉన్నారు. డ్వాక్రా మహిళలకు డబ్బులు వేస్తున్నారు కదా!' అని దింపుడు కళ్లం ఆశ వ్యక్తం చేశారు. 'డ్వాక్రా రుణాలను రద్దు చేస్తానని, ఐదేళ్లూ కాలయాపన చేసి, ఇప్పుడు పసుపు కుంకుమ పేరుతో డబ్బులిస్తే ఓట్లేస్తారా సార్?' అని ప్రశ్నించా. చివరగా ఆయన ఒక తీర్పు చెప్పారు 'మీరన్నట్టు టీడీపీ ఓడితే అది జగన్ కోసం ఈవీఎంలను మోడీ ట్యాంపరింగ్ చేయించారని రుజువైనట్టే. ఒకవేళ టీడీపీ గెలిస్తే ట్యాంపరింగ్ జరగనట్టు భావించాలి' అన్నారు.

*సామాన్యులా..సెఫాలజిస్టులా..!* : ఏపీలో జగన్ వేవ్ ఉందని ముగ్గురు సీనియర్ జర్నలిస్టులతో ఇంత గట్టిగా నేనెలా చెప్పగలిగాను!? నేనేమీ సెఫాలజిస్టును కాను! క్షౌరశాలలో కూర్చున్నప్పుడు 'రంజిత్.. ఎట్లా ఉంది రాజకీయం' అని అడిగాను. 'అంతా జగనే అంటాండారు' అన్నాడు. 'ఎవరికి ఓటేస్తున్నావు రెడ్డెమ్మా' అని మా పనిమనిషిని అడిగాను. 'జగన్‌కేస్తాండాం' అంది. 'ఎందుకు?' అని అడిగా. 'ఏమో నాకు తెల్దు. మా వోళ్లంతా జగన్‌కే వెయ్యాలా అంటాండారు' అన్నది. 'ఎట్లా ఉంది రాజకీయం నారాయణా' అని చెట్టుకింద ఉన్న స్కూటర్ మెకానిక్‌ను అడిగాను. 'ఏం చెపుతాం సార్. ఎండలు మండిపోతాండాయి. టౌన్‌లో కెళ్లి స్పేర్‌పార్ట్స్ తెద్దామంటే వెళ్లలేకపోతున్నా. ఇంత ఎండల్లో జగన్ ఇన్ని నెలలు, ఇన్ని మైళ్లు ఎట్ల నడిచినాడో? టౌన్‌లో కెళ్లకపోతే నాకైతే గడవదు కానీ, నడవకపోతే ఆయనకేం గడవదా!' అన్నాడు. ఎన్నికల ఫలితాలకు ముందు పాలకొల్లు వెళ్లాను. నాపక్కన కూర్చున్న భీమవరానికి చెందిన ఒక రైతు (కాపు)ను 'ఎవరు గెలుస్తారు?' అని అడిగాను. 'మా వాళ్లంతా జగనే రావచ్చంటున్నారండి' అన్నాడు. తిరుగు ప్రయాణంలో నాపక్కన కూర్చున్న విద్యార్థులనడిగాను. 'జగన్‌కు ఒక అవకాశం ఇవ్వాలనుకుంటున్నారండి' అని చెప్పారు. జగన్ వేవ్ అప్పటివరకు రాయలసీమలో మాత్రమే అనుకున్నా. వీళ్ళతో మాట్లాడాక టీడీపీ కంచుకోటలు కూడా బద్దలవుతున్నాయని గ్రహించా. అయినా ఫలితాల వరకు ఎదురుచూడక తప్పదు.

మే నెల 23న మండిపోయే ఎండల్లో తెలుగునాట కనీవినీ ఎరుగని ఒక టోర్నడో వచ్చింది. ఆ టోర్నడోలో చాలామంది టీడీపీ నేతలు కొట్టుకుపోయారు. సీమలోని 52 శాసనసభ స్థానాలకుగాను 49 స్థానాల్లో ఆపార్టీ ఓడిపోయింది. మూడే స్థానాలు దక్కించుకుంది. తొలి రౌండ్‌లో ఆ పార్టీ నేత బాబు కూడా వెనుకబడిపోయారు. ఎన్నికల గురించి నాతో మాట్లాడిన ఈ సామాన్యులే అసలు సిసలైన సెఫాలజిస్టులన్న విషయం అప్పుడే బోధపడింది. ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక టంకశాల అశోక్, గాంధీగార్లతో ఫోన్‌లో మాట్లాడుతూ 'జగన్ వేవ్ ఉందని పసిగట్టాను కానీ, ఇంత బలంగా ఉంటుందని ఊహించలేకపోయా' అన్నాను. జగన్ వేవ్ ఉందని మరికొంత మంది కూడా చెప్పారని వారు నిర్ధారించారు. 'ప్రజలు జగన్‌ని ప్రతిపక్ష నేతగా కూడా తిరస్కరిస్తార'ని టీడీపీ నేతలు ప్రగల్భాలు పలికారు. కొందరు నాయకులు టీవీ కెమెరాల ముందుకొచ్చి మీసాలు మెలేశారు. మరి కొందరు తొడలు కొట్టారు. ఫలితాలతో తొడలు విరిగిన దుర్యోధనుడిలా పడిపోయారు. చాలా పత్రికలు, చానళ్లు ఫలితాలను పసిగట్టలేకపోయాయి. ఒక వేళ పసిగట్టినా, యాజమాన్యం మెప్పుకోసం చావుకోసం పాడిన జోలపాటలా విశ్లేషణలను వినిపించాయి. లగడపాటి చెప్పిన జోస్యాన్ని రాత్రీపగలు అనకుండా ప్రసారం చేశాయి. కొన్ని పత్రికలు అబద్ధాల ప్రయోగశాలలయ్యాయి.

మహాభారతంలో విదురుడు, వికర్ణుడి పాత్రలు విశిష్టమైనవి. ద్రౌపదిని కౌరవ సభకు తీసుకురమ్మని ధుర్యోధనుడు ఆదేశిస్తే విదురుడు తిరస్కరిస్తాడు. 'సభలో ద్రౌపది వేసిన ప్రశ్నలకు బుద్ధిమంతులంతా సమాధానం చెప్పాలి. ధర్మసందేహం తీర్చని రోజు సభలోని సజ్జనులందరికీ ఆ పాపం అంటుకుంటుంది' అని హెచ్చరిస్తాడు. ద్రౌపదిని కురుసభకు తీసుకొచ్చినప్పుడు 'భీష్ముడు, ద్రోణుడు, ధృతరాష్ట్రుడు, కృపుడువంటి పెద్దలు మౌనంగా ఉన్నారు. మిగిలిన ధర్మజ్ఞులైనా రాగద్వేషాలు మాని ఆలోచించి చెప్పండి' అంటాడు వికర్ణుడు. కురుక్షేత్రంలో విదురుడు ఏ పక్షమూ వహించడు. సమాజంలో దారుణాలు జరుగుతున్నప్పుడు పత్రికలు, వార్తా చానళ్లు విదురుడి లాగా, వికర్ణుడిలా ప్రశ్నించాలి. రాజధాని నిర్మాణం పేరుతో పచ్చని పంటపొలాలను నాశనం చేసి, భూ కుంభకోణాలకు పాల్పడినప్పుడు, కాల్ మనీ సెక్స్ రాకెట్ బైటపడినప్పుడు, మహిళా తహసీల్దార్ వనజాక్షిని ఇసుకలో పొర్లించి కొట్టినప్పుడు ఏ పత్రికలు, చానళ్లు ఎలా వ్యవహరించాయో అవి ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఇలాంటి దారుణమైన సంఘటనలపై పాత్రికేయులు నిజాల నిప్పులపైన కాల్చి నిగ్గుతేల్చాలి. మీడియా విదురుడు, వికర్ణుడి పాత్రను పోషించి ఉంటే నాటి పాలకులకు క్షేత్రస్థాయి వాస్తవాలు ఏమిటో కనీసం అర్థమయ్యేవి.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు, తిరుపతి
మొబైల్ : 94932 26180

## బడుగుల పార్టీగా.. ఇంటి పార్టీ

తెలంగాణ రాష్ట్రం రావాలని, బహుజనుల నాయకత్వంలో సామాజిక తెలంగాణ సాధించాలని 1997లోనే ఆగస్టు 11న సూర్యాపేటలో వేలాది మంది సమక్షంలో పబ్లిక్ క్లబ్‌లో, గాంధీ పార్కులో 'తెలంగాణ మహాసభ' జరిగింది. అట్లా భువనగిరి, సూర్యాపేట, వరంగల్ మీదుగా మొదలైన మలిదశ పోరాటం దశదిశల ఉరకలెత్తి, వివిధ సంఘాలు, పార్టీలతో పటిష్టమై కేంద్రాన్ని ఒప్పించి, మెప్పించి వేలవేల త్యాగాలతో 2014న స్వరాష్ట్రంగా అవతరించి మన కల నెరవేరింది. 2001లో ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర సమితి రాజకీయ ప్రస్థానం ఓట్ల చుట్టూ తిరిగినా కొత్త ఊపునిచ్చింది కానీ, తెలంగాణ బిల్లు ఆమోదించగానే మాది ఇంటిపార్టీ కాదు, ఉద్యమ పార్టీ కాదు.. ఫక్తు రాజకీయ పార్టీనే అని కొత్త రాగం ఎత్తుకొని తెలంగాణ వ్యతిరేకులకు టికెట్లు ఇచ్చి, ఉద్యమకారులకు మొండిచేయి చూపి గద్దెనెక్కింది.

నాటి తెలంగాణ మహాసభ కన్వీనర్‌గా ఉన్న నేను జరుగుతున్న పరిణామాలని ప్రజలకు వివరిస్తూ, 2015, మే 1న నకిరేకల్‌లో తెలంగాణ ఉద్యమ వేదిక జెండా ఎగరవేసి కేసీఆర్ వ్యవహార శైలిపై మొదటి ధిక్కార స్వరం వినిపించాను. ఈ క్రమంలో వంద శాతం తెలంగాణ సెంటిమెంట్ పార్టీనే, బడుగుల రాజ్యాధికార పార్టీనే ఉండాలని కాంక్షిస్తూ 2017, జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంరోజే హైదరాబాద్, నాంపల్లి గ్రౌండ్‌లో తెలంగాణ ఇంటి పార్టీ ఆవిర్భవించింది. ఒక రాజకీయ పార్టీ ఓట్లు నోట్లు సీట్లతో నిజాయితీ రాజకీయాల గొంతుకు ఉచ్చు బిగిస్తున్న అనేక కుట్రల నడుమ ఒక బలమైన సోషల్ మీడియా, విద్యార్థి, యువజన సంఘాలతో మరింత పటిష్టమై, పార్టీగా బలోపేతమై సూర్యాపేటలో 2019, జూన్ 2న రెండవ వార్షికోత్సవ సభకు సిద్ధమవుతున్నది. ఈ సభకు అందరూ ఆహ్వానితులే!

డా।। చెరుకు సుధాకర్, రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఇంటి పార్టీ । 90006 00744

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ ఆదివారం
2-6-2019





రావమ్మా హ్యూమా
సినిమా పేజీలో..

ఫన్ రైడ్


ఫోటో: శివ మల్లాల
● ప్రియమణి

# అభిమతం ఒకటే

**కాషాయ వర్ణం అందమే అందం. ఆకుపచ్చ సౌందర్యమే సౌందర్యం. గుడిలో గంట మంగళప్రదమైన తరంగాలు సృష్టిస్తుంది. 'అల్లాహో అక్బర్'... అని పిలిచే అజాన్ మనసుకు శాంతినిస్తుంది. పావురాలు గోపుర కలశం పైనా.. మినార్ చంద్రవంక పైనా వాలుతాయి. మతాలు ఏమైనా మనుషులంతా ఒక్కటే. ప్రియమణి పుట్టింటి మతం వేరు. అత్తింటి మతం వేరు. పెళ్లయ్యాక రెండు మతాల పండుగలు ఆ ఇంట జరుగుతున్నాయి. ఈ రంజాన్ మాసంలో భర్త ఉపవాసాలకు తన వంతు ఆధ్యాత్మిక తోడు అందిస్తున్నారు ప్రియమణి.**

ప్రేమకు కుల మతాలు ఉండవు. మనసులు కలిస్తే చాలు. ప్రియమణి, ముస్తఫా రాజ్‌ల మనసులు కలిశాయి. అయితే ఇంట్లో పెద్దలు ఒప్పుకుంటేనే పెళ్లి అనుకున్నారు. హిందు–ముస్లింల మధ్య పెళ్లి. తమిళ, ఉర్దూ భాషల మధ్య పెళ్లి. ఏమవుతుందో అని ఇద్దరూ భయపడ్డారు. కాని రెండు కుటుంబాల వాళ్లు అంగీకరించారు. అబ్బాయి తరపువారు 'నువ్వు ముస్లిం అమ్మాయిగా మారితేనే' అని ప్రియమణికి కండీషన్ పెట్టలేదు. అమ్మాయి తరపువారు 'నువ్వు హిందూ సంప్రదాయాన్ని ఫాలో అవుతావా' అని ముస్తఫాని అడగలేదు. ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. ముస్తఫా ముంబైలో ఈవెంట్స్ మేనేజర్. మంచి పలుకుబడి ఉంది. నటిగా దక్షిణ, ఉత్తరాదిన ప్రియమణి ఫేమస్. 2017 అగస్ట్ 23న వీరి పెళ్లి జరిగింది. ప్రస్తుతం ముంబైలో ఉంటున్నారు. 'మా మ్యారీడ్ లైఫ్ హ్యాపీగా సాగుతోంది' అన్నారు ప్రియమణి. రంజాన్ మాసంలో భర్త ఆచరిస్తున్న నియమాల గురించి 'సాక్షి'తో చెప్పారు.

● **రంజాన్ మాసంలో మీ అత్తగారింట్లో పాటించే ఆచారాల గురించి చెబుతారా?**

**ప్రియమణి:** అత్తామామలు ప్రస్తుతం ఇక్కడ లేరు. వాళ్లు యు.ఎస్‌లో ఉన్నారు. నేను, మా ఆయన (ముస్తఫా) మాత్రమే ఇక్కడ ఉన్నాం. ఆయన మాత్రం 'రోజా' (ఉపవాసం) పాటిస్తున్నారు. 30 రోజులుగా ఫాస్టింగ్ ఉంటున్నారు. రోజూ వాళ్ల కమ్యూనిటీ హాల్‌కి వెళ్లి సాయంత్రం ఉపవాసం విరమించుకుని, ఇంటికి వస్తున్నారు. ఉదయాన్నే నాలుగున్నరకు లేచి నమాజ్ చేస్తున్నారు. అప్పటి నుంచి ఉపవాసం మొదలుపెడతారు. మా పెళ్లయ్యాక వచ్చిన రెండో రంజాన్ ఇది. తెల్లవారుజాము నిద్ర లేవడం, నమాజు చేసుకుని ఉపవాసం మొదలుపెట్టడం, పనులు చేసుకోవడం, సాయంత్రం 5–6.30 మధ్యలో వాళ్ల కమ్యునిటీ హాల్‌కు వెళ్లడం, ఫాస్టింగ్‌ని బ్రేక్ చేసి రాత్రికి 8.30కి ఇంటికి తిరిగి రావడం. రాత్రి ఇద్దరం కలసి డిన్నర్ చేస్తాం. ఈ మాసంలో మా ఆయన రోజువారి జీవితం ఇలా ఉంటుంది.

● **ఫాస్టింగ్ (ఉపవాసం) చేయడం చాలా కష్టం కదా? అది కూడా రోజంతా నీళ్లు తాగకుండా, లాలాజలం కూడా మింగకుండా అంటే చాలా చాలా కష్టం...**

నా భర్త అని మాత్రమే కాదు... ఫాస్టింగ్ ఉండే ప్రతి ఒక్కరూ చాలా గ్రేట్. ఎంతో మనో నిబ్బరం ఉంటేనే అది సాధ్యమవుతుంది. బహుశా దైవ ఆరాధనలో ఉన్నాం అన్న భావనే ఆ శక్తి ఇస్తుందనుకుంటా. నిత్యం 'రోజా' మొదలెట్టాక కొద్ది సమయం గడిచాక 'ఇవాళ రోజా ఉండగలను' అని అనిపించి సంకల్పం చెప్పుకుంటారు. ఈ సంకల్పం చెప్పుకోని ముందు ఏవైనా అవాంతరాలు వస్తే రోజాను బ్రేక్ చేయవచ్చు. కాని సంకల్పం చెప్పుకున్నాక ఎన్ని అవాంతరాలు వచ్చినా ప్రాణం పోతున్నా సరే రోజాను బ్రేక్ చేయకూడదు. ఇవాళ రోజా ఉంటున్న కోట్లాది మంది నిత్యం సంకల్పం చెప్పుకుంటున్న వాళ్లే. ఇంత ఎండల్లో ఎంత ఇబ్బంది ఉన్నా వారు ఇఫ్తార్ సమయం వరకు పచ్చి మంచినీళ్లు కూడా ముట్టక ఉపవాసం ఉండటం చాలా గొప్ప. ఇది దైవం నుంచి శక్తి పొందడమే అని అనుకుంటాను.

● **ఈ మాసంలో ఏది కోరుకుంటే అది జరుగుతుందట కదా?**

నాకు తెలిసి ఈద్‌కి వారం పదిరోజులు ముందు ఏదైనా అడిగితే జరుగుతుందని నమ్ముతారు. అది వాళ్ల మత సంప్రదాయం. ఎవరి నమ్మకాలు వాళ్లవి. ఆ నమ్మకానికి ఒక కారణం ఉండి ఉండొచ్చు. దేవుడి ధ్యానంలో ఎక్కువసేపు ఉంటారు కాబట్టి మనసులు స్వచ్ఛంగా ఉంటాయి. అప్పుడు న్యాయమైన కోరికలను భగవంతుడు తీరుస్తాడని అనుకోవచ్చు. అన్ని మతాలకూ ఇది వర్తిస్తుంది.

● **మీరు హిందువు. మరి ఇస్లామ్ సంప్రదాయం గురించి మీకు ముందే తెలుసా? మ్యారేజ్ అయిన తర్వాతే తెలుసుకున్నారా?**

నాకు ముందే తెలుసు. నాకు ముస్లిమ్ ఫ్రెండ్స్ చాలామందే ఉన్నారు. మా స్కూల్‌లో చాలా మంది స్కూల్‌మేట్స్ ముస్లిమ్‌లే. అయితే పెళ్లయిన తర్వాత ఇంకా డెప్త్‌గా తెలిసింది. ముస్లిమ్‌లలో కమ్యూనిటీ డిఫరెన్స్ ఉంటుంది. ఒక్కొక్కరూ ఒక్కో పద్ధతి పాటిస్తారు. మా భర్త వాళ్లు 'బొహ్రా' ముస్లిమ్‌లు. వీళ్ల పద్ధతి ఎలా ఉంటుందంటే.. హైదరాబాద్, బెంగళూరు.. వేరే చోటుకి ట్రావెల్ చేశారంటే ఆ ప్రాంతాల్లో వాళ్ల రక్తసంబంధీకులు ఉంటేనే ఉపవాసం ఉంటారు. లేదంటే చేయరు.

● **ముస్లిమ్‌లు రోజుకు ఐదు సార్లు నమాజ్ చేయాలంటారు. ముస్తఫాగారు క్రమం తప్పకుండా చేస్తుంటారా?**

అలా ఏం లేదనుకుంటా. వీలుండి చేసే వాళ్లు చేస్తుంటారు. మా అత్తా మావయ్య మూడు సార్లకు తగ్గకుండా నమాజ్ చేస్తుంటారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం చేస్తుంటారు. ఇది కేవలం నా ఫ్యామిలీ గురించి చెబుతున్నాను. అందరి గురించి కాదు.



**సక్సెస్ కావాలంటే టాలెంట్, లక్.. ఏది ముఖ్యం?**

టాలెంట్ మాత్రమే ఉంటే చాలదు. మనం ఉన్నత స్థాయికి వెళ్లడానికి అదొక్కటే సరిపోదు. కొంచెం లక్ కూడా ఉండాలి. అలాగే 'టైమ్' కూడా చాలా ఇంపార్టెంట్. సరైన టైమ్‌లో సరైన చోట ఉండటం చాలా ముఖ్యం. జీవితంలో సక్సెస్ అవ్వాలంటే ఎన్నో కుదరాలి. అయితే టైమ్, లక్ మన చేతుల్లో ఉండవు. హార్డ్‌వర్క్ చేయడం ఒక్కటే మన పని.

● **ఏదైనా పని మీద బయటకు వెళ్లినప్పుడు కుదురుతుందా? నమాజ్ చేయాలంటే మనం ఉన్న చోటు అందుకు అనువుగా ఉండాలేమో?**

ముస్తఫా అయితే దగ్గర్లో ఉన్న మసీద్ లేదా కమ్యూనిటీ హాల్, రిలేటివ్స్ ఇంటికి వెళతారు. ఆఫీస్‌లో ఉన్నప్పుడు కుదరకపోవచ్చు. అలాగే ట్రావెల్ చేసేటప్పుడు చుట్టాలుంటే వాళ్ల ఇంట్లో చేస్తారు. కాని శుభ్రమైన చోటు ఉంటే ఎక్కడైనా సరే నమాజు వేళలో ఒక వస్త్రం పరుచుకుని నమాజు చేసుకోవచ్చని చెబుతారు.

● **రంజాన్‌కు సంబంధించిన బాధ్యత కలిగిన విషయం ఏంటంటే 'జకాత్' (దానం). దాని గురించి?**

కేవలం రంజాన్ సమయంలో మాత్రమే కాదు అన్ని సమయాల్లో మేం చారిటీ చేస్తుంటాం. అయితే రంజాన్ నెలలో ఇంకొంచెం ఎక్కువ చేస్తుంటాం. చిన్నపిల్లలకు ఫుడ్ ఇస్తాం. చదువుకోవడానికి సహాయం చేస్తాం. పెద్దవాళ్లకి హెల్ప్ చేస్తుంటాం. ఆహారం సమకూర్చడం, ఆర్థిక సహాయం, బట్టలివ్వడం... ఇలా ఏదంటే అది చేసేస్తాం. చాలా తృప్తిగా ఉంటుంది.

● **రంజాన్ వంటకాల్లో మీకు నచ్చిన వంటకం ఏది?**

ముంబైలో 'భేండి బజార్' అనే ఒక ప్లేస్ ఉంది. అక్కడ దొరికే స్వీట్స్ చాలా ఇష్టం. రంజాన్ టైమ్‌లో ఆ బజార్‌లో ప్రత్యేకంగా స్వీట్లు తయారు చేస్తారు. ఈ సీజన్‌లో తప్ప వేరే సమయాల్లో అలాంటి స్వీట్స్ దొరకవు. ముస్లిమ్‌లకు శుక్రవారాలు ముఖ్యమైనవి. ఆ రోజున నా భర్త పొద్దునే మసీద్‌కు వెళ్లి నమాజ్ ముగించుకుని అక్కడికెళ్లి ఎక్కువ స్వీట్స్ తీసుకు వస్తారు. ఫాస్టింగ్ బ్రేక్ చేసిన తర్వాత స్వీట్స్ తింటాం. ఈ సీజన్‌లో అక్కణ్ణుంచి స్వీట్స్ తెచ్చుకుని ఫ్రిజ్‌ని నింపేస్తాం. అవి ఎక్కువ ఇష్టంగా తింటాను. అలాగే అక్కడ తయారు చేసే ఫలూదా చాలా టేస్టీగా ఉంటుంది. ఫలూదాని అక్కడ 'మాహిమ్' అంటారు.

● **ఇంట్లో ఒకరు ఉపవాసం ఉంటే పక్కవాళ్లకి తినడం ఇబ్బందిగా ఉంటుందా?**

అలా ఏం లేదండి. నేను నా ఆహారాన్ని స్కిప్ చేయను. మనం తింటున్నామని వాళ్ల ఫాస్టింగ్‌కి భంగం కలగదు. వాళ్ల ఆలోచన ఫుడ్ వైపు వెళ్లదు. నేనైతే అంత సిన్సియర్‌గా ఫాస్టింగ్ చేయగలుగుతానో లేదో నాకు తెలియదు. అందుకే వాళ్ల విల్ పవర్‌కి నిజంగా హ్యాట్సాఫ్.

● **సినిమా స్టార్స్‌కి కొత్త బట్టలంటే పెద్ద విషయం కాదు. కానీ ఈద్ టైమ్‌లో కొత్త బట్టలు కొనుక్కుంటారా?**

ఫాస్టింగ్ ఉంటున్న రోజుల్లో షాపింగ్ చేయం. ఈద్ సెలబ్రేట్ చేసుకునే ముందు రోజు మాత్రం బట్టలు కొనుక్కుంటాం. నేను సల్వార్‌లు కొనుక్కుంటాను.

● **పెళ్లయిన వాళ్లనందరినీ అందరూ కామన్‌గా అడిగేదే.. పిల్లలు ఎప్పుడు?**

ఇప్పుడైతే లేదు (నవ్వుతూ).


● భర్త ముస్తఫా రాజ్‌తో...

● పెళ్లి తర్వాత మీ లైఫ్‌లో వచ్చిన మార్పులేంటి?

రిలేషన్‌షిప్ స్టేటస్ మారింది అంతకుమించి ఏమీ లేదు. పెళ్లికి ముందు ఒక ఫ్యామిలీ మాత్రమే ఇప్పుడు రెండు ఫ్యామిలీలు. బాధ్యత ఇంకాస్త పెరిగింది.



**ఇండస్ట్రీలో ఉండే పోటీ వల్ల ఒత్తిడికి గురవుతుంటారా? మీ సక్సెస్ మంత్ర?**

లేదు. నాకెప్పుడూ స్ట్రెస్ అనిపించలేదు. ఎందుకంటే పోటీ అవసరం అని నా ఫీలింగ్. అయితే అది ఆరోగ్యకరంగా ఉండాలి. నా సక్సెస్ మంత్ర ఏంటంటే 'స్లో అండ్ స్టడీ విన్స్ ది రేస్'. ఇవాళ కాకపోయినా ఏదో రోజు మన కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కుతుందని నమ్ముతాను. దక్కుతుందో లేదో అని సందేహించి కష్టపడటం మానేస్తే ఎక్కడ ఉన్నామో అక్కడే మిగిలిపోతాం.

● **ఎప్పుడైనా నమాజ్ చేశారా?**

లేదు.

● **అత్తింటివాళ్లు మతం మార్చుకోమని అడగలేదా?**

అస్సలు లేదు. పెళ్లికి ముందే మేం ఒకరి కోసం మరొకరు మారాలని అనుకోలేదు. ఎవరి నమ్మకాలు వాళ్లవి అని అనుకున్నాం. అలా అయితేనే మనం పెళ్లి చేసుకుందాం అని కూడా డిసైడ్ అయ్యాం. మా పెద్దవాళ్లు దానికి అంగీకరించారు. మా అత్తామామలైతే 'ఇన్నేళ్లుగా ఒక సంప్రదాయాన్ని ఫాలో అవుతున్నారు కదా.. సడన్‌గా మార్పు అంటే కష్టం. ఇన్నేళ్లూ ఏదైతే ఫాలో అయ్యారో అదే ఫాలో అవ్వండి' అన్నారు. మా అత్తమామయ్యలు చాలా బ్రాడ్ మైండెడ్. అర్థం చేసుకున్నారు. మా అమ్మానాన్న కూడా మాలో మార్పు కోరుకోలేదు. మతాలు ఏవైనా సాటి మనిషి పట్ల మానవత్వంతో ఉండటమే మా అభిమతం. అందరి అభిమతం అదే కావాలి. అప్పుడే అందరం బాగుంటాం.

● **ఇక సినిమాల విషయానికి వస్తే తెలుగులో 'సిరివెన్నెల' చేస్తున్నారు. ఇంకేమైనా చేస్తున్నారా?**

కన్నడంలో రెండు సినిమాలు చేస్తున్నాను. అమేజాన్ ప్రైమ్‌కు 'ది ఫ్యామిలీ మ్యాన్' అనే వెబ్ సిరీస్ చేశాను. త్వరలో ఈ సిరీస్ సీజన్ 2 కూడా స్టార్ట్ కాబోతోంది. తెలుగులో 'ఢీ' టీవీ షో చేస్తున్నాను. అలాగే మలయాళంలో కూడా టీవీ షోలు చేస్తున్నా.

● **వెబ్ సిరీస్ ఎక్స్‌పీరియన్స్ ఎలా ఉంది?**

బావుంది. సినిమా షూటింగ్‌లానే ఉంటుంది. కానీ చాలా ఫాస్ట్‌గా చేయాల్సి వస్తుంది. రోజుకు 6–7 సీన్లు షూట్ చేయాల్సి వస్తుంది. ఫ్యూచర్ మొత్తం డిజిటల్ అని నేను నమ్ముతాను.

● **ఫైనల్లీ.. సినిమాలు, సిరీస్‌లు, షోలతో బిజీ స్టార్‌గానే కొనసాగుతున్నారు. ఎలా అనిపిస్తోంది?**

ఐయామ్ గ్లాడ్. రోజులు మారుతున్నాయి. చాలా మంది అంటుంటారు పెళ్లి తర్వాత ఫ్యామిలీకి ప్రాముఖ్యత ఇవ్వాలి అని. నేను 18–19 ఏళ్ల వయసు నుంచి సినిమాల్లో వర్క్ చేస్తున్నాను. సడన్‌గా ఇప్పుడు ఆపేయాలంటే ఏం చేయాలో అర్థం కాదు. వర్క్ ఉన్నప్పుడు వర్క్ చేస్తాను. మా అత్తమామలు, హస్బెండ్ నన్ను బాగా సపోర్ట్ చేస్తుంటారు. నువ్వు వర్క్ చేయి... ఇంట్లో ఖాళీగా కూర్చుంటే మాకే ఏదోలా అనిపిస్తుంటుంది అంటారు. అంత సపోర్ట్ ఉన్న ఫ్యామిలీ ఉన్నప్పుడు ఇంకేం కావాలి. అయితే సినిమాలలో పాత్రలు ఆఫర్ చేసేటప్పుడు పెళ్లయిన హీరోయిన్లను కేవలం కొన్ని పాత్రలకే పరిమితం చేయడం కరెక్ట్ కాదు. ప్రస్తుతం ఆ విధానం మారుతున్నట్టుగా కనిపిస్తుంది.

– డి.జి. భవాని

కపిల్ చిట్స్ మీ వెంట ఆనందం మీ ఇంట
KAPIL GROUP
39 YEARS Safeguarding Trust
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్
మీ కలలకు సాకారం

వైరల్ పొయెట్రీ

## అమ్మా.. నీకు నచ్చినట్లే ఉండు


● అనామిక

''ఇక్కడ ఇంగ్లిష్‌లో మాట్లాడడానికి ప్రయత్నించకు. అయినా మా స్కూలుకొచ్చేటప్పుడు మంచి దుస్తులు వేసుకుని రావచ్చు కదా, మరీ ఇలా వచ్చావేంటి? నా ఫ్రెండ్స్ ముందు నాకు ఎంబరాసింగ్‌గా ఉంటుంది''... ఇలా పిల్లలు నిర్దయగా, కర్కశంగా మాట్లాడినా సరే... గాయపడకుండా ఎవరైనా ఉన్నారంటే అది తల్లి మాత్రమే. గాయపడినా క్షమించగలిగింది తల్లి మాత్రమే. ఆధునిక, నాగరిక పోరలన్నీ తల్లి మనసు ముందు దిగదుడుపే. అమ్మ ఎలా ఉంటే అలాగే ఉండాలి. ఆమెను అలాగే ఉండనివ్వాలి. ఆమె ఎలా ఉండాలనుకుంటే అలా ఉండనివ్వాలి. ఆమెకు ఎందులో సంతోషం ఉంటే ఆ సంతోషంలో ఆమెను జీవించనివ్వాలి. ఆమె నాగరకంగా ఉన్నా అనాగరకంగా ఉన్నా అమ్మే. మనకు ప్రపంచాన్ని తెలియచెప్పింది ఆమే. ఆమె నుంచి నేర్చుకున్న జ్ఞానంతోనే మన బాల్యం ఎదిగింది. ఇప్పుడు మనలో రెక్కలు విచ్చుకున్న విజ్ఞానం ఆమెలో తప్పులు వెతకడానికి కాదు. ఆమె తన పిల్లల తప్పుల్ని కూడా ఆనందంగా స్వీకరించింది, క్షమించింది. ఆమె ఆమెగా జీవించే క్రమంలో ఆమెలో కనిపిస్తున్న తప్పులను పిల్లలు స్వీకరించాల్సిందే. అమ్మకు అండగా ఆమె పక్కన నిలవాల్సిందే... అలా నిలబడే విజ్ఞతను మనలో నింపింది కూడా ఆమె పెంపకమే..'' అంటూ ఆశువుగా ఓ కవిత రాశారు అనామిక.

**అనామిక కవిత**

ఆమె తల్లి, ఆమెలో తప్పు ఎందుకుంటుంది?
ఆమె నిన్ను ఉత్తమంగా తీర్చిదిద్దడానికి శ్రమించింది.
నీ బాక్సులో ఎప్పుడూ రుచికరమైన
మంచి ఆహారాన్ని పెట్టింది.
నీ దుస్తుల్ని శుభ్రంగా ఉతికి పెట్టింది.
నిన్ను మరకలు లేకుండా సమాజానికి చూపించింది.
ఆమె తల్లి, ఆమెలో తప్పు ఎందుకుంటుంది?
ఆమె పని చేయడానికి బయటికెళ్తే వద్దని
ఆపేస్తారు పిల్లలు.
ఆమె ఇంట్లోనే ఉండి అందరికీ అన్నీ
అమరుస్తుంటే ఆమెని వెక్కిరిస్తారు.
నేనూ ఓ తల్లినే. తల్లిగా నేనూ తప్పు కాకూడదు.
అమ్మా నిన్ను బాధించి ఉంటే నన్ను క్షమించు.
ఒట్టు... ఇక ఎప్పుడూ నీ వెంటే ఉంటాను.
అమ్మా! నువ్వెప్పుడూ తప్పు కాదు.
నువ్వేం చేయాలనుకుంటే అది చెయ్యి.
ఎలా ఉండాలనుకుంటే అలా ఉండు.
మా అనుమతి నీకు అక్కర్లేదు.

అనామికది జైపూర్. మదర్స్‌డే రోజున (మే నెల 12వ తేదీ) ఆమె స్నేహితులు నిర్వహించిన సాహిత్య సదస్సుకు హాజరయ్యారు. తల్లి గురించి చిన్న కవితలు, కథలు చదివి వినిపించవలసిందిగా ఆ కార్యక్రమానికి వచ్చిన తల్లులందరినీ... కోరారు నిర్వాహకులు. పది నిమిషాల్లో అందరూ కవితలు రాశారు. చదివారు.

అనామిక రాసిన కవిత అక్కడికి వచ్చినవారందరినీ విపరీతంగా ఆకట్టుకుంది. యూట్యూబ్, ఫేస్‌బుక్‌లలో సంచలనాన్ని సృష్టించింది. యూట్యూబ్‌లో ఎనిమిది లక్షల మంది వీక్షించారు. ఫేస్‌బుక్‌లో వ్యూస్ నంబర్ అయితే ఏకంగా ఎనిమిది మిలియన్లను దాటి పోయింది. ఈ కవితను విన్న తల్లులు, తండ్రులు వాళ్ల పిల్లలకు షేర్ చేస్తున్నారు. పిల్లలు వాళ్ల పేరెంట్స్‌కు చూపిస్తున్నారు.

ఓ యువతి అయితే నేరుగా అనామిక దగ్గరకు వచ్చి 'అమ్మను అమ్మలా ఉంచడానికి మీ కవిత నాకు ఎంతగానో ప్రోత్సాహం కలిగించింది' అని చెప్పింది. అనామిక ఇలాంటి సంతోషకరమైన అనుభవాలను పంచుకుంటూ ''నా గుండెల్లోంచి నేరుగా అక్షరాల రూపంలో బయటకు వచ్చిన భావం అది. విన్న వాళ్లందరినీ అంతే హృద్యంగా గుండెలోతుల్ని తాకుతుంది. ఎందుకంటే అమ్మ గురించిన భావన ఎవరినైనా కదిలించి తీరుతుంది'' అన్నారు. పిల్లలకు దుఃఖం వస్తే భుజమిచ్చే ఆసరా అమ్మ. అలాంటి అమ్మ పట్ల పిల్లలు చూపించాల్సిన ప్రేమకు కూడా కొలతలు , కొలమానాలు ఉండకూడదు. తల్లి మీద ఓవర్‌ఎక్స్‌పెక్టేషన్స్ ఉండకూడదు, ఆమె ట్రెండ్‌కు తగ్గట్టుగా మారాలని ఆశించి, ఎలా ఉండాలో నిర్దేశిస్తూ ఆమె మీద ఒత్తిడి తీసుకురాకూడదు'' అన్నారు అనామిక.

– మంజీర

చెట్టు నీడ / రంజాన్ కాంతులు

## అనుగ్రహం

అది.. సత్యం, న్యాయం, ధర్మానికి ప్రతీక అయిన ఇస్లామీయ చక్రవర్తి హజ్రత్ ఉమర్ షారుఖ్ (ర) పరిపాలనా కాలం. రెండు మూడు సంవత్సరాలుగా వర్షాలు కురియక రాజ్యంలో ప్రజలు ఆహారం కోసం అలమటిస్తున్నారు. చక్రవర్తి వెంటనే రాజ్యంలోని వ్యాపారస్తులందరిని సమావేశపరిచి, మీరు కోరినంత ధర ఇస్తాను. మీ దగ్గర ఉన్న ధాన్యం మొత్తం తీసుకుని రమ్మని చెప్పాడు.



''ఓ చక్రవర్తి! ఇది నిజంగా మాకు మంచి తరుణం. ఒకటికి పది రెట్లు అధికంగా లాభం పొందే అవకాశం. కాని మా దౌర్భాగ్యం మేము మా దగ్గర ఉన్న ధాన్యం మొత్తం హజ్రత్ ఉస్మాన్ (ర)కి ముందే అమ్మేసాం'' అన్నారు. చక్రవర్తి హజ్రత్ ఉమర్ షారుఖ్ (ర), హజ్రత్ ఉస్మాన్ (ర) దగ్గరకు వెళ్లి.. ''ఓ ఉస్మాన్ (ర), రాజ్యంలో కరువు తాండవిస్తున్న సంగతి మీకు తెలిసిందే కదా. మీ దగ్గర ఉన్న ధాన్యం మాకు ఇస్తే దానికి బదులుగా మీరు కోరినంత విలువ ఇస్తాను'' అన్నారు.

''క్షమించాలి చక్రవర్తి గారు నేను నా దగ్గర ఉన్న ధాన్యం మొత్తం ఈ ప్రపంచంలో ఎవరూ వెల కట్టలేని ధరకు అమ్మి వేసాను'' అని అన్నాడు.

'అయ్యో! నా ప్రజలకు సహాయం చేయలేకపోతున్నానే' అన్న నిరాశ, నిస్పృహలతో అక్కడి నుండి వెళ్తూ, వెళ్తూ చెట్టు నీడన కూలబడ్డాడు హజ్రత్ ఉమర్.

కాసేపటికి తరువాత జనాలు బస్తాల కొద్దీ ధాన్యం మొసుకొని వెళ్లడం గమనించి, ఎంత ధరకైనా కొందామన్నా లభించని ధాన్యం వీళ్లకు ఎలా లభించిందబ్బా, అని వాకబు చేయగా, ఉస్మాన్ (ర) ఉచితంగా పంచుతున్నాడని తెలిసింది.

హజ్రత్ ఉస్మాన్ (ర) దగ్గరకు వెళ్లి, ''ఓ ఉస్మాన్! నేను నువ్వు కోరినంత ధర ఇస్తాను అన్నా అమ్మను అన్నావు. మరి ఇదేమిటి ఇలా ఉచితంగా పంచుతున్నావు?'' అని అడిగాడు.

''క్షమించాలి చక్రవర్తి గారు! మీరు మహా అంటే వంద రెట్లు అధికంగా ఇస్తారేమో. కాని పరలోకంలో నా ప్రభువు ఇచ్చినంత ఇవ్వలేరుగా. అందుకే నేను నాకు ఈ అనుగ్రహం ప్రసాదించిందిన అల్లాహ్ కే తిరిగి అమ్మేసాను'' అన్నాడు.

యదార్థం ఏమిటంటే, విశ్వాసుల నుండి అల్లాహ్ వారి ప్రాణాలనూ, వారి సిరి సంపదలనూ స్వర్గానికి బదులుగా కొన్నాడు. మరీ ముఖ్యంగా రంజాన్ మాసంలో అల్లాహ్ మార్గంలో చేసే ప్రతి కర్మకు మిగతా మాసాల్లో చేసే కర్మలకన్నా 70 రెట్లు అధికంగా దైవం ప్రసాదిస్తాడని ప్రవక్త (స) తెలిపారు.

– షేక్ అబ్దుల్ బాసిత్

సాక్షి
ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ ॥ ఆదివారం
2-6-2019

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



**పల్లవి :**
సా... నిసరీసాని... సా నిసమగామరి
పదసా... నిసరీసాని... సా... నిసమగామరి
పదసససని రిరిరిస గగగరి మమమగ పా...
సా ని ద ప మ గ రి స ని...
కీరవాణి... చిలకల కొలికరో పాడవేమే
వలపులే తెలుపుగా విరబూసిన ఆశలు
విరితేనెలు జల్లగ అలరులు
కురిసిన రుతువులు
తడిసిన మధరసవాణి... కీరవాణి...
॥చిలకల॥

**చరణం : 1**
గరిస పమగ పాని సరిగ రిగస నీద...
ఈ పూలలో అందమై ఈ గాలిలో గంధమై
నా తోటలో చైత్రమై ఈ బాటనే నడచిరా
నీ గగనాలలో నే చిరుతారనై
నీ అధరాలలో నే చిరునవ్వునై
స్వరమే లయగా ముగిసే...
సలలిత కలరుత స్వరనుత గతియుత
గమకము తెలియకనే... కీరవాణి
చిలకలా కలకల పాడలేదు
వలపులే తెలుపగా
ఇలరాలిన పూవులు వెదజల్లిన తావుల
అలకిడి ఎరుగని పిలుపుల
అలిగిన మంజులవాణి
॥కీరవాణి॥

**చరణం : 2**
నీ కన్నుల నీలమై నీ నవ్వుల వెన్నెలై
సంపెంగలా గాలినై తారాడనా నీడనై
నీ కవనాలలో నే తొలి ప్రాసనై
నీ జవనాలలో జాజుల వాసనై
ఎదలో ఎదలా కదిలే
పదుచుల మనసుల పంజర
శుకముల పలుకుల తెలియకనే
॥కీరవాణి॥

**చిత్రం : అన్వేషణ (1985)**
**రచన : వేటూరి**
**సంగీతం : ఇళయరాజా**
**గానం : ఎస్.పి.బాలు, ఎస్.జానకి**

కట్ చేయ్...దాచేయ్...



● మేకప్ లేని కాజల్



# మనసుకి మేకప్ వేయకూడదు

‘‘మేకప్ బాహ్యా సౌందర్యాన్ని మాత్రమే ప్రభావితం చేస్తుంది. మన వ్యక్తిత్వాన్ని, ఉనికిని కాదు. నిజంగా మనల్ని మనం అంగీకరించడంలోనే నిజమైన అందం దాగి ఉంది’’ అంటున్నారు కాజల్ అగర్వాల్. వెండితెరపై ఎన్నో గ్లామరస్ పాత్రలు చేసి కుర్రకారు గుండెల్లో గుబులు రేపారు కాజల్. ఇప్పటికీ అదే అందంతో వెండితెరపై కనిపిస్తున్నారు. కానీ సినిమాల్లోని పాత్రల కోసమే తాను మేకప్ వేసుకుంటున్నానని, మేకప్ మన వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేయకూడదని ఆమె అంటున్నారు. అలాగే తాను మేకప్ లేకుండా ఉన్న ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ– ‘‘బాహ్య సౌందర్యానికి ప్రాధాన్యం ఇచ్చే ప్రపంచంలో ఉన్నాం మనం. నార్సిజం (తన అందాన్ని చూసుకుని తానే మురిసిపోవడం) ప్రతిచోటా ఉంటుంది. సౌందర్య సాధనాల కోసం మనం లక్షల్లో డబ్బులు ఖర్చు పెడుతున్నాం. కానీ బాహ్య సౌందర్యం మనల్ని నిర్వచించకూడదు. మన అందాన్ని మనం అంగీకరించినప్పుడే నిజంగా హ్యాపీగా ఉండగలం. అందుకే మనసుకి మేకప్ వేయకూడదు’’ అని చెప్పుకొచ్చారు కాజల్. తమిళంలో ప్యారిస్ ప్యారిస్, కోమలి సినిమాల షూటింగ్‌ను కంప్లీట్ చేసిన కాజల్ తెలుగులో ‘రణరంగం’ సినిమాకు ప్యాకప్ చెప్పారు. ఇటు హీరోయిన్‌గా ‘ఇండియన్ 2’ సినిమాతో పాటు. అటు నిర్మాతగానూ ఎదగాలనే ప్రయత్నాల్లో కాజల్ బిజీ బిజీగా ఉన్నారు.

# నా దృష్టిలో సినిమాలూ రాజకీయాలూ ఒక్కటే

**- కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి**

**లక్ష్మీస్ వీరగ్రంథం, శశిలలిత... ఈ మధ్య చర్చల్లో నిలిచిన చిత్రాల్లో ఈ రెండూ ఉన్నాయి. ‘లక్ష్మీస్ వీర గ్రంథం’ విడుదలకు రెడీ అవుతోంది. ‘శశిలలిత’ షూటింగ్ మొదలు కావాల్సి ఉంది. ఈ రెండు చిత్రాలకూ కేతిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి దర్శక-నిర్మాత. జయలలిత జీవిత చరిత్ర ఆధారంగా తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో ‘శశిలలిత’ చిత్రం రూపొందనుంది. ఈ సందర్భంగా కేతిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి చెప్పిన విశేషాలు.**



● కేతిరెడ్డి



● ‘శశిలలిత’ పోస్టర్

**● రెండు వివాదాస్పద సినిమాలను నిర్మించాలనుకున్నప్పుడు ఆయా వర్గాలకు చెందిన వ్యక్తుల నుంచి మీకు బెదిరింపులు ఉండవా?**

భారత రాజ్యాంగంలోని భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను, కొన్ని సుప్రీం కోర్టు జడ్జిమెంట్స్‌ని ఆధారం చేసుకుని ఈ చిత్రకథలను తయారు చేసుకున్నాం. మాకు ఎవరూ శత్రువులు లేరు. ఒకవేళ ఎవరైనా మమ్మల్ని శత్రువులు అనుకుంటే వాళ్లను చట్టపరంగా ఎదుర్కొంటాం. ఆ విషయంలో వెనక్కి తగ్గేది లేదు.

**● మీరు చేసే సినిమాల్లో కొన్ని విడుదల కావు. సినిమాలను ప్రారంభిస్తారు.. కానీ విడుదల చేయరనీ, కేవలం ప్రకటనల వరకే పరిమితం అవుతారని చాలామందికి మీ మీద ఓ అభిప్రాయం ఉంది..**

నేను గతంలో రజనీకాంత్, మహేశ్‌బాబు కాంబినేషన్‌లో ఓ సినిమా చేయాలని ప్రయత్నించింది నిజమే. కానీ, అది ఇప్పటివరకూ కార్యరూపం దాల్చలేదు. పెద్ద కాంబినేషన్లు కదా.. మనం అనుకున్నవన్నీ సమయానికి జరగవు. అలాగే మనం చేసే ప్రయత్నాలన్నీ జరగాలని లేదు కదా.

**● ‘లక్ష్మీస్ వీరగ్రంథం’ చిత్రాన్ని ముందు మీరే నిర్మించి, తర్వాత వేరే నిర్మాతకు ఇవ్వడానికి కారణం?**

‘లక్ష్మీస్ వీరగ్రంథం’ అనే సినిమాని నావంతు బాధ్యతగా నిర్మించాను. అయితే బెంగళూరుకు చెందిన ఒక ప్రముఖ పారిశ్రామికవేత్త, సినీనిర్మాత నా వద్ద నుంచి ఆ ప్రాజెక్టుని సొంతం చేసుకున్నారు. ఆ సినిమాకి ఇప్పుడు నేను కేవలం దర్శకుణ్ణి మాత్రమే. ఇక సినిమా విడుదల చేయడమంటారా ఆయన ఇష్టానికే వదిలేశా. ఇప్పుడు అది నా చేతుల్లో లేదు.

**● సినిమా రంగంలో ఉంటూనే తమిళనాడులో తెలుగు భాష వికాసానికి పోరాడారు. మీకు ప్రజాసేవ అంటే ఇష్టమా? సినిమా అంటే ఇష్టమా?**

సినిమాల, రాజకీయాల దృక్పథం ఒక్కటే. సినిమాల్లో డబ్బు పోయినా, రాజకీయాల్లో డబ్బు ఖర్చు అయినా సంతృప్తి చెందుతాం. ఎందుకంటే ప్రజలకు దగ్గరవుతాం. కాబట్టి ఈ రెండు రంగాలు దేవుడు ఇచ్చిన వరంగా భావిస్తాను.

**● మీ రాజకీయ పయనంలో మీకు నచ్చిన నాయకుడు?**

‘తాను గెలిచే వరకు.. తాను ఓడిపోలేదు’ అని అనుకున్నవాడే నాయకుడు. నిరంతరం లక్ష్యం దిశగా పోరాటాలు సాగించడం వంటి గొప్ప రాజకీయ లక్షణాలను స్వర్గీయ వై.ఎస్. రాజశేఖర రెడ్డిగారు, వారి కుమారుడు వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డిగారిలో చూశాను. కేసీఆర్‌గారిలోనూ ఈ లక్షణాలు ఉన్నాయి. రాజకీయాల్లో వారే నాకు మార్గదర్శకులు, స్ఫూర్తి. రాజశేఖర రెడ్డిగారు 25 సంవత్సరాల పోరాటం తర్వాత జయాన్ని పొందారు. అదే విధంగా వారి కుమారుడు జగన్‌గారు పదేళ్ల పోరాటం తర్వాత అద్భుతమైన విజయం అందుకున్నారు. అందుకే నిత్యం పోరాడే వారంటే నాకు ఇష్టం.

# ఒళ్లు దగ్గర పెట్టుకుని పని చేస్తాను

**- కార్తికేయ**



● జజ్బా సింగ్, నివాస్ టీఎన్ కృష్ణ, కలైపులి యస్. థాను, కార్తికేయ, దిగంగన సూర్యవన్షీ, జేడీ చక్రవర్తి, అనంత్ శ్రీరామ్

‘‘హీరో అయితే చాలు. నా సినిమాను కొంత మంది చూస్తే చాలు అనుకునేవాడిని. హీరో కావాలని చిన్నప్పట్నుంచి కలలు కన్నాను. అసలు హీరోలు ఎలా ఉంటారబ్బా? మామూలు వాళ్లు ఉన్నట్లే వాళ్లూ ఉంటారా? అనిపించేది. కానీ సడెన్‌గా నన్ను హీరో అంటుంటే.. మామూలు మనిషిలానే అనుకున్నాను. నేను ఇంత కష్టపడితే ఎంతో ఇచ్చారు. మీ (ప్రేక్షకులు) ప్రేమను చూశాను. అందుకనే ఇకపై ముందుకే వెళతాను’’ అని కార్తికేయ అన్నారు. టీఎన్ కృష్ణ దర్శకత్వంలో కార్తికేయ, దిగంగనా సూర్యవన్షీ జంటగా తెరకెక్కిన చిత్రం ‘హిప్పీ’. కలైపులి థాను నిర్మించారు. జూన్ 6న రిలీజ్ కానున్న ఈ చిత్రం ప్రీ–రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ టి.ఎన్.కృష్ణ మాట్లాడుతూ –‘‘నేను ‘హిప్పీ’ సినిమాను కార్తికేయతో చేయడానికి ప్రధాన కారణం తన కళ్లే. పవర్‌ఫుల్‌గా ఉండే తన కళ్లను చూసే తనతో సినిమా చేయాలనుకున్నాను. కచ్చితంగా తను రాకింగ్ హీరో అవుతాడు. ఇందులో జేడీగారు చాలా ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్ చేశారు. దిగంగన నేచుల్ యాక్టర్. నివాస్ సోల్ ఉన్న మ్యూజిక్‌ను అందించారు. ధానుగారు లేకుంటే ఈ సినిమా ఉండేది కాదు’’ అన్నారు. ‘‘హిప్పీ అంటే సంచార జీవి అని అర్థం. ఈ సినిమాలో నా చేత అన్ని రకాల పాటలు రాయించారు. నా మీద అన్ని కోణాల్లోనూ నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు’’ అన్నారు అనంత్ శ్రీరామ్. ‘‘ధానుగారు దర్శకుడిగా సాధకబాధకాలు తెలుసుకున్న తర్వాత నిర్మాతగా మారారు. నా జీవితంలో రామ్‌గోపాల్ వర్మ అనే రాముడున్నాడు. ఆయన కృష్ణలీలలకు ఫేమస్. టీఎన్ కృష్ణగారు రామ తత్వానికి ఫేమస్. కెమెరా ముందు తప్ప.. కార్తికేయకు కెమెరా వెనక యాక్టింగ్ చేయడం రాదు. తనతో వర్క్ చేయడాన్ని ఎంజాయ్ చేశాను’’ అన్నారు జేడీ చక్రవర్తి. ‘‘జూలై 12, 2018.. నేను మళ్లీ పుట్టినరోజు. నాకు పునర్జన్మ దక్కిన రోజు. ఆ రోజు ‘ఆర్ ఎక్స్ 100’ విడుదలైంది. ఆ సినిమా లేకపోతే నేను లేను. కాబట్టి ఎన్ని సినిమాలు చేసినా నా తొలి సినిమా గురించి మాట్లాడుతాను. ఒళ్లు దగ్గర పెట్టుని పనిచేస్తాను. ‘హిప్పీ’ విషయంలో నేను ఇంత కాన్ఫిడెంట్‌గా ఉండటానికి కారణం డైరెక్టర్ కృష్ణగారే. ఆయన తమిళ డైరెక్టర్ కాదు.. పక్కా మాస్ తెలుగు డైరెక్టర్. ధానుగారు ఫోన్ చేసినప్పుడు అంత పెద్ద ప్రొడ్యూసర్ నాకెందుకు ఫోన్ చేస్తారనుకున్నాను. స్క్రిప్ట్ నచ్చింది.. చెన్నై రండి అన్నారాయన. వెళితే అడ్వాన్స్ చెక్ ఇచ్చారు. రజనీకాంత్ వంటి పెద్ద స్టార్‌తో సినిమా చేసిన పెద్ద నిర్మాత నాతో సినిమా చేయాలనుకోవడంతో షాక్ అయ్యాను. జేడీగారి ఎనర్జీ లెవల్స్ సూపర్బ్. జూన్ 6న నేను ఒక్కడినే కాదు.. మీరు కూడా షర్ట్ తిప్పి ఎగరేస్తారు. ఆ రోజు అందరం హిప్పీలుగా మారుతాం. సినిమా మీకు నచ్చితే షర్ట్ తిప్పి పైకి ఎగరేసి ఫొటో తీయండి. దాన్ని ట్రెండ్ చేద్దాం’’ అన్నారు.



# మార్పు రావాలి

● ఆర్. నారాయణమూర్తి

‘‘మన దేశంలో ఓట్లు అమ్ముడుపోతున్నాయి. పేరుకే ప్రజాస్వామ్యం. పదవుల్లో ఉన్నవారు ప్రజాసేవ గురించి కాకుండా సంపాదనపై ఎక్కువగా దృష్టి పెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలి. ఈ విషయాలనే ‘మార్కెట్లో ప్రజాస్వామ్యం’ సినిమాలో చూపించాం’’ అని ఆర్. నారాయణమూర్తి అన్నారు. ఆర్. నారాయణమూర్తి నటించి, స్వీయదర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం ‘మార్కెట్లో ప్రజాస్వామ్యం’. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. జూన్‌లో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ– ‘‘ఓటు హక్కు ఎంతో విలువైనది అంటుంటారు. అలాంటి ఓట్లనే కొంటున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేస్తున్నారు. ఈ అంశాలనే మా చిత్రంలో ప్రస్తావించాం. ప్రజల్ని ఆలోచింపజేసే చిత్రం అవుతుంది. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం ఆడియోకు విశేష స్పందన లభిస్తోంది. ప్రజాకవులు రాసిన ప్రతి పాటకూ మంచి ఆదరణ లభిస్తోంది. త్వరలోనే విడుదల తేదీని అధికారికంగా చెబుతాం’’ అని అన్నారు.

# బాల గోవిందం

జూనియర్ యన్టీఆర్ ‘రామాయణం’ అనే బాలల చిత్రంలో రామునిగా కనిపించి కనువిందు చేశారు. అప్పుడు తారక్ వయసు 13 ఏళ్లు. పదమూడేళ్ల వయసులోపు పిల్లలే నటీనటులుగా గతంలో ‘దాన వీర శూర కర్ణ’ చిత్రాన్ని నందమూరి జానకిరామ్ తనయుడిని బాల నటుడిగా పరిచయం చేస్తూ ‘జగపతి’ వెంకటేశ్వరరావు స్వీయ దర్శకత్వంలో ఓ చిత్రాన్ని రూపొందించారు. ఇలా అప్పుడప్పుడు చిన్న పిల్లల పౌరాణిక సినిమాలు వస్తూనే ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ ‘బాలగోవిందం’ పేరుతో ఓ పౌరాణిక చిత్రానికి శ్రీకారం జరిగింది. డా. ముళ్లపూడి హరిశ్చంద్ర దర్శకత్వంలో అరుణోదయ ఆర్ట్ క్రియేషన్స్‌పై తోలేటి వెంకట శిరీష నిర్మిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ – ‘‘కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి తిరుమల గిరులలో ఎందుకు వెలిశాడు? తిరుమలలో వెంకటేశుడు వెలవక ముందు జరిగిన సంఘటనలతో మా చిత్రం రూపుదిద్దుకోనుంది. తెలుగు, కన్నడ భాషల్లో రూపొందిస్తాం’’ అన్నారు. ‘‘వ్యక్తిత్వ వికాస కోణంలో మన పురాణాల్ని స్వీకరించాల్సిన ఆవశ్యకత ఉందని, ఆధ్యాత్మిక సారంతో ఈ సినిమా రూపకల్పన మొదలుపెట్టా’’మని పాటల రచయిత వెనిగళ్ల రాంబాబు అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మీర్, మాటలు: యడ వల్లి, సంగీతం: సాలూరి వాసూరావు.



● వినితా శ్రీ, మోక్షిత

# నా పాట నీ నోట పలకాల బాలు



● యస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఇళయరాజా

ఇళయరాజా– యస్పీ బాలసుబ్రహ్మణ్యంలది ఎవర్‌గ్రీన్ కాంబినేషన్. రాజా కంపోజిషన్‌లో బాలు అద్భుతమైన పాటలెన్నో పాడారు. సంగీతప్రియుల మ్యూజిక్ కలెక్షన్‌లో ఎవర్‌గ్రీన్ ఆల్బమ్స్‌లో నిలిచిపోయారు. అయితే ఈ మధ్య రాయల్టీ విషయంలో వీరిద్దరి మధ్య చిన్న గ్యాప్ వచ్చింది. ‘నేను స్వరపరిచిన పాటలెక్కడ పాడినా నాకు రాయల్టీ చెల్లించాలంటూ’ రాజా కొన్నేళ్లుగా సంచలన స్టేట్‌మెంట్స్ జారీ చేస్తూ వచ్చారు. దానికి ‘రాజా పాట పాడకుండా నన్నెవ్వరూ ఆపలేరని’ యస్పీబీ కూడా చెప్పారు. అది వీరి మధ్య చిన్న గ్యాప్‌కు కారణం అయింది. ఇటీవలే ఇళయరాజా, యస్పీబీ మళ్లీ కలసిన ఫొటోలు బయటకు వచ్చాయి. తాజాగా విజయ్ ఆంటోనీ హీరోగా తెరకెక్కుతున్న ‘తమిళరసన్’ చిత్రానికి ఇళయరాజా సంగీత దర్శకుడు. ఇందులో ఓ పాటను యస్పీబీ ఆలపించారు. ఇటీవలే ఆ పాటను రికార్డ్ చేయించారు. ఇవాళ చెన్నైలో జరగబోయే ఇళయరాజా కన్సర్ట్‌లో యస్పీబీ పాడనున్నారని తెలిసింది. ట్యూన్‌కి, టోన్‌కి మళ్లీ నేస్తం కుదిరింది. సో.. మళ్లీ మరెన్నో మ్యూజికల్ హిట్స్ సంగీతాభిమానులకు ఇవ్వడానికి ఈ కాంబినేషన్ నిశ్చయించుకుందని అనుకోవచ్చు.

# మాలాంటి వారికి ఆయనే స్ఫూర్తి

**- సుదీప్**



● రచితా రామ్, ఉపేంద్ర, సుదీప్, చంద్రు

‘‘ఉపేంద్ర లెగసీ వల్లే ఇతర రాష్ట్రాల్లోకి వెళ్లి మాకంటూ ఒక పేరును సంపాదించుకుంటున్నాం. నాతో సహా చాలామందికి ఉపేంద్ర హార్డ్‌వర్క్, అంకితభావం స్ఫూర్తినిస్తాయి ’’ అని నటుడు, దర్శకుడు సుదీప్ అన్నారు. ఉపేంద్ర హీరోగా నటించిన తాజా చిత్రం ‘ఐ లవ్ యు’. ‘నన్నే.. ప్రేమించు’ అనేది ఉపశీర్షిక. కన్నడ, తెలుగు భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రంలో రచితా రామ్ కథానాయికగా నటించారు. ‘కృష్ణమ్మ కలిపింది ఇద్దరినీ’ చిత్రంతో దర్శకుడిగా తెలుగు పరిశ్రమకు పరిచయమైన ఆర్. చంద్రు స్వీయదర్శకత్వంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. జూన్ 14న ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. బెంగళూరులో ఈ సినిమా ప్రీ–రిలీజ్, ట్రైలర్ లాంచ్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ‘ఈగ’ ఫేమ్ సుదీప్ మాట్లాడుతూ– ‘‘ఉపేంద్ర ఇంట్రడక్షన్ సాంగ్ ట్రెండీగా ఉంది. ట్రైలర్ ఆసక్తికరంగా ఉంది. ఇది చూశాక ఉపేంద్రతో మళ్లీ పోటీపడాలనిపిస్తోంది. ఉపేంద్ర లాంటి దర్శకులు ఇండస్ట్రీకి అవసరం. చంద్రు, ప్రేమ్ వంటి దర్శకులకు ఆయనే స్ఫూర్తి. ఆయన మరోసారి దర్శకత్వ బాధ్యతలు తీసుకోవాలని కోరుకుంటున్నాను’’ అన్నారు. ‘‘నాకు, సుదీప్‌కు 25ఏళ్లుగా పరిచయం ఉంది. ఇండస్ట్రీకి వచ్చిన తొలి రోజుల్లో సుదీప్‌లో ఎంత ఫైర్ ఉందో ఇప్పుడూ అంతే ఉంది. దర్శకుడు చంద్రు అద్భుతమైన కథ రాసుకుని పెద్దకలలతో వచ్చాడు’’ అన్నారు ఉపేంద్ర. ‘‘ఉపేంద్రగారు అభిమానుల చక్రవర్తి. ఇండస్ట్రీ కీర్తిప్రతిష్ఠలను ఇతర చిత్రసీమలకు తీసుకెళ్లిన అభినయ చక్రవర్తి సుదీప్‌గారు.. త్వరలో విశాఖ తీరంలో తెలుగు వెర్షన్ పాటలను విడుదల చేస్తాం’’ అన్నారు చంద్రు.

# ముద్దు సీన్లు ఉన్నాయని ముందు తెలియదు



● హవీష్

‘‘సాధారణంగా నాకు థ్రిల్లర్స్ పెద్దగా ఆసక్తి లేదు. ఆ సబ్జెక్టే కొంచెం డ్రైగా అనిపిస్తుంది. కానీ ఈ థ్రిల్లర్ ఒప్పుకోవడానికి కారణం కథ. ప్లస్ 6 హీరోయిన్లు ఉన్న తర్వాత ఇక డ్రైగా ఎందుకు ఉంటుంది? ఇలాంటి కథ ఎక్కడా రాలేదు’’ అన్నారు హవీష్. కెమెరామేన్ నిజార్ షఫీ దర్శకుడిగా మారి హవీష్ హీరోగా రెజీనా, నందితా శ్వేత, త్రిధా చౌదరి, అనీషా ఆంబ్రోస్, అదితీ ఆర్య, పూజితా పొన్నాడ హీరోయిన్లుగా రూపొందించిన చిత్రం ‘7’. రమేశ్ వర్మ కథను అందించి, నిర్మించిన ఈ రొమాంటిక్ థ్రిల్లర్ ఈ నెల 5న రిలీజ్ కాబోతోంది. ఈ సందర్భంగా హవీష్ పలు విషయాలు పంచుకున్నారు.

● సినిమాలో రెహమాన్ పోలీసాఫీసర్ పాత్రలో కనిపిస్తారు. ఆయన దృష్టిలో హీరోయిన్లు, నేను (6+1) 7 పాత్రలం. అందుకే ఆ టైటిల్ పెట్టాం. మొదట సినిమా అనుకున్నప్పటి నుంచి మరో నాలుగు రోజుల్లో సెట్స్ మీదకు వెళ్తాం అనేవరకూ కూడా తెలుగులో మాత్రమే తీయాలనుకున్నాం. చివర్లో మరో నిర్మాత కూడా తోడవ్వడంతో తెలుగు, తమిళంలో నిర్మించాం. దర్శకుడు షఫీ పుట్టింది తమిళనాడులో అయినా తెలుగు సినిమాలు ఎక్కువ చేశారు. రెండు ప్రాంతాల వాళ్లకు అనుగుణంగా ఈ సినిమా తెరకెక్కించారు. నాకు ఒక్క ముక్క తమిళం రాదు. డైలాగ్స్ నేర్చుకోవడానికి గంటల గంటలు పట్టేది.

● కథలో బలం ఉండబట్టే ఆరుగురు హీరోయిన్లు నటించడానికి ఒప్పుకున్నారు. ఒకరితో ఫ్రెండ్ అవుతున్నాను అనుకునే లోపు ఆమె పార్ట్ షూటింగ్ పూర్తయి మరో హీరోయిన్ జాయిన్ అయ్యేవారు. ఇంత మంది హీరోయిన్లు ఉన్నప్పుడు చిన్న చిన్న ఫైట్స్ కామన్. ఇద్దరు హీరోయిన్స్ సెట్లో ఉన్నప్పుడు అక్కడి వాతావరణంలో తేడా నాకు అర్థం అయ్యేది.

● ఏ పని చేసినా నం.1గా ఉండాలనుకునే మనస్తత్వం నాది. అలానే కష్టపడతాను. మన పని మనం చేసుకుంటూ వెళ్తే సక్సెస్ ఆటోమేటిక్‌గా వస్తుంది. ఆ మధ్య ఓ పెద్ద ప్రాజెక్ట్‌లో హీరోగా అవకాశం వచ్చింది. చివరి నిమిషంలో క్యాన్సిల్ అయింది. దాంతో నా గత చిత్రానికి, దీనికి ఇంత గ్యాప్ వచ్చింది. ప్రస్తుతం ఓ మూడు సినిమాలు లైన్లో ఉన్నాయి. అభిషేక్ పిక్చర్స్ వాళ్లకు చేస్తున్నది ఫ్యామిలీ డ్రామా. అందులో మంచి లవ్‌స్టోరీ ఉంటుంది.

**ఏ రంగంలో అయినా మార్పు మంచిదే. అందరికీ చాన్స్ ఇవ్వాలనే పద్ధతిని నమ్ముతాను. ఆంధ్రప్రదేశ్ సీఎంగా చంద్రబాబు గారిని చూశాం. ఇప్పుడు జగన్‌గారికి అవకాశం ఇచ్చారు. ఆప్షన్ ఉండాలి. ఈయన సరిగ్గా పరిపాలించకపోతే ఆయన. ఆయన చేయకపోతే ఈయన.. అలా ఉండాలి. జగన్‌గారు రావడం ఖచ్చితంగా మంచిదే. ఆయనకి ఎక్స్‌పీరియన్స్ లేదని ఎందుకు అనుకోవాలి. జగన్‌గారు యంగ్ స్టర్, ప్రపంచాన్ని చూశాడు. ఆయన బాగా పాలించగలరని అనుకుంటున్నాను.**

● మా ప్రొడక్షన్‌లో ప్రస్తుతం బెల్లంకొండ శ్రీనివాస్‌తో ‘రాక్షసుడు’ సినిమా చేస్తున్నాం. జూలై 18న రిలీజ్ అనుకుంటున్నాం. నా బ్యానర్‌లో నేను నటించకపోయినా ఫర్వాలేదు. ఆర్టెడీ బ్యానర్‌లో నిర్మాతగా నా పేరున్నట్టే. ప్రతి సినిమాలో నేనుండ వసరం లేదు కదా.

● ‘7’లో కొన్ని లిప్‌లాక్ సన్నివేశాలు ఉన్నాయి. కథ చెప్పినప్పుడు ముద్దు సీన్లు ఉన్నాయని నాతో చెప్పలేదు. సెట్లోకి వెళ్లి హీరోయిన్‌ను ముద్దుపెట్టమంటే భయపడ్డాను. ‘ఒకవేళ తను కొడితే ఏంటి?’ అనుకున్నాను. మొదట్లో కొంచెం ఇబ్బంది పడ్డాను. ఆ తర్వాత ధైర్యంగా చేసేశాను.

ఇస్లాం వెలుగు

సాక్షి ఫ్యామిలీ సన్నిధి
నల్లగొండ ॥ ఆదివారం
2-6-2019

# సకల శుభాల సంరంభం



**ము**స్లింలు జరుపుకునే రెండు ప్రధాన పండుగల్లో ఈదుల్ ఫిత్ర్ ఒకటి. దీన్నే సాధారణంగా రమజాన్ పండుగ అని వ్యవహరిస్తారు.

ముహమ్మద్ ప్రవక్త(స)వారు మక్కా నగరం నుండి మదీనా నగరానికి వలస వెళ్ళిన పద్దెనిమిది నెలల తరువాత, రమజాన్ నెల మరి రెండురోజుల్లో ముగుస్తుందనగా, హి(జ్రిశకం రెండవ సంవత్సరంలో సదఖ, ఫిత్రా, ఈద్ నమాజులకు సంబంధించిన ఆదేశాలు అవతరించాయి.

''ఎవరైతే పరిశుద్ధతను పొంది, అల్లాహ్ నామాన్ని స్మరిస్తూ ఈద్ నమాజు ఆచరించారో వారు సాఫల్యం పొందుతారు.' అని ఖురాన్ చెబుతోంది.

ఒకసారి హజ్రత్ అబుల్ ఆలియా.. అబూఖుల్దాతో.. 'రేపు మీరు నమాజు కోసం ఈద్ గాహ్‌కు వెళ్ళేముందు ఒకసారి నావద్దకు వచ్చి వెళ్ళండి.'అన్నారు.

మరునాడు అబూఖుల్దా ఆయన దగ్గరికి వెళ్ళినపుడు.. ''ఏమైనా భుజించారా?'' అని అడిగారు.

''అవును, భుజించాను'' అన్నారు ఖుల్ దా

''గుస్ల్ (స్నానం) చేశారా?'' అని మళ్ళీ ప్రశ్నించారు.

'చేశాను.' అన్నారాయన

''మరి, జకాత్, ఫిత్రాలు చెల్లించారా??' అని అడిగారు మళ్ళీ.

''ఆ..ఆ.. చెల్లించాను.'' అన్నారు అబుల్ ఖుల్దా.

'శుభం. ఇక చాలు.. ఈవిషయాలే అడుగుదామని రమ్మన్నాను. ఖురాన్ వాక్యంలోని సారాంశం కూడా ఇదే' అన్నారు అబుల్ ఆలియా.

పవిత్రఖురాన్‌లో 'ఈద్ ' అనే పదం ఓ ప్రత్యేక అర్థంలో మనకు కనిపిస్తుంది. సూరె మాయిదాలో దైవ ప్రవక్త హజ్రత్ ఈసా అలైహిస్సలాం, ఆకాశం నుండి 'మాయిదా'ను(ఆహార పదార్థాలతో నిండిన పళ్ళెరాలు)అవతరింపజేయమని దైవాన్ని వేడుకున్నారు. 'ప్రభూ..! మాముందు వడ్డించిన విస్తరినొకదాన్ని ఆకాశం నుండి అవతరింపజేయి. అదిమాకూ, మా పూర్వీకులకూ, రాబోయే తరాలకూ ఈద్ (పండుగ)రోజు అవుతుంది' అని ప్రార్థించారు.

తరువాత, ఆయన ఇజ్రాయేలీయులతో, మీరు 30 రోజుల వరకు ఉపవాస వ్రతం పాటించి, ఆకాశం నుండి 'మాయిదా' వర్షింపజేయమని అల్లాహ్ ను ప్రార్థించండి. ఆయన మీ వేడుకోలును స్వీకరిస్తాడు. ఎందుకంటే, స్వయంగా ఆచరించిన వారికే దాని ప్రతిఫలం లభిస్తుంది.' అన్నారు. వారి మాట ప్రకారం, ఇజ్రాయేలీయులు 30 రోజులు ఉపవాసం పాటించారు. దాంతో ఆకాశం నుండి 'మాయిదా' అవతరించింది. అది ఎంత తిన్నా తరిగేది కాదు. అందుకే మాయిదా అవతరణను క్రీస్తుమహనీయులు పండుగ(ఈద్)తో పోల్చారు. అంటే, దైవానుగ్రహాలు పొంది సంతోషాన్ని, ఆనందాన్ని, హర్షాన్ని వ్యక్తం చేయడం ప్రవక్తల సంప్రదాయం అన్నమాట. ఈ విషయం పవిత్ర ఖురాన్‌లో ఇలా వుంది: 'ప్రవక్తా.!వారికిలా చెప్పు. ఈ మహాభాగ్యాన్ని అల్లాహ్ మీకోసం పంపాడంటే ఇది ఆయన అనుగ్రహం, కారుణ్యమే. దానికి వారు ఆనందోత్సాహాలు జరుపుకోవాలి.'(10-58)

ఆయన అనుగ్రహాల్లో అత్యంత గొప్ప అనుగ్రహం పవిత్రఖురాన్ అవతరణ. ఇది మానవాళి మార్గదర్శిని.రుజుమార్గం చూపే, సత్యాసత్యాలను వేరుచేసే స్పష్టమైన ఉపదేశాలు ఇందులో ఉన్నాయి.

అల్లాహ్ అనుగ్రహాలను గురించి గనక మనం ఆలోచించగలిగితే, మానవ మనుగడకోసం ఆయన ఎన్ని ఏర్పాట్లు చేశాడో అర్థమవుతుంది. మానవుడు మాతగర్భం నుండి భూమిపై పడగానే అతని కోసమే సృష్టిమొత్తం ఎదురు చూస్తున్నట్లు అనిపిస్తుంది. ఇన్ని అనుగ్రహాలు తమపైకురిపించినందుకు కృతజ్ఞతగా ప్రవక్త మహనీయులవారి సంప్ర దాయం వెలుగులో భక్తిశ్రద్ధలతో 'ఈద్' జరుపుకుంటారు. అధికంగా ఆరాధనలు చేస్తారు. సదఖ, ఖైరాత్, ఫిత్రా, జకాత్ తదితర పేర్లతో దానధర్మాలు చేస్తారు.పేద సాదలు కూడా తమతో పాటు పండుగ సంతోషంలో పాలుపంచుకునేలా ఫిత్రాల రూపంలో ఆర్థికంగా సహకరిస్తారు.

రమజాన్ నెలవంక దర్శనంతో మొదలైన ఉపవాసాలు నెలరోజుల తరువాత షవ్వాల్ చంద్రవంక ను చూడడంతో విరమిస్తారు. ఈ పండుగనే 'ఈదుల్ ఫిత్ర్'అంటారు.

పండుగరోజు ముస్లిములందరూ పొద్దున్నే స్నానపానాదులు ముగించుకొని ప్రాతఃకాల ఫజర్ నమాజ్ చేస్తారు. అనంతరం నూతన వస్త్రాలు ధరించి, అత్తరు, పన్నీరు లాంటి సుగంధాలు రాసుకొని ఆనందోత్సాహాలతో 'ఈద్ గాహ్' కు బయలుదేరతారు. అందరూ ఒకచోట గుమిగూడి తమకు రోజా వ్రతం పాటించే మహాభాగ్యం కలగజేసినందుకు, మానవుల మార్గదర్శకం కోసం, సాఫల్యం కోసం పవిత్రగ్రంథం అవతరింపజేసినందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెల్లించుకుంటూ రెండు రకతులు నమాజ్ చేస్తారు.

తరువాత 'ఇమాం' ఖురాన్, హదీసుల వెలుగులో సమాజానికి దిశా నిర్దేశన చేస్తూ సందేశమిస్తాడు. అందరూ కలిసి దేవుని గొప్పదనాన్ని, ఘనంగా కీర్తిస్తారు. తమకోసం, తమ కుటుంబాల కోసం, బంధు మిత్రుల కోసం, దేశంకోసం, దేశ ప్రజల సుఖ సంతోషాల కోసం, ప్రపంచ శాంతి కోసం అల్లాహ్‌ను ప్రార్థిస్తారు. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ, అభివాదాలు, ఆలింగనాలు చేసుకుంటూ తమ అంతరంగాల్లోని ఆనందాన్ని పంచుకుంటారు. పండుగకు ప్రత్యేకంగా తయారు చేసిన తీపి వంటకాలను కులమతాలకతీతంగా మిత్రులు స్నేహితులందరికీ 'ఈద్ ముబారక్' శుభాకాంక్షలతో పంచి పండుగ జరుపుకుంటారు. ఈవిధంగా 'ఈదుల్ ఫిత్ర్' పండుగ మానవ సమాజంలో నైతిక, మానవీయ విలువలను, పరస్పర ప్రేమానురాగాలను పెంపొందిస్తుంది. పరోపకార గుణాలను సహనం, సానుభూతి భావాలను ప్రోది చేసి, సమాజంలో సమానత్వం, సోదరభావం, సామరస్య వాతావరణాన్ని సృజిస్తుంది. అల్లాహ్ మనందరికీ సన్మార్గ భాగ్యం ప్రాప్తింపజేయాలని, ప్రపంచం సుఖ సంతోషాలతో, శాంతి సామరస్యాలతో సుభిక్షంగా వర్ధిల్లాలని మనసారా కోరుకుందాం.

**– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

## ఈద్ నమాజ్ ఇలా...



అందరూ ఈద్ గాహ్‌కు చేరుకున్న తరువాత వరుస క్రమంలో బారులు తీరి నిలబడతారు. ఇమాం అగ్రభాగంలో నిలబడి ఆరు, లేక పన్నెండు అదనపు తక్బీర్‌లతో రెండు రకతులు నమాజ్ చేయిస్తాడు. ఈద్ నమాజ్ సంకల్పం చేసుకున్న తరువాత, అల్లాహు అక్బర్ అని రెండుచేతులు పైకెత్తి నాభిపై, లేక గుండెలపై కట్టుకోవాలి. తరువాత 'సనా'పఠించి, మళ్ళీ అల్లాహు అక్బర్ అని పలికి చేతులు పైకెత్తి కిందికి వదిలెయ్యాలి. ఇలా రెండుసార్లు చేసి మూడవసారి చేతులు కట్టుకోవాలి. ఇప్పుడు ఇమాం సూరె ఫాతిహా తరువాత, మరొక చిన్నసూరానో, లేక కొన్ని వాక్యాలో పఠించి రుకూ, సజ్దాలు చేస్తాడు. తరువాత రెండవ రకతుకోసం నిలబడి మళ్ళీ సూరె ఫాతిహా, మరికొన్ని వాక్యాలు పఠించి మూడు సార్లు అల్లాహు అక్బర్ అంటూ మూడుసార్లుచేతులు పైకెత్తి కిందికి వదిలేస్తారు. నాల్గవ సారి అల్లాహుఅక్బర్ అంటూ రుకూ చేస్తారు. తరువాత సజ్దాలు చేసి, అత్తహియ్యాత్, దురూద్‌లు పఠించి ముందు కుడి వైపుకు,తరువాత ఎడమ వైపుకు సలాం చెప్పడంతో, ఆరు అదనపు తక్బీర్ లతో రెండు రకతుల ఈద్ నమాజ్ ప్రక్రియ ముగుస్తుంది. ఈద్ నమాజులో అజాన్, అఖామత్‌లు ఉండవు. తరువాత ఇమాం మింబర్ (వేదిక) ఎక్కి ఖురాన్, హదీసుల వెలుగులో ప్రస్తుత పరిస్థితులను అన్వయిస్తూ సమాజానికి సందేశం ఇస్తారు.

---

సంగీత సాహిత్యం

## నీ వెనుక రావడానికి ఆయనెప్పుడూ సిద్ధమే!

**'నీ**వు వటువువా! గృహస్థువా! సన్యాసివా! యతివా! ఎవరికి కావాలి ? నీ హృదయ పద్మాన్ని తీసి పరమేశ్వరుడి పాదాల దగ్గర పెట్టావా, లేదా! అలా పెడితే నీ వెంట పరిగెత్తి రావడానికి పరమేశ్వరుడు సిద్ధంగా ఉన్నాడు.'' అంటారు శంకరాచార్యుల వారు శివానంద లహరిలో.

అన్నమాచార్యుల వారు అదే భావనతో కీర్తన చేస్తూ..''కుమ్మర దాసుడైన కురువరతినంబి రమ్మన్న చోటికి వచ్చి అంతగా కోర్కె తీర్చినవాడివే '' అంటూ తరువాత చరణంలో ''దొమ్ములు సేసినయట్టి తొండమాన్ చక్కురవర్తి రమ్మన్న చోటికి వచ్చి నమ్మినవాడు'' అంటారు. ఈ తొండమాన్ చక్రవర్తి ఎవరు ?



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

పూర్వకాలంలో సుధర్ముడనే రాజు ఉండేవాడు. ఆయన కపిలతీర్థం దగ్గరికి వచ్చారు. అక్కడ స్నానాలు చేస్తున్న సమయంలో పాతాళ లోకాన్ని పరిపాలించే ధనంజయుడనే నాగలోకపు ప్రభువు కుమార్తె అక్కడ జలకాలాడుతూ కనపడింది. ఆమె అంగీకారంతో ఆయన ఆమెను గాంధర్వ వివాహం చేసుకున్నాడు. వారు కొంత కాలం అక్కడ ఉన్న దొండపాదలలో విహరించారు. ఆమె గర్భందాల్చి పుట్టింటికి వెడుతుంటే..'' నీకు కుమారుడు కలిగి పెద్దయిన తరువాత వాడిని నా దగ్గరికి పంపేటప్పుడు నేను గుర్తుపట్టడానికి వీలుగా దొండ తీగలను నడుముకు చుట్టుకుని ఈ రాజముద్రికను వేలికి పెట్టుకుని రమ్మనమను. అలా వస్తే నేను సులభంగా గుర్తుపడతాను'' అని ఉంగరం ఇచ్చి ఆమెకు అభయం ఇస్తాడు. ఆమె తరువాత అలాగే సుధర్ముడి వద్దకు పంపింది. నడుముకి దొండతీగలు చుట్టుకుని వచ్చాడు కనుక ఆయనకు తొండమాన్ అని పేరొచ్చింది. (తొండమాన్ తవ్వించిన చెరువు ఇప్పటికీ ఉంది. ఈయన వేంకటేశ్వరుడి మామగారయిన ఆకాశరాజుకు సోదరుడు. ఇద్దరికీ సమానమైన రాజ్యభాగం ఇచ్చారు).

తొండమాన్ జీవితంలో ఒక పొరబాటు చేసాడు. ఒకరోజు కూర్ముడు అనే బ్రాహ్మణుడు ఆయన దగ్గరకు వచ్చి'మా తండ్రిగారి అస్థికలు గంగలో నిమజ్జనం చేయడానికి కాలినడకన కాశీకి వెడుతున్నాను. నాభార్య గర్భిణి, కొడుకు ఐదేళ్ళవాడు, ఎక్కువ దూరం నడవలేడు. నేను తిరిగొచ్చేదాకా వారి ఆలనాపాలనా మీరు చూడాలి' అని కోరగా సమ్మతించిన తొండమాన్ వారిని కట్టుదిట్టమైన ఏర్పాట్లతో ఒక భవంతిలో ఉంచి తదనంతర కాలంలో మర్చిపోయాడు. కొంతకాలానికి అక్కడ వారికి ఆహార పదార్థాలు అయిపోయాయి. మరి కొంతకాలానికి కూర్ముడు తిరిగొచ్చి తన భార్యబిడ్డలని అప్పగించమని కోరతాడు. అప్పుడు వారి విషయం గుర్తొచ్చి మొదట భయపడినా ''వారు స్వామి దర్శనానికి వేంకటాచలం వెళ్ళారు. వచ్చేస్తారు. అప్పటిదాకా సత్రంలో ఉండండి భోజన సంభారాలు ఏర్పాటు చేయిస్తాను' అని చెప్పి పంపుతాడు. తొండమాన్ వెంటనే తన కుమారుడిని పంపి వాళ్ళకోసం వాకబు చేయించాడు. వెళ్ళినవాడు తిరిగొచ్చి ''ఆహారం లేక వారు మరణించారు. అక్కడ అస్థిపంజరాలు పడి ఉన్నాయి'' అన్నాడు. భయపడిపోయిన తొండమాన్ ఆనంద నిలయానికి పరుగున వెళ్ళి స్వామి పాదాలను ఆశ్రయించాడు. తన భక్తుడివై, రాజువై ఉండి మాట ఇచ్చి తప్పి ఇంతటి ఘాతుకానికి కారణమయ్యావు. అయినా రక్షిస్తా. అస్థి తీర్థంలో(ఇప్పటికీ ఉంది) నేను మెడలోతు నీళ్ళలో మునిగి ఉంటా. వెంటనే వెళ్ళి అస్తికలు తెచ్చి ఒడ్డున పెట్టి ఆ తీర్థం నీళ్ళతో ప్రోక్షణ చెయ్యి.'' అని ఆదేశించాడు. ఆ తరువాత వాళ్ళు బతికారు.

అప్పటివరకు భక్తులతో మాట్లాడుతుండే స్వామివారు 'ఈనాటినుంచి నేనిక మాట్లాడను. నేనేదయినా చెప్పవలసి వస్తే అర్చకులమీద ఆవహించికానీ, మరో రూపంలో కానీ నా మనోగతాన్ని తెలియచేస్తాను' అని ప్రకటించారని చెబుతారు.

---

భాగవత చిత్రణ

**ఆదిన్ శ్రీ సతి కొప్పుపై దనువుపై నంసోత్తరీయంబుపై**
**బాదాబ్జంబులపై గపోల తటిపై బాలిండ్లపై నూత్నమ**
**ర్యాదం జెందుకరంబు గ్రిందగుట మీదై నా కరంబుండట మేల్**
**గాదె రాజ్యము గోజ్యమున్ సతతమే? కాయంబు నా పాయమే.**

**వివరణ:** వామనుడు, బలి చక్రవర్తిని యాచించడానికి అతని దగ్గరకు రావడంతో, బలి చక్రవర్తి తన భాగ్యాన్ని తన గురువైన శుక్రాచార్యులతో చెబుతున్నాడు. ఈ వామనుడు సాక్షాత్ శ్రీ మహావిష్ణువు. సమస్త సంపదలతో ఆది దేవత అయిన శ్రీ మహాలక్ష్మికి భర్త. అతడు చెయ్యి చాచి అడుగుతున్నాడు. ఈ చెయ్యి ఎంత గొప్పది! మొదట లక్ష్మీదేవి కొప్పుపైన, శరీరం పైనా, పైట చెరగుపైనా, పాదపద్మాల పైనా, చెక్కిళ్లపైనా, పాలిండ్లపైనా విహరించే ఆయన చేయి యాచనకు రావడం వల్ల ఇప్పుడు ఆ చేయి కిందుగా అయింది. నా చేయి పై చేయి అయ్యింది. నేను శ్రీ మహావిష్ణువుకు దానం ఇచ్చేసే స్థితిలో ఉన్నాను. ఇది ఎంత సౌభాగ్యం? ఈ రాజ్యాలు గీజ్యాలు శాశ్వతమా? ఈ శరీరం మాత్రం శాశ్వతంగా ఉంటుందా? ఇంతటి సౌభాగ్యాన్ని నేను వదలుకోను అంటున్నాడు బలి చక్రవర్తి.



**– డా. చెలికాని మురళీకృష్ణారావు**

---

సువార్త



## ఆంతర్యంలోని ఆత్మీయతతోనే ఆశీర్వాదాలు...

**అ**మ్మోరీయులనే శాపగ్రస్తుల సంతతికి చెందిన కనాను ప్రజలు గిబియోనీయులు. వాగ్దాన దేశమైన కనానులో యెహోషువా నాయకత్వంలో సాగుతున్న జైత్రయాత్రలో యెరికో, హాయి పట్టణాలు ధ్వంసమైనట్టే, తాము కూడా సంహారమవుతామని గ్రహించి శాంతి ఒప్పందం కోసం ఎక్కడో దూర దేశం నుండి వచ్చామంటూ గిబియోనీయులు కపట నాటకమాడి యెహోషువా శరణు కోరారు. దేవుని వద్ద విచారణ కూడా చెయ్యకుండానే, యెహోషువా వారికి ప్రమాణం చేశాడు. మూడు రోజుల తర్వాత వాస్తవం తెలిసి వారిని నిలదీస్తే, మీ దేవుడు చాలా గొప్పవాడు, మీ పక్షంగా గొప్ప కార్యాలు చేశాడని విని ఆయన శరణులో, మీ నీడలో బతకాలని నిర్ణయించుకున్నామని వారన్నారు. మాటిచ్చిన తర్వాత మడమ తిప్పకూడదన్న దేవుని పద్ధతికి లోబడి ఇశ్రాయేలీయులు తమ ప్రమాణాన్ని నిలబెట్టుకున్నారు. సంధి ఒప్పందానికి దేవుడు కూడా ఆమోద ముద్ర వేశాడు. గిబియోనీయుల ఉదంతం విని ఆ వెంటనే మిగిలిన కనాను రాజులంతా కలిసి గిబియోనీయులతో సమిష్టిగా మహా యుద్ధం చెయ్యగా ఇశ్రాయేలీయులు కూడా వారికి అండగా నిలిచారు. దేవుడైతే ఒక రోజుపాటు సూర్యుణ్ణి ఉన్న చోటే నిలిపి మరీ వారికి ఘనవిజయాన్నిచ్చాడు( యెహో 10:12). ఇశ్రాయేలీయుల మధ్య పనివారుగా ఉండేందుకు అంగీకరించిన గిబియోనీయులకు, ఆలయంలో బలిపీఠం వద్ద కట్టెలు నరికే, నీళ్ళు మోసితెచ్చే పనినిచ్చి, దేవుడు తన ఆరాధనా కార్యక్రమాల్లో వారికి భాగస్వామ్యాన్నిచ్చాడు. లేవీయులనే అర్చకులుండే పట్టణాల్లో దేవుడు గిబియోను పట్టణాన్నికూడా చేర్చాడు. దావీదు వద్ద ఉన్న 30 మంది మహావీరుల్లో ఇష్మాయా అనే గిబియోనీయుడు కూడా ఉన్నాడని బైబిల్ చెబుతోంది. చక్రవర్తిగా సొలొమోను గిబియోనులో బలులర్పించినప్పుడు దేవుడు అక్కడే ప్రత్యక్షమై అతనికి వరాలనిచ్చాడు, బబులోను చెర నుండి తిరిగొచ్చిన వారిలో 95 మంది గిబియోనీయులు కూడా ఉన్నారని నెహెమ్యా రాశాడు. యెరూషలేము ప్రాకారాల పునర్నిర్మాణంలో కూడా గిబియోనీయుల ప్రస్తావన ఉంది. కాలగర్భంలో కలిసిపోవాల్సిన గిబియోనీయులకు దేవుడు ఇలా మహా చరిత్ర నిచ్చాడు. కనానీయులంతా సంహారం కాగా. గిబియోనీయులు మాత్రం, దేవునికి తలవంచి, దేవుని ప్రజలతో సఖ్యత కోరుకొని తమ ప్రాణాలే కాదు, తమ ఉనికిని కూడా కాపాడుకున్నారు. పాముల వివేకం, పావురాల నిష్కపటత్వం విశ్వాసికుండాలన్న యేసుప్రభువు బోధకు గిబియోనీయులే ఉదాహరణ.

తలుపు చిన్నదైతే తలవంచడమొక్కటే మార్గం. లేకపోతే తల బొప్పికట్టడం ఖాయం. అపకార దష్టితో కాక ప్రాణభీతితోనే గిబియోనీయులు కపట నాటకమాడారని దేవునికి ముందే తెలుసు. పైవేషాలను కాదు, ఆంతర్యంలో తన పట్ల వారికున్న విశ్వాసాన్ని, భయభక్తుల్ని దేవుడు చూశాడు. పైకి నీతిమంతుల్లాగా ఉన్నా ఆంతర్యంలో నిండా దుష్టత్వంతో జీవించేవాళ్లున్నారు. పైకి నాటకాలాడినా ఆంతర్యంలో ఆత్మీయత ఉన్నవాళ్లున్నారు. దేవుడు మాత్రం ఆంతర్యంలోని భక్తి, నీతి, పరిశుద్ధతను బట్టే ప్రతిస్పందిస్తాడు. కత్తితో తలపడటం కన్నా యుక్తితో మెలగడమే మెరుగనుకొని గిబియోనీయులు అలా గొప్ప ఉపద్రవం నుండి తప్పించుకోవడమే కాక, దేవుని ప్రజల్లో భాగమయ్యారు, దేవుని ఆశీర్వాదాలకూ పాత్రులయ్యారు. మనవాడు కదా, ఇలా చేయవచ్చా? అని ఇతరులను నిందించే ముందు, పైకి ఎంతో భక్తిగా, పవిత్రంగా, నీతిమంతుల్లాగా ప్రవర్తించే నా ఆంతర్యంలో లేదా మనవాళ్ళ ఆంతర్యంలో ఇంతటి మురికి కాలువలా? అని ప్రశ్నించుకునేవాడే నిజమైన విశ్వాసి. విశ్వాసి ఆంతర్యంలోని ఆత్మీయత, ఉదాత్తమైన ఆలోచనలను బట్టే దేవుడు అనూహ్యమైన విజయాలు, ఆశీర్వాదాలిస్తాడు, ఆ విశ్వాసినే కొల్లాది మందికి ఆశీర్వాదంగా మార్చుస్తాడు.

**– రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్**
Email: prabhukirant@gmail.com

---

ఆలయం ఆగమం

## ద్వారపాలకులు



**ఆ**లయ ద్వారం అనంతశక్తికేంద్రం అయితే ఆ శక్తిని కాపాడేవారు ఈ ద్వారపాలకులు. వీరినే ప్రతీహారులు అని కూడా అంటారు. ద్వారపాలకులు లోపలి దైవానికి ప్రతినిధులు. ఆలయంలోకి ప్రవేశించే వారెవరైనా వీరి అనుమతి కోరి వెళ్లవలసిందే. ద్వారపాలకులు ఆలయ ద్వారానికి కుడి ఎడమలలో ఇరువైపులా నాలుగు చేతులతో, ఆయుధాలను ధరించి నిలబడి ఉంటారు. భక్తులకు వీరిని చూస్తే సాధారణంగానే కాస్త భయం కలుగుతుంది. ఎందుకంటే ద్వారపాలకులు కోరపళ్లతో, తీక్షణమైన చూపులతో ఉంటారు. దీనికి కారణం ఏంటంటే భగవంతుని దర్శించడానికి వెళ్లే మనం చాలా జాగ్రత్తగా, మనస్సు ఇతరమైన ఆలోచనలు చేయకుండా, ఒళ్ళు దగ్గర పెట్టుకొని భయభక్తులతో స్వామి సన్నిధికి చేరుకోవాలి. దానికి ద్వారపాలకులు మనకు మార్గదర్శనం చేస్తారు. ద్వారపాలకులు సాధారణంగా గదను లేదా దండాన్ని నిలబెట్టి రెండు కాళ్లను కత్తెర వలె ఉంచి, పరహస్తాలలో అంటే వెనుక చేతులతో శివాలయంలో త్రిశూలం, డమరుకాన్నీ, విష్ణ్వాలయంలో శంఖం, చక్రం ధరించి నిజహస్తాలతో సూచీముద్ర, తర్జనీముద్ర, విస్మయహస్తం ఇలా ఏదో ఒకటి చూపుతూ ఉంటారు. చూపుడువేలుతో స్వామిని చూపుతూ 'ఆయనను శరణు వేడండి. కష్టాలనుండీ గట్టెక్కే మార్గం ఆయనే చూపుతాడు' అనేలా కనిపించే ముద్రను సూచీ ముద్ర లేక సూచీహస్తం అంటారు.

'నీవు అడుగుపెట్టిన చోటు భగవత్ సన్నిధానం. ఈ స్వామి మహిమను, క్షేత్ర మహిమను గుర్తెరిగి మసలుకోండి. తప్పులు చేసి ఆయన ఆగ్రహాన్ని పొందవద్ద'ని చూపుడువేలు నిటారుగా ఉంచి భయపెట్టినట్లుండేది తర్జనీ హస్తం. చేసే ప్రతి పనిలోనూ భగవంతుని దర్శించే పని ఒక్కటి చేస్తే చాలు ఇక అంతా ఆయనే చూసుకుంటాడు. మరేం భయమక్కర్లేదు' అనే తత్త్వం కూడా ఈ తర్జనీముద్ర అంతరం.

'ఈ స్వామి మహిమను వర్ణించడం ఎవరితరం? అనంతమైన స్వామి కరుణను పొందినవారెందరో! దానికీ అంతులేదు. గట్టిగా కొలిస్తే మీరూ పరమపదం పొందగలరు. ప్రయత్నించి చూడండి! 'లోపలి దేవుని నమ్మి చెడిపోయిన వారెవరూ లేరు. మీరూ ప్రయత్నించండి' అన్నట్లు హస్తాన్ని తన లోపలివైపుకు తిప్పుకుని ఉండేది విస్మయహస్తం. భయాన్ని గొలిపే వారి క్రూరమైన చూపులే భగవంతుని అభయాన్ని మనకందించేలా చేస్తాయి. వారు చేతితో చూపే ముద్రలే మనల్ని దైవసన్నిధికి చేర్చుతాయి. కనుక ప్రతి భక్తుడూ వారి దర్శనం చేసుకుని వారి అనుమతి పొంది భగవద్దర్శనం చేసుకుంటే ఎన్నో రెట్లు శుభఫలితాలు పొందవచ్చు.

**– కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య**
ఆగమ, శిల్పశాస్త్ర పండితులు

---

గురు సన్నిధి-5

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

## భరతజాతి వెలుగురేఖ- విద్యారణ్యులు

**మీ** జీవిత లక్ష్యం ఏమిటీ అన్న గురువుగారి ప్రశ్నకు సమాధానంగా 'దేశ స్వాతంత్ర్య రక్షణకు నా జీవితాన్ని అంకితం చేస్తాను' అన్నాడు మాధవుడనే పిల్లవాడు. ఈ సమాధానం విన్న గురువులు ఆశ్చర్యపోయారు. సమాజ సేవ కోసం, ధర్మరక్షణ కోసం, నువ్వు నీ జీవితాన్ని అంకితం చేయడం చాలా గొప్ప విషయం. నీకు తప్పక విజయం లభిస్తుందని ఆశీర్వదించారు. గురువుల ఆశీర్వాదం పొందిన మాధవాచార్యుడు అనంతర కాలంలో శృంగేరీ పీఠాధిపతులైన శ్రీ భారతీ కృష్ణ తీర్థ స్వామి వారి వద్ద సన్యాస దీక్ష తీసుకుని విద్యారణ్య స్వామిగా ప్రసిద్ధి చెందారు.

**'ధర్మసంస్థాపనార్థాయ...'**

విదేశీయుల దండయాత్రలతో అతలాకుతలమైన భారతావనిని తిరిగి గాటిన పెట్టేందుకు వీరు చేసిన ప్రయత్నంలో భాగంగా విజయనగర సామ్రాజ్య స్థాపన కోసమై విద్యారణ్య స్వామి వారు భువనేశ్వరీదేవిని ప్రార్థించడంతో ఆమె కరుణించి కనకవర్షం కురిపించింది. దాంతో విద్యారణ్యులు విజయనగర సామ్రాజ్యాన్ని నిర్మించి, కొంతకాలం మార్గదర్శకులుగా ఉన్నారు. శృంగేరి పీఠానికి 12వ పీఠాధిపతిగా బాధ్యతలను నిర్వహించారు. అనేక చోట్ల అనుబంధంగా ఉపపీఠాలను స్థాపించారు. విస్తృతంగా ధర్మప్రచారం చేశారు.



**'వేదాలకు భాష్యం'**

విద్వాంసుల్లో అగ్రగణ్యులైన విద్యారణ్యులు మనిషిలో అంతర్లీనంగా ఉన్న దైవీ తత్వాన్ని దేదీప్యమానంగా వెలిగించుకోవడానికి అవసరమైన విజ్ఞతను తన గ్రంథాల ద్వారా అందించేందుకు నడుం బిగించి సోదరుడైన సాయనాచార్యుల సహకారంతో 'వేదార్థాన్ని' వ్రాసారు. పాలకులు ఆచరించాల్సిన విషయాలు చెప్పడానికి వేదభాష్యం ఓ మార్గంగా ఆయన అభిప్రాయపడ్డారు. సామాన్యులకు మింగుడుపడని గంభీరమైన వేదాంత శాస్త్రాన్ని సులభంగా వివరించేందుకు పంచదశి అనే గ్రంథాన్ని రాసారు. సర్వదర్శన సంగ్రహం అనే పేరుతో దేశంలో ఉన్న సమస్త విజ్ఞానాల సారాలను అర్థమయ్యేలా రచించారు. ఇవేగాక శంకర దిగ్విజయం, ప్రాయశ్చిత సుధానిధి మొదలైన గ్రంథాలెన్నింటినో అందించారు.

'విద్యారణ్యుడు బ్రహ్మయా? కాని నాలుగు ముఖాలు కనిపించడం లేదే. విష్ణువా? నాలుగు చేతులు కనిపించడం లేదే. శివుడా? మూడో నేత్రం కనిపించడం లేదే. ఇదంతాకాదు.... విద్యారణ్యుడు భగవంతుడు పంపిన ఒక అద్వితీయమైన శక్తి' అంటారో సందర్భంలో హరిహర రాయలవారు. జాతిని జాగృతం చేసిన విద్యారణ్యుల వారి జీవితాన్ని పరిశీలిస్తే ఈ మాటలు సత్యమేనని నిరూపితమవుతాయి.

**– అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని**
వేదపండితులు

---

పుస్తకం

## సద్గురు అనుగ్రహధార

✦ అన్నీ నువ్వే అనుకుంటున్నావు. అంతా నాదే అనుకుంటున్నావు. నీలోని ఆత్మస్వరూపాన్ని గురించి ఆలోచించలేకపోతున్నావు. ఏదో మాయపొర కమ్మేస్తుంది. ఆ మాయ నుండి బయటపడాలి. సద్గురువే మార్గదర్శి. ✦ చెప్పేవాడే కాదు, వినేవాడు కూడా గొప్పవాడే. ✦ ప్రకృతిలోని సంపదను వినియోగించుకుని తృప్తిని, ఆనందాన్ని పొందుతూ ముందుకు సాగిపోవడమే మానవ ధర్మం. అదే మోక్షానికి మార్గం. ✦ నీ సంకల్పబలమే కార్యసిద్ధి.

పై సూక్తులు సద్గురు బషీర్ బాబావి. ఎంతో అసామాన్యుడైనప్పటికీ, చాలా సామాన్యుడిలా జీవించిన ఈ నిస్వార్థ, నిరాడంబర ఫకీరు జీవితాన్ని గురించి, ఆయనతో తనకున్న పరిచయాన్ని, అనుభవాలను, మరి కొందరు సద్గురువుల చిత్రాలతో సహా 'అమృతధార'గా అందించారు విశ్రాంత అధ్యాపకులు కె. రాధాకృష్ణమూర్తి. ఈ పుస్తక ప్రసాదాన్ని బాబా భక్తులకు ఉచితంగా పంచుతున్నారు యిళ్ల వకుళశ్రీ, సోమశేఖర్ దంపతులు.



**పుటలు:** 60;
**వెల:** అమూల్యం;
**ప్రతులకు:** బషీర్‌బాబా ఆశ్రమం, రెడ్డిపాలెం సెంటర్ వయా చందోలు, గుంటూరు జిల్లా;
ఫోన్: 9441478841

---

ప్రశ్నోత్తర భారతం



242. వసువులు గంగను ఏమని ప్రార్థించారు?
243. శంతనునితో గంగ అష్టమ వసువు గురించి ఏమని పలికింది?
244. గంగాతీరానికి వెళ్లిన శంతనుడికి ఏం కనిపించింది?
245. బాలుడు ఏ విధంగా ఉన్నాడు?
246. గంగ ప్రత్యక్షమై శంతనునితో ఏ విధంగా సంభాషించింది?

– నిర్వహణ: డా. పురాణపండ వైజయంతి

జవాబులు: 242. అమ్మా! మమ్మల్ని నీ కడుపులో పుట్టనివ్వు. పుట్టగానే కడతేర్చి, మమ్మల్ని ధన్యులను చేయి. ఎనిమిదవవాడు పెరిగి పెద్దవాడవుతాడు... అని ప్రార్థించారు. గంగ అంగీకరించింది. 243. రాజా! ఈ బిడ్డ అష్టమ వసువు స్వరూపం. ఇతడిని దేవవ్రతుడు అంటారు. ఇతడు మానవ లోకంలో చిరకాలం ఉంటాడు. ఇతడిని తన వెంట తీసుకుని వెళ్లి, కాలక్రమంలో అప్పగిస్తానని పలికి దేవవ్రతుని తీసుకుని గంగ వెళ్లిపోయింది. 244. గంగ నీరసంగా కనిపించింది. గంగలో నీరు చాలా తక్కువగా ఉంది. శంతనుడు విషయం తెలుసుకోవాలనుకున్నాడు. అక్కడే ఒక బాలుడు కనిపించాడు. 245. బాలుడు శంతనుడిని పోలి ఉన్నాడు. తన బాణాలతో గంగకు కట్ట కట్టాడు. 246. గంగ మానవ రూపం ధరించి, ఆ బాలుడిని చేయి పట్టుకుని శంతనుని వద్దకు వచ్చి, 'రాజా! ఇతడు దేవవ్రతుడు. నీ కుమారుడు' అని పలికింది.

సాక్షి ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ
ఆదివారం
2-6-2019


● రానా

# నాలుగేళ్ల తర్వాత...


● గుణశేఖర్

**అ**దిగో ఇదిగో అంటూ సినీప్రేక్షకులను ఊరిస్తూ వస్తున్న రానా ‘హిరణ్యకశ్యప’ సినిమా అధికారిక ప్రకటన రానే వచ్చింది. దర్శకుడు గుణశేఖర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ‘‘మైథలాజికల్ ఫిల్మ్ ‘హిరణ్యకశ్యప’పై నేను వర్క్ చేస్తున్నాను. నటుడు రానా దగ్గుబాటి టైటిల్ రోల్ చేయనున్నారు. విస్తృత స్థాయిలో మూడేళ్లుగా ఈ సినిమా ప్రీ–ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. అవును.. మూడేళ్లుగా చేస్తూనే ఉన్నాం. చాలా ఉత్తేజంగా ఉన్నాం. త్వరలో మరిన్ని వివరాలు వెల్లడిస్తాం. రానాతో ఇది ఎగ్జైటింగ్ జర్నీగా ఉండబోతోంది’’ అని దర్శకుడు గుణశేఖర్ వెల్లడించారు. ఈ సినిమాను సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. అలాగే మైథలాజికల్ సినిమా కాబట్టి గ్రాఫిక్స్ వర్క్ కూడా బాగానే ఉంటాయని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇక ఈ సంగతి ఇలా ఉంచితే ... 2015లో వచ్చిన పీరియాడికల్ మూవీ ‘రుద్రమదేవి’ తర్వాత గుణశేఖర్ తెరకెక్కిస్తున్న సినిమా ఇదే కావడం విశేషం. ప్రస్తుతం ‘అరణ్య’ సినిమాతో రానా బిజీగా ఉన్న సంగతి తెలిసిందే.

# ఫన్ రైడ్

**వెం**డితెరపై సమంత ఉన్నప్పుడు థియేటర్స్‌లోని ఆడియన్స్‌కు ఎంజాయ్‌మెంట్ మామూలుగా ఉండదు. ఆ ఎంజాయ్‌మెంట్‌ను మరోసారి ఆడియన్స్‌కు అందించడానికి సమంత రెడీ అయ్యారు. బీవీ నందినీ రెడ్డి దర్శకత్వంలో సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం ‘ఓ బేబి’. సౌత్ కొరియన్ మూవీ ‘మిస్ గ్రానీ’ చిత్రానికి ఇది తెలుగు రీమేక్. డి. సురేశ్‌బాబు, సునీత తాటి, టీజీ విశ్వప్రసాద్, హ్యూన్ హు, థామస్ కిమ్ నిర్మించారు. వివేక్ కూచిభొట్ల, యువరాజ్ కార్తికేయన్, వంశీ బండారు సహ నిర్మాతలు. ‘ఓ బేబి’ సినిమాను జూలై 5న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ‘‘ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్, టీజర్‌లకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఔట్ అండ్ ఔట్ ఫన్ రైడర్‌గా ఈ సినిమాను తెరకెక్కించాం. బంధాలు, బంధుత్వాలతో జీవితాన్ని ఎలా గడపాలనే విషయాలను ఆలోచింపజేసే కోణంలో ఈ సినిమాను నందినీ రెడ్డి రూపొందించారు’’ అని యూనిట్ సభ్యులు పేర్కొన్నారు. సీనియర్ నటి లక్ష్మి, రాజేంద్రప్రసాద్, నాగశౌర్య, రావు రమేశ్, తేజ సజ్జ, ప్రగతి తదితరులు నటించిన ఈ సినిమాకు మిక్కీ జె. మేయర్ సంగీతం అందించారు. విజయ్ దొంకాడ, దివ్యా విజయ్ ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు.


● సమంత

# ఇంతకీ రాక్షసుడు ఎవరు?



● సాయి శ్రీనివాస్

**అ**మాయకులను అన్యాయంగా, రాక్షసానందం కోసం చంపుతుంటాడు ఓ సైకో. అతడిని పట్టుకోవడానికి పరిగెత్తే పోలీస్. ఇంతకీ రాక్షస సైకో ఎవరు? అతడిని ఈ పోలీస్ పట్టుకున్నాడా? లేదా? తెలియాలంటే ‘రాక్షసుడు’ సినిమా చూడాలంటున్నారు చిత్రబృందం. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా రమేశ్ వర్మ పెన్మత్స దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ‘రాక్షసుడు’. ఎ హవీష్ లక్ష్మణ్ కోనేరు ప్రొడక్షన్ బ్యానర్‌పై కోనేరు సత్యనారాయణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్ శనివారం రిలీజ్ అయింది. టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వస్తుందని చిత్ర బృందం తెలిపింది. ఈ సందర్భంగా నిర్మాత హవీష్ మాట్లాడుతూ – ‘‘తమిళ సూపర్‌హిట్ చిత్రం ‘రాక్షసన్’ రీమేక్‌గా ఈ చిత్రం తెరకెక్కిస్తున్నాం. ఇందులో సాయి శ్రీనివాస్ సీరియస్ పోలీసాఫీసర్‌గా కనిపిస్తారు. మేకింగ్‌లో ఎక్కడా కాంప్రమైజ్ అవ్వలేదు. షూటింగ్ దాదాపు పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. జూలై 18న మా చిత్రాన్ని రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం’’ అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, కెమెరా: వెంకట్ సి. దిలీప్.


● జ్యోతిక

## రాక్షసి టీచర్

‘**త**ప్పు చేసినవాళ్లు భయపడాలి. మనం సరిగ్గా ఉన్నప్పుడు ఎవ్వరికీ భయపడకూడదు’ అనే మనస్తత్వం కలిగిన టీచర్ ఆమె. ఓ గవర్నమెంట్ స్కూల్‌కు టీచర్‌గా వెళ్లింది. పిల్లలు చదవకపోతే బెత్తం పట్టుకుని సరిదిద్దింది. వ్యవస్థలోనూ చిన్న చిన్న తప్పులుంటే ప్రశ్నించింది. సిస్టమ్‌ను సరిచేయాలనుకుంది. మరి ఆ టీచర్ అనుకున్నది సాధించిందా? లేదా? అనే కథాంశంతో జ్యోతిక కొత్త చిత్రం ‘రాక్షసి’ తెరకెక్కింది. గౌతమ్ రాజ్ దర్శకత్వం వహించగా, యస్.ఆర్ ప్రభు నిర్మించారు. ఈ చిత్రంలో జ్యోతిక లుక్, ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. జూన్‌లో సినిమా రిలీజ్ కానుంది.


● విజయ్ ఆంటోని

## థ్రిల్లింగ్ కిల్లర్

**యా**క్షన్ కింగ్ అర్జున్, విజయ్ ఆంటోని నటించిన చిత్రం ‘కొలైగారన్’. దియా మూవీస్ బ్యానర్ నిర్మించిన ఈ చిత్రాన్ని తెలుగులో పారిజాత మూవీ క్రియేషన్స్ పతాకంపై ‘కిల్లర్’ పేరుతో టి. నరేశ్ కుమార్, టి.శ్రీధర్ విడుదల చేస్తున్నారు. ఆండ్ర్యూ లూయిస్ దర్శకత్వం వహించారు. రంజాన్ పండగ సందర్భంగా జూన్ 7న ‘కిల్లర్’ విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రనిర్మాతలు మాట్లాడుతూ– ‘‘అర్జున్, విజయ్ ఆంటోనిలకు ఉన్న క్రేజ్‌తో ఇప్పటికే తెలుగులో మంచి బిజినెస్ జరిగింది. ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ రావటంతో ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఏర్పడింది. థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం. ఈ చిత్రానికి సైమన్ కె. కింగ్ అందించిన పాటలు ఓ హైలైట్’’ అన్నారు. ఆశిమా నర్వాల్, నాజర్, సీత, భగవతి పెరుమాల్, సంపత్‌రాజ్ తదితరులు నటించారు.

## కొత్త ఐడియాతో తీశారు - సుకుమార్


● రంజిత్, సుకుమార్, సత్యనారాయణ

‘‘**స**త్యనారాయణ చాలా కొత్త ఐడియాతో ‘స్టూవర్టుపురం’ చిత్రాన్ని తెరకెక్కించాడు. పైగా ఈ సినిమాకు ఆయన దర్శకత్వం వహించడమే కాకుండా ఎడిటింగ్, కెమెరా.. ఇలా ఆల్ రౌండర్‌గా పని చేసి చాలా తక్కువ సమయంలో సినిమా చేశాడు. ట్రైలర్ చాలా ఆసక్తి కలిగిస్తోంది. ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది’’ అని డైరెక్టర్ సుకుమార్ అన్నారు. ‘గూఢచారి’ ఫేమ్ ప్రీతీ సింగ్ ప్రధాన పాత్రలో సత్యనారాయణ ఏకారి స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం ‘స్టూవర్టుపురం’. రంజిత్ కోడిప్యాక సమర్పణలో అర్కాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ని, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సుకుమార్ విడుదల చేశారు. సత్యనారాయణ ఏకారి మాట్లాడుతూ– ‘‘నరరూప రాక్షసుల్లాంటి స్టూవర్టుపురం గ్యాంగ్ హీరోయిన్ ఇంట్లోకి చొరబడతారు. వాళ్లను ఆమె ఎలా ఎదుర్కొంది అనే పాయింట్‌తో సస్పెన్స్ థ్రిల్లర్‌గా నిర్మించాం. రీ రికార్డింగ్‌కు మంచి స్కోప్ ఉన్న ఈ చిత్రానికి నవనీత్ చారి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నేపథ్య సంగీతం అందించారు. మా సినిమా ట్రైలర్‌ని మెచ్చుకున్న సుకుమార్‌గారికి థ్యాంక్స్. ఆయన చెప్పిన సలహాలను పాటిస్తాం’’ అన్నారు. ‘‘గతంలో మా బ్యానర్‌లో నిర్మించిన ‘నందికొండ వాగుల్లోనా, మోని’ చిత్రాల దర్శకుడు సత్యనారాయణ ఏకారి ‘స్టూవర్టుపురం’ సినిమాని అద్భుతంగా తెరకెక్కించారు’’ అని రంజిత్ అన్నారు. ‘‘పవర్‌ఫుల్ పాత్రలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతలకు థాంక్స్’’ అన్నారు ప్రీతి సింగ్.

## రావమ్మా హ్యూమా

**బా**లీవుడ్ హీరోయిన్ హ్యూమా ఖురేషీకి ఇంటర్నేషనల్ కాల్స్ వస్తున్నాయి. ‘హ్యూమా.. రామ్మా’ అంటూ ఇంటర్నేషనల్ డైరెక్టర్స్ ఆమెను ఆహ్వానిస్తున్నారు. రెండేళ్ల క్రితం ‘వైస్రాయ్ హౌస్’ అనే ఇంగ్లీష్ చిత్రంలో నటించిన హ్యూమా తాజాగా ‘ఆర్మీ ఆఫ్ డెడ్’ అనే మరో ఇంగ్లీష్ ప్రాజెక్ట్‌లో ముఖ్య తారగా చేసే చాన్స్ కొట్టేశారు. డ్వాన్ ఆఫ్ ద డెడ్ (2004), 300 (2006), 300: రైజ్ ఆన్ఎంపైర్ (2014) వంటి సినిమాలకు దర్శకత్వం వహించిన జాక్ స్నైడర్ ఈ చిత్రానికి దర్శకుడు. 2007లో తెరకెక్కించిన ‘జస్టిస్ లీగ్’ తర్వాత జాక్ మళ్లీ మెగాఫోన్ పట్టడం ఇదే. ఇంగ్లీష్ నటులు ఎలా పర్నెల్, అనా దే లా రెగెరా, థియో రోసి ఈ సినిమాలో ఇతర ముఖ్య తారాగణం. ‘‘దర్శకుడు జాక్‌గారికి నేను పెద్ద అభిమానిని. ఈ అవకాశం వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. షూటింగ్ ఎప్పుడు స్టార్ట్ చేస్తారా? అని ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నాను’’ అన్నారు హ్యూమా ఖురేషి. ఇక డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో హ్యూమా నటించిన ‘లీలా’ అనే వెబ్‌సీరిస్ ఈ నెలలో విడుదల కానుంది.


● హ్యూమా ఖురేషి

## మా నాన్న తగ్గారోచ్

**క**థానాయికలు ఫిట్‌నెస్‌కి ఎంత ప్రాధాన్యత ఇస్తారో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. శరీరాన్ని చక్కగా ఉంచుకోవడానికి జిమ్‌లలో చెమటోడుస్తుంటారు. కఠినమైన వర్కవుట్స్ చేస్తున్న ఫొటోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంటూ ఉంటారు కూడా. ఇక యువతారల్లో శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ విషయానికి వస్తే.. ఫిట్‌నెస్‌కి చాలా ప్రాధాన్యం ఇస్తారు. ఫిట్‌నెస్ విషయంలో ఎప్పుడూ తన ఫొటోలు షేర్ చేసే జాన్వీ తాజాగా తన తండ్రి ఫొటో షేర్ చేసి, చాలామందిని ఆశ్చర్యపరిచారు. ‘‘మా డాడీ (బోనీ కపూర్) 12 కిలోల బరువు తగ్గారు. ఆరోగ్యకరమైన జీవనం గడిపేందుకు ఆయన అన్ని కిలోల బరువు తగ్గి స్లిమ్‌గా, ట్రిమ్‌గా తయారయ్యి నాకు స్ఫూర్తిగా నిలిచారు. నాన్నను చూసి చాలా గర్వపడుతున్నా’’ అంటూ తండ్రి ఫొటోని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు జాన్వీ కపూర్. గతంలో కంటే ఆ ఫొటోలో చాలా స్లిమ్‌గా కనిపిస్తున్నారు బోనీకపూర్. గత ఏడాది ఫిబ్రవరిలో శ్రీదేవి చనిపోయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి నాన్నతో మరింత ఎక్కువగా క్లోజ్‌గా ఉంటున్నారు జాన్వీ. బహుశా బోనీ తగ్గాలనుకోవడానికి కూతురు కూడా ఓ కారణం అయ్యుంటుందేమో. జాన్వీ నటించిన తొలి చిత్రం ‘ధడక్’ గత ఏడాది విడుదలై మంచి విజయం సాధించింది. ప్రస్తుతం ఆమె శరణ్ శర్మ దర్శకత్వంలో పైలట్ గున్‌జాన్ సక్సేనా జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న ‘కార్గిల్ గర్ల్ ఇన్ లక్నో’, కరణ్ జోహార్ దర్శకత్వం వహిస్తున్న ‘తక్త్’ సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.


● బోనీ కపూర్, జాన్వీ











భరత్

## రాణించిన భరత్, సిద్దేశ్, అన్‌మోల్: భారీ ఆధిక్యం దిశగా భారత్ ‘ఎ’

శ్రీలంక ‘ఎ’తో హుబ్లీలో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో భారత్ ‘ఎ’ పటిష్ట స్థితిలో నిలిచింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ ‘ఎ’ 273 పరుగుల ఓవరాల్ ఆధిక్యం సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోరు 87/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక ‘ఎ’ 212 పరుగులకు ఆలౌటైంది. 57 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ ‘ఎ’ ఆట ముగిసే సమయానికి 46 ఓవర్లలో 6 వికెట్లకు 216 పరుగులు చేసింది. ఆంధ్ర రంజీ క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ (60 ; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో పాటు సిద్దేశ్ లాడ్ ( 58 ; 6 ఫోర్లు), అన్‌మోల్‌ప్రీత్ (60 ; 9 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు.


హెన్రీ

మున్రో, గప్టిల్

# లంక బోల్తా

## 136 పరుగులకే ఆలౌట్

### హెన్రీ, ఫెర్గూసన్ ధాటికి బెంబేలు ● 10 వికెట్ల తేడాతో గెలిచిన న్యూజిలాండ్

**ఏమాత్రం ఆశల్లేకుండా కప్‌లో అడుగు పెట్టిన శ్రీలంక... తమ తొలి మ్యాచ్‌లో చెత్త ప్రదర్శన కనబర్చింది. బ్యాట్స్‌మెన్ ఒకరి వెంట వరుస కట్టిన వేళ... జట్టు కనీసం 30 ఓవర్లయినా ఆడలేక పోయింది. శుక్రవారం వెస్టిండీస్ చేతిలో పాకిస్తాన్‌లాగే... శనివారం న్యూజిలాండ్ చేతిలో ఘోరంగా ఓడింది. అసలే అంతంతమాత్రంగా ఉన్న ప్రత్యర్థిని కివీస్ పేసర్లు హెన్రీ, ఫెర్గూసన్ అల్లాడించారు. ముఖ్యంగా హెన్రీ పేస్, స్వింగ్ బంతులతో మొదట్లోనే దెబ్బ కొట్టాడు. అనంతరం బౌలింగ్‌లోనూ ప్రభావం చూపలేకపోయిన లంక 10 వికెట్ల తేడాతో పరాజయం మూటగట్టుకుంది.**

**కార్డిఫ్:** ప్చ్...! లంక ఆట మారలేదు. ప్రతిష్టాత్మక ప్రపంచ కప్‌లోనూ వారి ఆటగాళ్లు ఫామ్ అందుకోలేదు. ఫలితం... న్యూజిలాండ్‌పై దారుణ ఓటమి. పేసర్లు రాణించడంతో రెండు జట్ల మధ్య శనివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక... మాట్ హెన్రీ (3/29), లాకీ ఫెర్గూసన్ (3/22) పేస్ దెబ్బకు 29.2 ఓవర్లలో 136 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ దిముత్ కరుణరత్నె (84 బంతుల్లో 52 నాటౌట్; 4 ఫోర్లు) ఒక్కడే అజేయంగా పోరాడాడు. కుశాల్ పెరీరా (24 బంతుల్లో 29; 4 ఫోర్లు), తిసారా పెరీరా (23 బంతుల్లో 27; 2 సిక్స్‌లు) కాసేపు నిలవగలిగారు. వీరు కాక మరే బ్యాట్స్‌మన్ రెండంకెల స్కోరు చేయలేకపోవడం గమనార్హం. అనంతరం ఓపెనర్లు మార్టిన్ గప్టిల్ (51 బంతుల్లో 73 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), కొలిన్ మున్రో (47 బంతుల్లో 58 నాటౌట్; 6 ఫోర్లు, సిక్స్) దూకుడైన ఆటతో 16.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 137 పరుగులు చేసి న్యూజిలాండ్ లక్ష్యాన్ని అందుకుంది. లంకను కోలుకోలేని దెబ్బ కొట్టిన హెన్రీకి ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’ దక్కింది.

### అతడు మినహా...!

హెన్రీ వేసిన తొలి బంతినే బౌండరీకి తరలించి తిరిమన్నె (4) లంక ఇన్నింగ్స్ ఖాతా తెరిచాడు. కానీ, మరుసటి బంతికే వికెట్ల ముందు దొరికిపోయాడు. అంపైర్ ఔటివ్వకున్నా కివీస్ సమీక్ష కోరి విజయవంతమైంది. వన్‌డౌన్‌లో వచ్చిన కుశాల్ దూకుడుగా ఆడే ప్రయత్నం చేశాడు. హెన్రీ, బౌల్ట్ బౌలింగ్‌లో రెండేసి ఫోర్లు కొట్టాడు. అయితే, నాలుగు ఓవర్ల తొలి స్పెల్ ముగిసినా విలియమ్సన్... హెన్రీని కొనసాగించడం ఫలితం ఇచ్చింది. అతడి బౌలింగ్‌లో షాట్ ఆడబోయిన కుశాల్ మిడాన్‌లో గ్రాండ్‌హోమ్‌కు క్యాచ్ ఇచ్చాడు. మరుసటి బంతికి కుశాల్ మెండిస్ (0) స్లిప్‌లో గప్టిల్ డైవింగ్ క్యాచ్‌కు వెనుదిరిగాడు. ధనంజయ డిసిల్వా (4)ను ఫెర్గూసన్ ఎల్బీ చేశాడు. మాథ్యూస్ (0), జీవన్ మెండిస్ (1) ఇలా వచ్చి అలా వెళ్లారు. 60/6తో నిలిచిన ఈ దశలో కరుణరత్నె, తిసారా వికెట్ల పతనాన్ని అడ్డుకుని జట్టు స్కోరును 100 దాటించారు. కానీ, తిసారా, ఉదాన (1) వరుస ఓవర్లలో వెనుదిరగడంతో పరిస్థితి చేయిదాటింది. లక్మల్ (7), మలింగ (1) తర్వాత వరుస కట్టారు. 81 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న కరుణరత్నె నాటౌట్‌గా మిగిలాడు. ప్రపంచ కప్‌లో ఇన్నింగ్స్ ఆసాంతం నాటౌట్‌గా నిలిచిన రెండో క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు.


కరుణరత్నె

### ఎదురులేకుండా...

బంతి బ్యాట్‌పైకి వస్తుండటంతో ఛేదనలో కివీస్ ఓపెనర్లు ఏమాత్రం ఇబ్బంది పడకుండా ఆడారు. మలింగ వేసిన తొలి ఓవర్లోనే గప్టిల్ రెండు ఫోర్లు బాది దూకుడు చూపాడు. లక్మల్ బౌలింగ్‌లో మున్రో ఫోర్, సిక్స్‌తో ధాటిని ప్రదర్శించాడు. ఓవర్లు పెరుగుతున్న కొద్దీ స్కోరును మరింత ముందుకు తీసుకెళ్లారు. ఉదాన ఓవర్లో సిక్స్‌తో గప్టిల్ (39 బంతుల్లో), తిసారా బౌలింగ్‌లో రెండు పరుగులు చేయడం ద్వారా మున్రో (41 బంతుల్లో) అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. 13వ ఓవర్లోనే కివీస్ 100 పరుగుల మార్క్ అందుకుంది. మిగిలినవాటిని మరో 3.1 ఓవర్లలోనే పూర్తి చేసి గెలిచేసింది.

### స్కోరు వివరాలు

**శ్రీలంక ఇన్నింగ్స్:** తిరిమన్నె (ఎల్బీడబ్ల్యూ) (బి) హెన్రీ 4; కరుణరత్నె (నాటౌట్) 52; కుశాల్ పెరీరా (సి) గ్రాండ్‌హోమ్ (బి) హెన్రీ 29; కుశాల్ మెండిస్ (సి) గప్టిల్ (బి) హెన్రీ 0; ధనంజయ డిసిల్వా (ఎల్బీడబ్ల్యూ) (బి) ఫెర్గూసన్ 4; మాథ్యూస్ (సి) లాథమ్ (బి) గ్రాండ్‌హోమ్ 0; జీవన్ మెండిస్ (సి) నీషమ్ (బి) ఫెర్గూసన్ 1; తిసారా పెరీరా (సి) బౌల్ట్ (బి) సాన్‌ట్నర్ 27; ఉదాన (సి) హెన్రీ (బి) నీషమ్ 0; లక్మల్ (సి) సాన్‌ట్నర్ (బి) బౌల్ట్ 7; మలింగ (బి) ఫెర్గూసన్ 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (29.2 ఓవర్లలో ఆలౌట్) 136.**

**వికెట్ల పతనం:** 1–4, 2–46, 3–46, 4–53, 5–59, 6–60, 7–112, 8–114, 9–130, 10–136.

**బౌలింగ్:** హెన్రీ 7–0–29–3; బౌల్ట్ 9–0–44–1; ఫెర్గూసన్ 6.2–0–22–3; గ్రాండ్‌హోమ్ 2–0–14–1; నీషమ్ 3–0–21–1; సాన్‌ట్నర్ 2–0–5–1.

**న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** గప్టిల్ (నాటౌట్) 73; మున్రో (నాటౌట్) 58; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (16.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 137.**

**బౌలింగ్:** మలింగ 5–0–46–0; లక్మల్ 4–0–28–0; ఉదాన 3–0–24–0; తిసారా 3–0–25–0; జీవన్ మెండిస్ 1.1–0–11–0.

## మాకు బౌలింగే కావాలి...

### పిచ్‌పై పచ్చికతో లబ్ధి పొందాలన్నదే ఉద్దేశం

ఈ ప్రపంచ కప్‌లో టాస్ గెలిచిన కెప్టెన్లు తడుముకోకుండా చెబుతున్న ఒకే ఒక్క మాట... ‘మేం ముందుగా బౌలింగ్ చేయదల్చుకున్నాం’ అని. టాస్ ఓడిన కెప్టెన్ సైతం తమ ఉద్దేశం తొలుత బౌలింగ్ చేయాలన్నదే అని అంటుండటం ఇక్కడ గమనించాల్సిన విషయం. పిచ్‌పై మొదట్లో కనిపిస్తున్న కాసింత పచ్చిక అనుకోని వరంలా వారిని ఊరిస్తుండటమే దీనికి కారణం. ఇప్పటి వరకు నాలుగు మ్యాచ్‌లు జరగ్గా... చిన్న జట్టయిన అఫ్గానిస్తాన్ మినహా మిగతా మూడు పెద్ద జట్లు తొలుత బౌలింగ్‌కే మొగ్గుచూపాయి. పచ్చికపై పేస్, స్వింగ్‌తో ప్రత్యర్థి టాపార్డర్‌ను ఇబ్బంది పెట్టాయి. ఆసీస్‌పై ముందు బ్యాటింగ్‌కు దిగి అఫ్గాన్ తొలుతే రెండు వికెట్లు కోల్పోయింది. వెస్టిండీస్, న్యూజిలాండ్ సరిగ్గా ఇలానే ఫలితాన్ని పొందాయి. ప్రారంభ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా సైతం తొలుత కొంత లాభపడినా... సొంతగడ్డ అనుకూలతతో ఇంగ్లండ్ వెంటనే పుంజుకొంది. ముఖ్యంగా తొలి గంట పిచ్ నుంచి పేసర్లకు మంచి మద్దతు దొరుకుతోంది. దీంతో పేస్‌ను ఆడటంలో బలహీనులైన పాకిస్తాన్, శ్రీలంక బ్యాట్స్‌మెన్ వికెట్ ఇచ్చేశారు. ఈ నేపథ్యంలో ఓపెనర్లు కనీసం పది ఓవర్లు నిలిస్తేనే ఏ జట్టయినా మంచి స్కోరు చేసేందుకు వీలుంటుంది. అనంతరం బ్యాటింగ్‌కు అనువుగా మారుతున్న పిచ్‌పై పరుగులు సులువుగా వస్తున్నాయి. ఇప్పటివరకు పెద్దగా ప్రభావం చూపకున్నా, టోర్నీ సాగే కొద్దీ మబ్బులు కమ్మిన వాతావరణం ఎదురయ్యే వీలుంది. దీన్నిబట్టి చూస్తే బలమైన పేస్ దళం ఉన్న జట్లు టాస్ గెలిస్తే మ్యాచ్ దాదాపు వారి చేతుల్లోకి వెళ్లినట్లేనేమో?


మొర్తజా, డు ప్లెసిస్

| ప్రపంచకప్‌లో నేడు | ముఖాముఖి రికార్డు |
|---|---|
| దక్షిణాఫ్రికా X బంగ్లాదేశ్<br>మ.3 గంటల నుంచి<br>స్టార్ స్పోర్ట్స్-1లో<br>ప్రత్యక్ష ప్రసారం | రెండు జట్ల మధ్య ఇప్పటి వరకు 20 వన్డేలు జరిగాయి. 17 మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా... 3 మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్ గెలిచాయి. |

# ఆసీస్ శుభారంభం

*ప్రపంచకప్ చరిత్రలో పాకిస్తాన్, శ్రీలంక మాజీ చాంపియన్లు. కానీ విండీస్‌తో 22 ఓవర్లయినా ఆడలేని పాక్ 105 పరుగులను మించలేదు. కివీస్‌పై లంక 30 ఓవర్లు పూర్తిగా ఆడకుండానే 136 పరుగులకే ఆలౌటైంది. కానీ క్రికెట్ కూన అఫ్గానిస్తాన్ ఐదుసార్లు చాంపియన్ అయిన ఆసీస్‌ను చక్కగా ఎదుర్కొంది. ఫలితం ఓటమైనా... మెరుగైన ప్రదర్శన కనబరిచింది.*

- అఫ్గానిస్తాన్‌పై 7 వికెట్లతో గెలుపు
- రాణించిన కమిన్స్, జంపా
- మెరిసిన వార్నర్, ఫించ్


వార్నర్

**బ్రిస్టల్:** డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా ప్రపంచకప్‌లో శుభారంభం చేసింది. తొలి మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో అఫ్గానిస్తాన్‌పై జయభేరి మోగించింది. ముందుగా అఫ్గానిస్తాన్ 38.2 ఓవర్లలో 207 పరుగులు చేసి ఆలౌటైంది. నజీబుల్లా జద్రాన్ (51; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఆసీస్ బౌలర్లలో కమిన్స్, జంపా చెరో 3 వికెట్లు తీశారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఆస్ట్రేలియా 34.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసి గెలిచింది. ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’ వార్నర్ (114 బంతుల్లో 89 నాటౌట్; 8 ఫోర్లు), కెప్టెన్ ఫించ్ (49 బంతుల్లో 66; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధసెంచరీలు సాధించారు.

### నజీబుల్లా అర్ధసెంచరీ...

టాస్ నెగ్గిన అఫ్గానిస్తాన్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ ఓపెనర్లు షహజద్ (0), హజ్రతుల్లా (0) డకౌటయ్యారు. ఈ దశలో రహమత్ షా (43; 6 ఫోర్లు) జట్టును ఆదుకున్నాడు. హష్మతుల్లా షాహిది (18)తో కలిసి జట్టును నడిపించాడు. మళ్లీ జంపా దెబ్బకు 77 పరుగులకే 5 వికెట్లను కోల్పోగా... కెప్టెన్ గుల్బదిన్ (31; 4 ఫోర్లు, 1 సిక్స్), నజీబుల్లా జద్రాన్ ఆరో వికెట్‌కు 83 పరుగులు జోడించడంతో పాటు రషీద్ ఖాన్ (27; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడటంతో 200 పైచిలుకు స్కోరు చేసింది.

### ఓపెనర్ల జోరు...

లక్ష్యం చిన్నది. జట్టు కూడా పసికూన కావడంతో ఆస్ట్రేలియా ఓపెనర్లు ఫించ్, వార్నర్ చక్కగా ఆడుకున్నారు. వార్నర్ తన శైలికి భిన్నంగా నిదానంగా ఆడుతుంటే కెప్టెన్ ఫించ్ మాత్రం ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. 40 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. తొలి వికెట్‌కు 96 పరుగులు జోడించాక ఫించ్ నిష్క్రమించగా, తర్వాత వచ్చిన ఖాజాతో కలిసి స్కోరును నడిపించిన వార్నర్ 74 బంతుల్లో ఫిఫ్టీ చేశాడు. ఖాజా (15)ను రషీద్ ఖాన్ ఔట్ చేయగా... లక్ష్యానికి చేరువలో స్మిత్ (18)ను ముజీబ్ పెవిలియన్ చేర్చాడు. మిగతా లాంఛనాన్ని మ్యాక్స్‌వెల్ (4 నాటౌట్) ఫోర్‌తో ముగించాడు. అఫ్గాన్ బౌలర్లలో ముజీబుర్, రషీద్ ఖాన్, గుల్బదిన్‌లకు ఒక్కో వికెట్ లభించింది.

# ఒసాకా, సెరెనా ఔట్


ఒసాకా

- ప్రపంచ నంబర్‌వన్‌కు షాక్ ఇచ్చిన చెక్ రిపబ్లిక్ ప్లేయర్ సినియకోవా
- సెరెనాను ఓడించిన సోఫియా కెనిన్

**తొలి రెండు మ్యాచ్‌ల్లో అతి కష్టమ్మీద గట్టెక్కిన మహిళల సింగిల్స్ ప్రపంచ నంబర్‌వన్ నయోమి ఒసాకా మూడో రౌండ్‌లో మాత్రం ఆ అద్భుతం చేయలేకపోయింది. డబుల్స్‌లో నంబర్‌వన్‌గా ఉన్న కాటరీనా సినియకోవాతో జరిగిన మ్యాచ్‌లో వరుస సెట్‌లలోనే చేతులెత్తేసిన ఒసాకా ఫ్రెంచ్ ఓపెన్ నుంచి నిష్క్రమించింది. మరోవైపు మాజీ చాంపియన్ సెరెనా విలియమ్స్ కూడా ఇంటిదారి పట్టింది. అమెరికాకే చెందిన సోఫియా కెనిన్ వరుస సెట్‌లలో సెరెనాను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది.**


సినియకోవా

**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో శనివారం పెను సంచలనాలు చోటు చేసుకున్నాయి. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ క్రీడాకారిణి నయోమి ఒసాకా ... పదో సీడ్, మాజీ చాంపియన్ సెరెనా విలియమ్స్ (అమెరికా) పోరాటం మూడో రౌండ్‌లోనే ముగిసింది. డబుల్స్ నంబర్‌వన్, సింగిల్స్‌లో 42వ ర్యాంకర్ కాటరీనా సినియకోవా (చెక్ రిపబ్లిక్) ధాటికి ఒసాకా ఇంటిముఖం పట్టింది. 77 నిమిషాల పాటు జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌లో సినియకోవా 6–4, 6–2తో ఒసాకాను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీ సింగిల్స్ విభాగంలో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రపంచ 35వ ర్యాంకర్ సోఫియా కెనిన్ 6–2, 7–5తో సెరెనాను బోల్తా కొట్టించింది. ఈ ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడిన తొలి రెండు మ్యాచ్‌ల్లో ఒసాకా తొలి సెట్‌ను కోల్పోయి, తర్వాతి రెండు సెట్‌లు గెలిచి నిలిచింది. కానీ మూడో మ్యాచ్‌లో మాత్రం అది సాధ్యం కాలేదు. ఒసాకా దూకుడుకు పగ్గాలు వేస్తూ సినియకోవా తొలి సెట్‌లో ఒకసారి... రెండో సెట్‌లో రెండుసార్లు సర్వీస్ బ్రేక్ సాధించింది. మరోవైపు ఒసాకా ఏకంగా 38 అనవసర తప్పిదాలు, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. సినియకోవా సర్వీస్‌లో బ్రేక్ సాధించేందుకు ఏడు సార్లు అవకాశం వచ్చినా ఈ జపాన్ స్టార్ ఒక్కసారీ సద్వినియోగం చేసుకోలేదు. ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో డిఫెండింగ్ చాంపియన్ సిమోనా హలెప్ (రొమేనియా), 14వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా), ఇగా స్వియాటెక్ (పోలాండ్) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. హలెప్ 6–2, 6–1తో సురెంకో (ఉక్రెయిన్)పై, కీస్ 6–3, 6–7 (5/7), 6–4తో బ్లిన్‌కోవా (రష్యా)పై, స్వియాటెక్ 0–6, 6–3, 6–3తో మోనికా పుయిగ్ (ప్యూర్టోరికో)పై గెలిచారు.


సెరెనా

### సీడెడ్ ఆటగాళ్ల జోరు...

పురుషుల సింగిల్స్ మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో టాప్ సీడ్ జొకోవిచ్ 6–3, 6–3, 6–2తో కరుసో (ఇటలీ)పై, ఆరో సీడ్ సిట్సిపాస్ 7–5, 6–3, 6–7 (5/7), 7–6 (8/6)తో క్రాజినోవిచ్ (సెర్బియా)పై, నాలుగో సీడ్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా) 6–3, 4–6, 6–2, 7–5తో పాబ్లో క్యువాస్ (ఉరుగ్వే)పై, ఐదో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 6–4, 6–2, 4–6, 1–6, 6–2తో లాజోవిచ్ (సెర్బియా)పై, తొమ్మిదో సీడ్ ఫాగ్నిని 7–6 (7/5), 6–4, 4–6, 6–1తో అగుట్ (స్పెయిన్)పై గెలిచారు. పదో సీడ్ ఖచనోవ్ (రష్యా), మాజీ చాంపియన్ వావ్రింకా (స్విట్జర్లాండ్), ఎనిమిదో సీడ్ డెల్‌పొట్రో (అర్జెంటీనా) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్ చేరారు. పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో లియాండర్ పేస్ (భారత్)–బెనోయిట్ పెయిర్ (ఫ్రాన్స్) జంట 0–6, 6–4, 3–6తో మూడో సీడ్ కబాల్–ఫరా (కొలంబియా) జోడీ చేతిలో ఓడిపోయింది.

రేడియోను కనిపెట్టిన గుగ్లీమో మార్కొనీ 1896లో ఇదే రోజున (జూన్ 2) రేడియోపై పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్నారు.



# పట్టా కావాలంటే.. మొక్కలు నాటాల్సిందే!



డిగ్రీ చదువుకోవాలంటే ఏం కావాలి.. మనవద్ద అయితే ఇంటర్మీడియట్‌లో పాస్ కావాలి. కాలేజీలో సీటు రావాలి. ఆ తర్వాత పుస్తకాలు కొనుక్కోవాలి.. ఇంకా.. కాలేజీకి రెగ్యులర్‌గా వెళ్లాలి.. శ్రద్ధగా చదువుకోవాలి.. పరీక్షలు బాగా రాయాలి.. అప్పుడు కానీ పాస్‌కాలేం. కానీ ఫిలిప్పీన్స్‌లో మాత్రం డిగ్రీ చదవాలనుకునే ప్రతి ఒక్కరూ 10 మొక్కల చొప్పున నాటాలి. అదేంటి కొత్తగా ఉందే అని అనుకుంటున్నారా..? అవును ఒక్క డిగ్రీనే కాదు హైస్కూల్, కాలేజీ పూర్తి చేయాలన్నా కూడా మొక్కలు నాటాల్సిందేనట. ఈ మేరకు ఓ బిల్లును పార్లమెంటు సభ్యుడు గారీ అలెజానో ప్రవేశపెట్టాడు. ఈ విధానం వల్ల పిల్లల్లో మొక్కలు నాటాలనే తపన పెరుగుతుందని ఆయన వివరించారు. ఇలా ఒక్క తరం పిల్లలు, యువత నాటే మొత్తం మొక్కల్లో కనీసం 10 శాతం బతికినా దాదాపు 52.5 కోట్ల చెట్లు భూమిపై జీవం పోసుకుంటాయని అంచనా. దీంతో పచ్చదనానికి పచ్చదనం.. ఆరోగ్యానికి ఆరోగ్యం.. ఆలోచన బాగుంది కదూ..!

# సముద్రమంత ప్రేమ!



ప్రియురాలిని మనసు దోచేందుకు ప్రియులు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు.. కాస్త డిఫరెంట్‌గా ఆలోచిస్తే ప్రేయసి అట్టే ఇంప్రెస్ అయి పోతుందని వెరైటీ వెరైటీ ప్రయోగాలు చేస్తుంటారు. మొన్నటికి మొన్న తన ప్రియురాలు వెళ్లే దారిలో హోర్డింగ్స్ పెట్టి తన ప్రేమను వ్యక్తపరిచాడో ప్రియుడు. చైనాలో కూడా తాజాగా తన సముద్రమంత ప్రేమను ప్రియురాలికి తెలియపరిచేందుకు ఏకంగా సముద్రాన్నే కొన్నాడో అమిత ప్రేమికుడు. సముద్రాన్ని కొనడమేంటి అనుకుంటున్నారా.. అవును నిజంగానే సముద్రంలోని ఓ ప్రాంతాన్ని కొనేశాడు. చైనాలో ఏటా మూడు ప్రేమ దినోత్సవాలు జరుపుకొంటారు. అందులో ఒక ప్రేమ దినోత్సవం నాడు సముద్రాన్ని బహుమతి ఇచ్చాడు. ఏకంగా రూ.70 లక్షలతో దాదాపు 50 ఎకరాల సముద్రాన్ని కొన్నాడు. షాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని చెనిఉషన్ ద్వీపానికి సమీపంలో ఈ ప్రాంతాన్ని ఖరీదు చేశాడు. గతంలో జాలరులకు చెందిన ఈ ప్రాంతాన్ని ఆన్‌లైన్‌లో వేలం పాట ద్వారా ఆ ప్రియుడు కొనుగోలు చేశాడు. ఈ విషయాన్ని ఆ ప్రియురాలు తన ఫ్రెండ్స్‌కు సామాజిక మాధ్యమంలో పంచుకోవడంతో ప్రపంచానికి తెలిసింది. మరి సముద్రంలో ఏం చేస్తారనే కదా మీ అనుమానం.. ఆ ప్రాంతంలో జాలీగా మీ బోటులో షికారు చేయొచ్చు. ఫిషింగ్ కూడా చేసుకోవచ్చు.

## ఎలుగుబంటి దాడిలో ముగ్గురికి గాయాలు

రాళ్లతో కొట్టి చంపిన గ్రామస్తులు



గాయాలను చూపిస్తున్న రాజన్న

మద్నూర్ (జుక్కల్): ముగ్గురిని గాయపరిచిన ఎలుగు బంటిని రాళ్లతో కొట్టి చంపారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం అవాల్‌గావ్‌లో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కవత్వార్ రాజన్న మధ్యాహ్నం గ్రామ శివారులోని గుట్ట పైకి బహిర్భూమికి వెళ్లాడు. అంతలోనే వెనుక నుంచి వచ్చిన ఎలుగుబంటి ఒక్కసారిగా మెరుపు దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. భయాందోళనతో రాజన్న ఊర్లోకి పరుగులు పెట్టగా ఎలుగుబండి వెంబడించి గాయపర్చింది. రాజన్న అరుపులతో అప్రమత్తమైన గ్రామస్తులు ఆయనను ఎలుగుబంటి నుంచి విడిపించాలని ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన పండరిగౌడ్, బలిరాంలకు సైతం గాయాలయ్యాయి. పెద్ద సంఖ్యలో పోగైన గ్రామస్తులు ఎలుగుబంటిపై రాళ్లతో దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందింది. గాయాలైన రాజన్నను మద్నూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం గ్రామస్తులు ఎలుగుబంటిని దేవుడి స్వరూపంగా భావిస్తూ చందాలు పోగు చేసి అంత్యక్రియలు నిర్వహించారు. ఎలుగు బంటి కళేబరానికి పూలదండలు వేసి పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. గ్రామంలోని శివాలయం ఎదుట పూడ్చి పెట్టారు.

# విషాదం మిగిల్చిన ఫొటో సరదా

## సెల్‌ఫోన్ వైపు చూస్తూ నీటిలో గల్లంతు

- బావతోపాటు ఇద్దరు మరదళ్ల మృతి
- జనగామ జిల్లా బొమ్మకూరు రిజర్వాయర్‌లో ఘటన



జనగామ జిల్లా నర్మెట మండలం బొమ్మకూరు రిజర్వాయర్‌లో జలకాలాడుతున్న బావమరదళ్లు. (ఇన్‌సెట్‌లో సంగీత, అవినాష్, సుమలత)

సాక్షి, జనగామ: సెల్‌ఫోన్‌లో ఫొటోలు దిగాలనే సరదా ప్రాణాలను బలి తీసుకుంది. రిజర్వాయర్‌లోకి దిగిన బావతోపాటు ఇద్దరు మరదళ్లు మృత్యువాత పడిన ఘటన జనగామ జిల్లా నర్మెట మండలం బొమ్మకూర్ వద్ద శనివారం చోటుచేసుకుంది. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన మాజీ కౌన్సిలర్ మూడ్ లక్ష్మణ్ నాయక్, కాంతాబాయి దంపతుల కుమారుడు మూడ్ అవినాష్ (29)కు రఘునాథపల్లి మండలం గిద్దెబండ తండా (జీబీతండా)కు చెందిన లదావత్ లక్ష్మణ్, లీల దంపతుల కుమార్తె దివ్యతో ఏడిన్నర క్రితం వివాహమైంది. హైదరాబాద్‌లో ఉంటున్న అవినాష్ శుక్రవారం రాత్రి జనగామకు వచ్చాడు. శనివారం గిద్దెబండ తండాలోని అత్తగారింటికి వెళ్లాడు. మధ్యాహ్నం తల్లిగారింటి వద్ద ఉన్న భార్య దివ్యతోపాటు చిన్న మామ లకావత్ అంజయ్య కుమార్తెలు సంగీత (17), సుమలత(15)తో కలసి నర్మెట మండలం బొమ్మకూరు రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. సెల్‌ఫోన్‌లో ఫొటోలు, వీడియోలు తీసుకోవడానికి రిజర్వాయర్‌లోకి దిగారు. ఒడ్డున ఉన్న దివ్య ఫొటోలు తీస్తుండగా అవినాష్, సంగీత, సుమలత నీటిలోకి దిగి సరదాగా ఒకరిపై ఒకరు నీళ్లు చల్లుకుంటూ.. ఒక్కొక్క అడుగు వెనక్కి వేస్తూ రిజర్వాయర్‌లోని ఊబిలోకి అవినాష్ మునిగిపోయాడు. సంగీత, సుమలత సైతం నీటిలో గల్లంతయ్యారు. ఒడ్డున ఉన్న దివ్యకు వారు కన్పించక పోవడంతో కేకలు వేయగా.. చుట్ట పక్కల వాళ్లు వచ్చి నీటిలోకి దిగి గాలించి ముగ్గురి మృతదేహాలను ఒడ్డుకు తీసుకొచ్చారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరిలించారు. సంగీత ఇటీవలే ఇంటర్ ఉత్తీర్ణత కాగా సుమలత పదో తరగతి పాసైంది.

## మర్రిబావిలో మరో రెండు మృతదేహాలు?

బొమ్మలరామారం : హాజీపూర్‌లో సైకో శ్రీనివాస్‌రెడ్డి.. మర్రిబావిలో మరో రెండు మృతదేహాలను పూడ్చిపెట్టాడనే ఊహగానాలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీనివాస్‌రెడ్డి తనతో పాటు లిఫ్ట్ మెకానిక్‌గా పనిచేసే దంపతులను హతమార్చి బావిలోనే పూడ్చి పెట్టాడని చర్చ జరుగుతోంది.

**శ్రీనివాస్‌రెడ్డికి మళ్లీ పోలీస్ కస్టడీ**

నల్లగొండ లీగల్ : యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం హాజీపూర్‌లో ముగ్గురు బాలికలను హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డిని మూడు రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ నల్లగొండ అదనపు జిల్లా జడ్జి ఎస్‌వీపీఎన్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ జైలులో ఉన్న శ్రీనివాస్‌రెడ్డిని గత నెలలో వారం రోజులపాటు పోలీసు కస్టడీకి ఇచ్చిన న్యాయస్థానం.. మరో రెండు కేసుల విచారణ నిమిత్తం మూడు రోజులు కస్టడీకి అనుమతించింది.

## బస్సు ఢీకొని ఇద్దరి మృతి

నల్లగొండ క్రైం: నల్లగొండ జిల్లాకేంద్రం శివారులోని అద్దంకి- నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మర్రిగూడ బైపాస్ వద్ద శనివారం ఈ సంఘటన జరిగింది. రహదారిపై అకస్మాత్తుగా ఆగిన కారును తప్పించబోయిన ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. యూటర్న్ తీసుకునేందుకు నిలిచి ఉన్న త్రీవీలర్ (వికలాంగులు ఉపయోగించే ప్రత్యేక వాహనం)ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో త్రీవీలర్‌పై ఉన్న మేడబోయిన రేణుక (28), ఏడాదిన్నర వయసున్న ఆమె కుమారుడు ప్రకాశ్ అక్కడిక్కడే మృతిచెందారు. త్రీవీలర్ నడుపుతున్న రేణుక భర్త చంద్రమౌళి, వారి నాలుగేళ్ల కుమార్తె కావ్యకు తీవ్ర గాయాలయ్యాయి. నల్లగొండ రూరల్ పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నల్లగొండ మండలం చెన్నారానికి దివ్యాంగులైన చంద్రమౌళి, ఆయన భార్య రేణుక, కుమారుడు ప్రకాశ్, కుమార్తె కావ్యతో కలసి తమ త్రీవీలర్‌పై నార్కట్‌పల్లి మండలం చిన్ననారాయణపురంలో జరిగిన శుభకార్యానికి వెళ్లి తిరిగి స్వగ్రామం బయలుదేరారు. మార్గమధ్యలోని మర్రిగూడ బైపాస్‌వద్ద నల్లగొండ వైపు రోడ్డు దాటేందుకు యూటర్న్ వద్ద ఆగాడు. అదే సమయంలో మిర్యాలగూడవైపు నుంచి హైదరాబాద్‌కు కావేరి ట్రావెల్స్ బస్సు వెళ్తోంది. అప్పుడే ఓ కారులో బాలిక డ్రైవింగ్ నేర్చుకుంటూ పానగల్ వైపు యూటర్న్ తీసుకునే క్రమంలో అకస్మాత్తుగా కారు ప్రధాన రోడ్డుపైనే ఆగిపోయింది. హఠాత్తుగా ఆగిన కారును తప్పించే క్రమంలో బస్సు దివ్యాంగుల వాహనాన్ని, కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దివ్యాంగురాలైన రేణుక, కుమారుడు ప్రకాశ్ అక్కడికక్కడే మృతిచెందగా, కుమార్తె కావ్య తలకు, దివ్యాంగుడైన చంద్రమౌళికి తీవ్ర గాయాలయ్యాయి. కారు ముందుభాగం తీవ్రంగా దెబ్బతింది. అందులోని బెలూన్లు తెరుచుకోవడంతో అందులోని వారికి ఏమీ కాలేదు. తీవ్రంగా గాయపడిన కావ్యకు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

# మృత్యుంజయుడు

## వాహనం ఢీకొనడంతో బావిలోకి దూసుకెళ్లిన బైక్

- 30 గంటల పాటు మృత్యువుతో పోరాటం
- మొగిలిని రక్షించిన గ్రామస్తులు



బాధితుడిని తాడు సహాయంతో బయటకు లాగుతున్న గ్రామస్తులు (ఇన్‌సెట్‌లో మొగిలి)

హసన్‌పర్తి: రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ బావిలో పడిన ఓ అడ్తి వ్యాపారి 30 గంటల పాటు మృత్యువుతో పోరాడిన సంఘటన వరంగల్ అర్బన్ జిల్లా నాగారం సమీపంలో చోటుచేసుకుంది. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన మొగిలి అడ్తి వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గురువారం బంధువుల ఇంటికి వెళ్లిన అతను శుక్రవారం తెల్లవారుజామున జమ్మికుంటకు బైక్‌పై బయల్దేరాడు. నాగారం సమీపంలో ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొట్టడంతో రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి బైక్ దూసుకెళ్లింది. మొగిలికి ఈత రావడంతో ఈదుకుంటూ మోటారుకు అమర్చిన పైపులను పట్టుకుని ఉన్నాడు. రక్షించాలంటూ కేకలు వేసిన ఎవరికీ వినబడలేదు. అయితే.. హన్మకొండ నుంచి శుక్రవారం తెల్లవారుజామున బయల్దేరిన మొగిలి ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఫోన్ చేస్తే నంబర్ కలిపినప్పటికీ పని చేయలేదు. దీంతో వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

**30 గంటలు మృత్యువుతో పోరాటం**

శుక్రవారం తెల్లవారుజామున బావిలో పడిన మొగిలి శనివారం మధ్యాహ్నం వరకు అందులోనే పైపులను పట్టుకొని ఉన్నాడు. బావి వద్దకు మోటారు ఆన్ చేయడానికి వచ్చిన రైతు సమ్మిరెడ్డి మొగిలిని గమనించి చుట్టు పక్కవారి సహకారంతో అతడిని బయటకు తీశారు. మొగిలిని ఆస్పత్రికి తరలించారు.

## తల్లీకూతురును కలిపిన వాట్సాప్

ఇంట్లోంచి వెళ్లిపోయిన విద్యార్థిని గుంటూరులో లభ్యం



గుంటూరు సీడబ్ల్యూసీ ఆఫీసులో అక్షిత, నిర్మలకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

యాదగిరిగుట్ట : జనగాం జిల్లా కేంద్రానికి చెందిన ఓ ఇంటర్ విద్యార్థిని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. యాదగిరిగుట్ట మండలం అమ్మ ఒడి అనాథ ఆశ్రమ నిర్వాహకులు వాట్సాప్‌లో ఈ విషయాన్ని పోస్టు చేసి, విస్తృత ప్రచారం చేశారు. దీంతో అమ్మాయిని ఏపీలోని గుంటూరు జిల్లాలో స్థానికులు గుర్తించి శనివారం తల్లి చెంతకు చేర్చారు. అమ్మ ఒడి నిర్వాహకుడు జెల్లా శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన అక్షిత అనే విద్యార్థిని శుక్రవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. తల్లి నిర్మల మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకొని చూడగా కూతురు కనిపించలేదు. కంగారు పడిన తల్లి.. అక్షితకు స్కూల్‌లో చదువు చెప్పిన అమ్మఒడి అనాథ ఆశ్రమ నిర్వాహకురాలు జెల్లా దివ్యకు తెలిపింది. వెంటనే ఆమె భర్త జెల్లా శంకర్‌కు అక్షిత ఫొటో, వివరాలతోపాటు తప్పిపోయిన సమాచారాన్ని తెలిపింది. ఆయన అమ్మఒడి అనాథ ఆశ్రమం వాట్సాప్ గ్రూప్‌లతో పాటు, వివిధ గ్రూప్‌లలో పెట్టారు. దీంతో అక్షిత గుంటూరు జిల్లా కేంద్రంలో ఉందని, పోలీసులకు అప్పగించామని స్థానికులు.. ఆశ్రమ నిర్వాహకులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. బాలికలను పోలీసులు గుంటూరులోని సీడబ్ల్యూసీ కేంద్రానికి తరలించారు. శనివారం ఉదయం అక్షిత తల్లి నిర్మల, అమ్మఒడి ఆశ్రమ నిర్వాహకులు గుంటూరుకు వెళ్లి బాలికను తీసుకువచ్చారు.



ఇండియన్ పిట్ట



వైట్‌రంప్డ్ షమా

## పాకాల అడవుల్లో విదేశీ పక్షులు

ఖానాపురం: వివిధ జాతుల పక్షులకు నిలయంగా నిలుస్తోంది వరంగల్ రూరల్ జిల్లాలోని పాకాల అభయారణ్యం. ఇటీవల కాలంలో పాకాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా విదేశీ పక్షులు చేరుకుంటున్నాయి. తాజా గా డీఎఫ్‌ఓ కాజీపేట పురుషోత్తం ఆధ్వర్యంలో అనేక జాతుల పక్షులను గుర్తిం చగా శనివారం ఫారెస్ట్ శాఖ ఆధ్వర్యంలో బర్డ్ ఫెస్టివల్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు పలువురు ఫొటోగ్రాఫర్లు అటవీ ప్రాంతంలో పర్యటిస్తుండగా ఇండియన్ పిట్ట, వైట్ రంప్డ్ షమా అనే కొత్త జాతులను గుర్తించినట్లు డీఎఫ్‌ఓ తెలిపారు.

# కేన్సర్ ఆస్పత్రిని ఏర్పాటు చేయండి

- సత్యసాయి ట్రస్ట్‌ను కోరిన మాజీ మంత్రి హరీశ్‌రావు
- అంగీకరించిన సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధి



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న హరీశ్

కొండపాక (గజ్వేల్)/సిద్దిపేటటౌన్: కేన్సర్ వ్యాధి నివారణకు ప్రత్యేకంగా ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు సత్యసాయి సేవా ట్రస్టు నిర్వాహకులను కోరారు. సిద్దిపేట జిల్లా కొండపాక శివారులోని సత్యసాయి సేవా సంస్థ ప్రశాంతి నికేతన్ ఉచిత బాలికల జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఆస్పత్రి ఏర్పాటుకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని వారికి భరోసానిచ్చారు. కొండపాక ప్రాంతంలో ప్రశాంతి ప్రగతి నికేతన్ బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతపిల్లలకు మన సంస్కృతీ సంప్రదాయాలను నేర్చుకునే అవకాశం లభించిందన్నారు. సత్యసాయి సేవా సమితి కర్ణాటక, తెలంగాణలో 22 విద్యా సంస్థలను నడుపుతూ ఎంతో మంది పేద విద్యార్థుల బతుకుల్లో వెలుగులు నింపుతోందని ప్రశంసించారు. సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధి భగవాన్ మధుసూదన్ నాయుడు మాట్లాడుతూ డైనమిక్ ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరిన విధంగా కేన్సర్ వ్యాధి నివారణ కోసం మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులను నిస్వార్థ పౌరులుగా, దేశ సేవకులుగా సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా తయారు చేయడం తమ సంస్థ ముఖ్యఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి, రాధాకిషన్ శర్మ, కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**జాతీయ రహదారులపై కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలి**

మెదక్–సిద్దిపేట–హుస్నాబాద్ మీదుగా ఎల్కతుర్తి వరకు, సిరిసిల్ల–సిద్దిపేట–చేర్యాల మీదుగా జనగామకు వెళ్లేందుకు జాతీయ రహదారుల ఏర్పాటుపై కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. శనివారం ఆయన సిద్దిపేటలో జాతీయ రహదారుల ఏర్పాటుపై ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, జాతీయ రాహదారుల పర్యవేక్షణ అధికారి వసంత తదితరులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్–సిద్దిపేట–ఎల్కతుర్తి రహదారిపై వెంటనే కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. రహదారుల ఏర్పాటు మ్యాప్‌ని పరిశీలించి పలు సూచనలు చేశారు. రంగదాంపల్లి చౌరస్తాలో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నిరోధించడానికి అండర్ పాస్ వేయాలని హరీశ్‌రావు అధికారులకు సూచించారు.

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్య మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్
NIT No.24,36,18,46 & 47/SE/TUFIDC/UNIT-III/MBNR, KWKL/2019, తేది: 30.05.2019
మహబూబ్‌నగర్ కల్వకుర్తి మున్సిపాలిటీల్‌లో మినీ ట్యాంక్‌బండ్ వద్ద ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మాణం, ప్రస్తుతమున్న BT రోడ్లు, జంక్షన్లు అభివృద్ధి చేయుట, మేజర్ స్ట్రామ్ వాటర్ డ్రెయిన్స్ నిర్మాణం, CC రోడ్లు & డ్రైన్లు వేయుట మొ॥ పనులు చేపట్టుట కొరకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ.1012.00 లక్షలు. బిడ్ల దాఖలు ప్రారంభ తేది: 03.06.2019, బిడ్ల దాఖలు ముగింపు తేది: 13.06.2019, ఫోన్ నం: 7416421348, మెయిల్ ID: se.unit3.tufidc@gmail.com, తదుపరి వివరాలకు: https://tender.telangana.gov.in. సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (PH), యూనిట్ -III, TUFIDC, మహబూబ్‌నగర్
DIPR RO.No.208-DP/CL/Advt/1/2019-20, Dt: 01.06.2019

జవహర్ నవోదయ విద్యాలయ : చలకుర్తి క్యాంపు, నల్లగొండ జిల్లా
Ref.No. 4-41/JNVCC/2019-20/ టెండర్ ప్రకటన తేది. 31.05.2019
విద్యాలయ వసతి గృహ నిర్వహణకై 2019–20 సంవత్సరానికి కావలసిన 1.బియ్యం, 2. కిరాణ సరుకులు, 3. కూరగాయలు, 4. పండ్లు, 5. కోడి గుడ్లు, చికెన్, మరియు మటన్, 6. బేకరి ఐటమ్స్. 7. టాయిలెట్ ఐటమ్స్, 8. స్టేషనరి, 9. షూ, సాక్స్ మరియు పోలిష్, 10. పెయింట్స్, 11. ఎలక్ట్రికల్ ఐటమ్స్, 12. యూనిఫారం కుట్టుట, సరఫరా చేయుటకు టెండరు ఫారములు విద్యాలయ కార్యాలయము నుండి రూ. 200/– చెల్లించి 01.06.2019 నుండి 19.06.2019 వరకు విద్యాలయ పని దినములలో పొందవచ్చును చివరి తేది అయిన 19.06.2019 రోజు మధ్యాహ్నం 1.00 వరకు మాత్రమే టెండరు ఫారములు ఇవ్వబడును.
సీల్డు టెండర్లు తేది. 19.06.2019 సాయంత్రం గం॥ 4.00ల వరకు స్వీకరించబడును. అట్టి టెండర్లు తేది. 20.06.2019న గం॥ 11.00లకు హాజరైన టెండరుదార్ల సమక్షంలో జిల్లా రెవెన్యూ అధికారి గారి సమక్షంలో జవహర్ నవోదయ విద్యాలయ, చలకుర్తి క్యాంపు కార్యాలయంలో తెరువబడును.
క్రమ సంఖ్య 1,2,7,8,9,10 మరియు 11లకు సరుకుల సరఫరాకు ఫారం పొందగోరువారు. GST Registration Certificate జిరాక్స్ కాపి తప్పనిసరిగా తీసుకురావలెను. అర్హత అనుభవం ఉన్నవారు మాత్రమే టెండరు ప్రక్రియలో పాల్గొనవలెను.
సం/- ప్రిన్సిపాల్ జవహర్ నవోదయ విద్యాలయ
చలకుర్తి క్యాంపు, నల్లగొండ జిల్లా.

## పలకరించిన తొలకరి

కాళేశ్వరం: ఎండలతో ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేసిన భానుడు...శనివారం తెల్లవారుజామున చల్లబడ్డాడు. ఉరుములు, మెరుపులతో కూడిన గంటపాటు భారీ వర్షం పడింది.ఎడపల్లిలో జీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి కల్లాల్లో వరి ధాన్యం తడిసింది. అక్కడక్కడా వాగులు, వంకల్లోకి నీరు చేరుతుంది. ఖరీఫ్ సీజన్‌లో తొలకరి పలకరించడంతో రైతులు సంబుర పడుతున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
కార్యనిర్వాహక ఇంజినీర్, డివిజన్ నం.2 ఆఫ్ జి.వి.సి.4, ధరూర్ క్యాంప్, జగిత్యాల, జగిత్యాల జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన-రెండవ పిలుపు
టెండర్ నోటీస్ నం.01-04/ఇ.ఇ/డివిజన్ నం.2/జి.వి.సి-4/2019–20, తేది: 09.05.2019. పనిపేరు: యస్.ఆర్.యస్.పి స్టేజి-1: చిన్న నీటిపారుదల శాఖ చెరువులు నింపుటకై కాకతీయ కాలువ యొక్క డిస్ట్రిబ్యూటరీ 83 ఏ మరియు 83 బి, 53,63,64 లపై నూతన తూములు నిర్మాణం చేయుట గురించి టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం పనుల అంచనా విలువ: రూ.51,50,000/-. టెండర్ డాక్యుమెంట్ ప్రారంభ తేది: 03.06.2019 నుండి 10.06.2019 వరకు. టెండరు డాక్యుమెంటు లభించు ఆఖరు తేది: 10.06.2019 మ.3.00 గం.వరకు. టెండరు స్వీకరించుటకు చివరి తేది: 10.06.2019 సా.5.00 గం.వరకు. టెండరు తెరుచు తేది: 11.06.2019 ఉ.11.గం. కు. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ www.eprocurement.gov.in వెబ్‌సైట్‌ను తేది.03.06.2019 నుండి చూడగలరు.
సం/- కార్యనిర్వాహక ఇంజినీర్, డివిజన్ నం.2 ఆఫ్ జి.వి.సి.4, ధరూర్ క్యాంప్, జగిత్యాల
DIPR RO.No.212-DP/CL/Advt/1/2019-20, Dt: 01.06.2019

తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్
4వ అంతస్తు, పాదుపు భవన్, హైదరాబాద్ కలెక్టరేట్ కాంప్లెక్స్, నాంపల్లి స్టేషన్ రోడ్, హైదరాబాద్
ప్రకటన
ఇందుమూలంగా తెలియచేయడం ఏమనగా, నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధిశాఖ, తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిత పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం–కెనాల్ నెట్వర్క్–2వ దశ (నీటి పారుదల) కొరకు నాగర్ కర్నూల్, నారాయణపేట మరియు మహబూబ్ నగర్ జిల్లాల్లో తేది: 04.06.2019 సమయం: ఉదయం 11 గంటలకు, తేది: 10.06.2019 సమయం: ఉదయం 11 గంటలకు మరియు తేది: 14.06.2019 సమయం: ఉదయం 11 గంటలకు నిర్వహించాల్సిన పర్యావరణ ప్రజాభిప్రాయసేకరణ అనివార్య కారణాల వల్ల వాయిదా వేయబడింది.
ప్రదేశం: హైదరాబాద్ సం/- ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్,
తేది: 31.05.2019 తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ప్రాంతీయ కార్యాలయం, హైదరాబాద్
DIPR RO.NO. 120-PP/CL/ADVT/1/2019-20, dt 01/06/2019

# అద్భుత క్షేత్రంగా శివాలయం

## యాదాద్రిలో ఎకరం విస్తీర్ణంలో నిర్మాణం

- పూర్తి కావస్తున్న ఆలయ ముఖ మండపం, ప్రాకారాలపై డిజైన్లు
- మరకత లింగం ఏర్పాటుకు సన్నాహాలు



శివాలయం వ్యూ

యాదగిరికొండ : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్ర అభివృద్ధి పనుల్లో భాగంగా నిర్మిస్తున్న శివాలయం అద్భుతంగా రూపు దిద్దుకుంటోంది. యాదగిరికొండపై ఎకరం స్థలంలో శివాలయాన్ని నభూతోనభవిష్యత్ అన్న రీతిలో నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఆలయం చుట్టూ ప్రాకారం పూర్తి చేశారు. ప్రాకార గోడలపై అందమైన పువ్వుల డిజైన్లతో పాటు శిల్పాలను అమర్చారు. నవ నందులు, శివుడికి ప్రతి రూపాలు, అమ్మవారి అష్టలక్ష్మి శిల్పాలను ఏర్పాటు చేశారు. భక్తులను ఆకట్టుకునే విధంగా పంచతల రాజగోపురాన్ని నిర్మించారు. ఆలయంలోని గర్భాలయానికి ఎదురుగా ముఖ మండపాన్ని నిర్మిస్తున్నారు. అదే విధంగా మరకత లింగాన్ని ప్రతిష్ట చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మరో రెండు మూడు నెలల్లో పూర్తయ్యేలా పనులను వేగవంతం చేశారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో యాదగిరికొండపై 14 ఎకరాల్లో ప్రధాన ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. అందులో భాగంగా శివాలయాన్ని గతంలో కంటే భిన్నంగా నిర్మిస్తున్నారు. కాకతీయులు, చోళుల కాలంనాటి నిర్మాణ రీతులను ప్రామాణికంగా తీసుకుని అందుకు అనుగుణంగా ఆలయాన్ని తీర్చిదిద్దుతున్నారు. అంతేకాకుండా భక్తులకు అన్ని వసతులను ఏర్పాటు చేయడానికి వైటీడీఏ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆలయానికి ఎదురుగా ఉన్న విశాలమైన స్థలంలో స్వామివారి పూజకు కావాల్సిన బిల్వం, మారేడు వృక్షాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సుమారు రూ.300 కోట్ల ప్రణాళికతో ఆలయ పనులు కొనసాగుతున్నాయి.



# జయ.. జయహే తెలంగాణ

## అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో కొత్త ఒరవడి

- రైతుబంధు, రైతు బీమాతో రైతన్నకు పట్టం
- దేశానికే ఆదర్శంగా మారిన రాష్ట్ర పథకాలు
- 12 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు
- చివరి దశకు చేరుకున్న కాళేశ్వరం పథకం
- 47 లక్షల మందికి 'ఆసరా' కల్పిస్తున్న పింఛన్లు
- విద్యుత్ సంక్షోభం నుంచి వెలుగులకు ప్రస్థానం
- పారిశ్రామిక, ఐటీ రంగాల్లో కొనసాగిన వృద్ధి

### తెలంగాణ వార్షిక బడ్జెట్ అంచనాలు...




ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటాల అనంతరం ఎన్నో ఆశలు, ఆకాంక్షల నడుమ దేశంలో 29వ రాష్ట్రంగా 2014 జూన్ 2న అవతరించిన తెలంగాణ రాష్ట్రం నేడు ఐదేళ్లు పూర్తి చేసుకొని ఆరో వసంతంలోకి అడుగిడుతోంది. ఆవిర్భావ సమయంలో ఉత్పన్నమైన భయాలు, ఆందోళనలు, అనుమానాలను విజయవంతంగా అధిగమించిన తెలంగాణ... నేడు పలు రంగాల్లో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా దూసుకుపోతోంది. అభివృద్ధి, సంక్షేమ పథకాల సమ్మేళనంతో పాలనలో కొత్త ఒరవడి సృష్టించింది.

– సాక్షి, హైదరాబాద్



### సబ్బండ వర్గాల అభ్యున్నతికి కార్యాచరణ...

తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్ర ఆవిర్భావం రోజునే బాధ్యతలు చేపట్టిన టీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావు రైతు సంక్షేమం, సబ్బండ వర్గాల అభ్యున్నతి కార్యాచరణతో కొత్త రాష్ట్రం నిర్మాణానికి పునాదులు వేశారు. కేసీఆర్ మానస పుత్రికలైన రైతు బంధు, రైతు బీమా, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి బృహత్తర పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయమయ్యాయి. గత డిసెంబర్‌లో జరిగిన రాష్ట్ర శాసనసభ ముందస్తు ఎన్నికల్లో విజయదుందుభి మోగించి రెండోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టడానికి దోహదపడ్డాయి. రైతుబంధు, రైతు బీమా పథకాలు ఐక్యరాజ్యసమితి ప్రశంసలను సైతం అందుకున్నాయి. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా వంటి సంచలన నిర్ణయాలు యావత్ దేశం దృష్టిని రాష్ట్రంవైపు ఆకర్షింపజేశాయి.

### కోటి ఎకరాల సాగునీటి సరఫరా కల దిశగా...

సీఎం కేసీఆర్ స్వీయ పర్యవేక్షణలో రూపుదిద్దుకుంటున్న కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల పథకాలు కోటి ఎకరాలకు సాగునీటి సరఫరా కలను సాకారం చేసే దిశగా శరవేగంగా అడుగులు వేస్తున్నాయి. పాలనా సంస్కరణల కోసం కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు, గ్రామ పంచాయతీలు, కొత్త పురపాలికల ఏర్పాటు చేయడంతో రాష్ట్రం కొత్త రూపు సంతరించుకుంది. రాష్ట్ర శాసనసభ 2018 మార్చిలో ఆమోదించిన కొత్త పంచాయతీరాజ్ చట్టంతో రాష్ట్రంలోని 1,177 తండాలు, గూడేలను గ్రామ పంచాయతీ హోదా వరించింది. పెట్టుబడులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన టీఎస్–ఐపాస్ పారిశ్రామిక విధానం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన్ననలు అందుకుంది. ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు, ప్రపంచ ఐటీ కాంగ్రెస్ వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలకు ఆతిథ్యమిచ్చి యావత్ ప్రపంచం దృష్టిని తెలంగాణ ఆకర్షించింది. విద్య, ఉద్యోగాల్లో స్థానికులకే అవకాశం కల్పించేందుకు కొత్త జోనల్ విధానం అమల్లోకి వచ్చింది. భూ రికార్డుల ప్రక్షాళన పంపిణీ వంటి వినూత్న కార్యక్రమాన్ని ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసింది.

### ఆదాయ వృద్ధిలో అగ్రగామి...

ఆదాయ వృద్ధి రేటులో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా కొనసాగుతోంది. 2014–18 కాలంలో 17.17 శాతం ఆదాయ వృద్ధిని సాధించింది. అలాగే 2018–19 ఆర్థిక సంవత్సరంలో నవంబర్ ముగిసే నాటికి 29.93 శాతం ఆదాయ వృద్ధిని నమోదు చేసింది.

### సంక్షేమ రాజ్యం...

సంక్షేమ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఏటా రూ.40 వేల కోట్లను సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేస్తోంది. పేద కుటుంబాల్లోని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, బోదకాలు బాధితులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బీడీ కార్మికులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, వృద్ధ కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్లు అండగా మారాయి. రాష్ట్ర ఆవిర్భావానికి తొలి ఏడాదే వృద్ధాప్య పింఛన్‌ను రూ. 200 నుంచి రూ. వెయ్యికి, వికలాంగులు, పేద వృద్ధ కళాకారుల పింఛన్‌ను రూ. 500 నుంచి రూ. 1,500కు ప్రభుత్వం పెంచింది. దీనివల్ల తొలి ఐదేళ్లు ఏటా రూ. 5,013.91 కోట్లు ఖర్చు అయింది. సామాజిక భద్రత కోసం అందిస్తున్న పింఛన్లకు వార్షిక ఆదాయ, వయో అర్హత నిబంధనలను సర్కారు సడలించింది. 2018–19లో 39,32,726 మందిగా ఉన్న పింఛనర్ల సంఖ్య ఈ నిర్ణయంతో 47,88,070కు పెరగనుంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అన్ని రకాల పింఛన్లను జూన్ నెల రెట్టింపు చేస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది. వృద్ధుల పింఛన్లు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళల భృతి రూ. 1000 నుంచి రూ. 2016కు పెరగనుంది. అలాగే వికలాంగులు రూ. 3,016, బోదకాలు బాధితులు రూ. 2,016 పింఛను అందుకోనున్నారు. దీంతో ప్రభుత్వంపై రూ. 6,787 కోట్ల అదనపు భారం పడనుంది. పింఛన్ల పంపిణీకి ఏటా రూ. 11,843 కోట్ల వ్యయం కానున్నది. వృద్ధాప్య పింఛన్ల వయోపరిమితి 65 ఏళ్ల నుంచి 57 ఏళ్లకు తగ్గించడంతో 2019 ఏప్రిల్ నుంచి వృద్ధాప్య పెన్షనర్ల సంఖ్య 21,60,275కి చేరింది.

### పేదల ఇంట కల్యాణలక్ష్మి...

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సాయం అందించడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు బాగా ప్రాచుర్యం పొందాయి. కల్యాణలక్ష్మి ద్వారా 3,56,997 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ లబ్ధిదారులు, షాదీ ముబారక్ ద్వారా 1,09,732 మంది మైనారిటీ వర్గాల పేద ఆడపిల్లలకు ప్రభుత్వం రూ. 51 వేల చొప్పున ఆర్థిక సాయం అందించింది. ఇందుకు రూ. 3,750 కోట్లు ఖర్చయింది. 2018 మార్చి నుంచి ప్రభుత్వం ఈ పథకాల కింద అందించే ఆర్థిక సాయాన్ని రూ. 1,00,116కు పెంచింది.

### పేద విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం...

మధ్యాహ్న భోజనం పథకం కింద రాష్ట్రంలో 3,854 సంక్షేమ హాస్టళ్లలో ఉన్న 7.95 లక్షల మంది విద్యార్థులకు, 28,623 ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న 23,87,751 మంది విద్యార్థులకు ప్రతి నెలా 12 వేల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని 16 సంక్షేమ విభాగాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తోంది.

### ప్రైవేటుకు దీటుగా గురుకుల విద్య...

విద్యాభివృద్ధిలో తెలంగాణ గురుకుల పాఠశాలలు అద్భుత పాత్ర పోషిస్తున్నాయి. తెలంగాణ ఏర్పాటు కాకముందు 298 (261+37 జనరల్) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు ఉండగా, గత ఐదేళ్లలో 661 (608 స్కూళ్లు + 53 డిగ్రీ కాలేజీలు) కొత్త గురుకులాలను ఏర్పాటు చేయడంతో వాటి సంఖ్య 959 (906+53 డిగ్రీ కాలేజీలు)కు పెరిగింది. 2018–19 బడ్జెట్లో గురుకులాలకు రూ. 2,283 కోట్లు కేటాయించారు. వచ్చే విద్యా సంవత్సరంలో 8,434 మంది గురుకుల ఉపాధ్యాయులు కొత్తగా విధుల్లో చేరనున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా గురుకుల విద్యార్థులు ఫలితాలను సాధిస్తున్నారు.

### రైతన్న కోసం విప్లవాత్మక పథకాలు...

రైతన్న సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక పథకాలను అమల్లోకి తెచ్చింది. వ్యవసాయ పెట్టుబడి కోసం రైతులు అప్పులపాలు కాకుండా 2018 మేలో ప్రారంభించిన రైతుబంధు పథకం యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఎకరానికి 4 వేల చొప్పున రెండు పంటల కోసం రెండు విడతల్లో ప్రతి రైతుకూ ఎకరాకు రూ. 8 వేలు ప్రభుత్వం అందిస్తోంది. 2019–20 నుంచి పంట పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ. 4 వేల నుంచి రూ. 5 వేలకు పెంచడంతో రైతు ఎకరాకు ఏటా రూ. 10 వేల సాయాన్ని అందుకోనున్నాడు. వానాకాలంలో సాధారణ సాగు 1.08 కోట్ల ఎకరాలైతే యాసంగిలో 31.92 లక్షల ఎకరాలు. 2018–19 ఖరీఫ్‌లో 51.50 లక్షల మంది రైతులకు రూ. 5,260.94 కోట్లు, రబీలో 49.03 లక్షల మంది రైతులకు రూ. 5,244.26 కోట్లు అందజేశారు.

### అన్నదాతకు మరిన్ని మేళ్లు...

- రాష్ట్రంలోని 57 లక్షల మంది రైతుల్లో అర్హులైన 50 లక్షల మందికి రూ. 5 లక్షల వ్యక్తిగత జీవిత బీమా పథకాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఈ పథకం కింద మరణించిన రైతు కుటుంబానికి 10 రోజుల్లోనే రూ. 5 లక్షల బీమా సొమ్ము అందిస్తున్నారు. ఇప్పటివరకు 10 వేలకుపైగా రైతు కుటుంబాలు ఈ పథకం వల్ల లబ్ధి పొందాయి.
- రాష్ట్ర ఆవిర్భావం తర్వాత నాలుగు విడతల్లో రూ. 16,124.37 కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేయడంతో 35,29,944 మంది రైతులకు లబ్ధి చేకూరింది. ఎన్నికల హామీ మేరకు 2018 నాటికి ఉన్న వ్యవసాయ రుణాల మాఫీ కోసం 2019–20 బడ్జెట్లో ప్రభుత్వం రూ. 6,000 కోట్లు కేటాయించింది. దీనివల్ల సుమారు 48 లక్షల మంది రైతులకు సంబంధించి రూ. 30 వేల కోట్ల రుణాలు మాఫీ కానున్నాయి. 2014లో రుణమాఫీ పొందిన వారికంటే ఈసారి 12.69 లక్షల మంది అదనంగా రుణమాఫీ పొందనుండటం విశేషం.

### సాగునీరు...

తెలంగాణలో నెలకొన్న వ్యవసాయ సంక్షోభాన్ని, కరువు, వలసలను నివారించడానికి ప్రభుత్వం సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం లక్ష ఎకరాలకు సాగునీరు చొప్పున రాష్ట్రంలో కోటీ 25 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గత ఐదేళ్లలో 11.91 లక్షల కొత్త ఆయకట్టుకు నీరందించింది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి రూ. 50 వేల కోట్లకుపైనే ఖర్చు చేసింది. గోదావరి, కృష్ణా నదుల్లో రాష్ట్ర వాటా 1,250 టీఎంసీలు. మరో 150 టీఎంసీలను పూర్తిగా వినియోగించుకోవడానికి కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి, సీతారామ వంటి భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. తెలంగాణ రైతులకు జీవధారగా చెప్పుకుంటున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనులు సీఎం కేసీఆర్ స్వీయ పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. రూ. 80,190 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా 235 టీఎంసీల నీళ్లను మళ్లించనున్నారు. గోదావరి నుంచి 90 రోజులపాటు రోజూ మూడు టీఎంసీల చొప్పున నీటిని మళ్లించి 40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. ఇప్పటికే తుది దశకు చేరుకున్న నిర్మాణ పనులు వచ్చే ఏడాది పూర్తి కానున్నాయి. ఇంటింటికీ రక్షిత మంచి నీటి సరఫరా కోసం చేపట్టిన మిషన్ భగీరథ పథకం సైతం చివరి దశకు చేరుకుంది. ఈ ఏడాది చివరిలోగా పనులు పూర్తి కానున్నాయి.

### పరిశ్రమలు, ఐటీ, విద్యుత్ రంగాలు

తెలంగాణ ఆవిర్భావం తర్వాత నెలకొన్న విద్యుత్ సంక్షోభాన్ని రాష్ట్రం ఆరు నెలల్లోనే అధిగమించింది. గత నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో కోతలులేని నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతోంది. నూతన పారిశ్రామిక విధానం టీఎస్–ఐపాస్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి 2019 మార్చి నాటికి రూ. 1,58,000 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తరలివచ్చాయి. ఆన్‌లైన్ విధానం ద్వారా 9,395 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశారు. 2.74 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. 2013–14లో రూ. 52.25 వేల కోట్లు ఉన్న ఐటీ ఎగుమతులు 2018–19 నాటికి రూ. 1,09,219 కోట్లకు చేరాయి. 2018–19 నాటికి 1,500 ఐటీ/ఐటీఈఎస్ కంపెనీల్లో 5,43,033 మందికిపైగా ప్రత్యక్షంగా, 7 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి లభించింది.

### ఉద్యోగాల భర్తీ...

రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు 1,59,116 ఉద్యోగాల ఖాళీలను గుర్తించిన ప్రభుత్వం... ఇప్పటివరకు 91,790 మందికి ఉద్యోగాలిచ్చింది. టీఎస్‌పీఎస్సీ ద్వారా 17,038, సింగరేణిలో 11,106, ఆర్టీసీలో 5,157, పోలీసుశాఖలో 10,980, వైద్య ఆరోగ్య శాఖలో 1,514, పంచాయతీ కార్యదర్శులు 9,355, వర్సిటీలు, కార్పొరేషన్లు, సొసైటీల్లో 9,614 ఉద్యోగాల భర్తీని పూర్తి చేసింది.

### కేసీఆర్ పాలన న భూతో న భవిష్యత్...



కేసీఆర్ ఐదేళ్ల పాలన ఓ అద్భుతం. అనన్య సామాన్యం. న భూతో న భవిష్యత్. రాష్ట్రంలో ఉద్యమ ఆకాంక్షలకు అనుగుణమైన పాలన సాగుతోంది. తెలంగాణ అవసరాలు, సమస్యలు తెలిసిన కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సాగిస్తున్నారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, రైతు బీమా, రైతుబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కేసీఆర్ కిట్లు, ఆసరా పెన్షన్ల వంటి అనేక పథకాలు దేశంలోనే ప్రశంసలు అందుకున్నాయి. మేనిఫెస్టోలో చెప్పిన, చెప్పని పథకాలనూ అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌ది. గత ఐదేళ్లలో శాంతిభద్రతలు మెరుగయ్యాయి. హైదరాబాద్ విశ్వనగరంగా మారింది. ప్రపంచం దృష్టి అంతా హైదరాబాద్ మీదే ఉంది. తండాలు గ్రామ పంచాయతీలయ్యాయి. గ్రామాల్లో మౌలికవసతులు పెరిగాయి. గత ఐదేళ్లలో తెలంగాణ ప్రగతికి బాటలు పడ్డాయి. బంగారు తెలంగాణలో ప్రజలంతా భాగస్వాములవుతున్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తై రాష్ట్రం సస్యశ్యామలం అవుతుంది.

– అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి,
అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖల మంత్రి

### 5 ఏళ్లలోనే 70 ఏళ్ల పనులు...



గత 70 ఏళ్లలో చేయని ఎన్నో గొప్ప పనులు గత ఐదేళ్లలో జరిగాయి. రైతుల సంక్షేమం, విద్యుత్ సరఫరా, సంక్షేమ వసతి గృహాలు, ఉద్యోగులకు తొలి పీఆర్‌సీ అమలు వంటి అద్భుత కార్యక్రమాలే దీనికి నిదర్శనం. వ్యవసాయానికి 3 గంటల విద్యుత్ కూడా రాకపోయేది. ఇప్పుడు 24 గంటల సరఫరా జరుగుతోంది. పేద విద్యార్థులకు దొడ్డు బియ్యం అన్నానికి బదులు సన్న బియ్యం భోజనం, కల్యాణలక్ష్మి కింద రూ. లక్ష ఆర్థిక సాయం వంటి కార్యక్రమాలు కేవలం రాష్ట్రంలోనే అమలవుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే 50 లక్షల ఎకరాలకు నీరు అందనుంది. ఉమ్మడి ఏపీలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు కోసం పదేళ్లు కొట్లాడితే సర్వే కోసం రూ. 7 కోట్లే కేటాయించారు. తెలంగాణ వచ్చాక రూ. 10 వేల కోట్లను కేటాయించారు. రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో మరింత అభివృద్ధి జరగనుంది.

– శ్రీనివాస్‌గౌడ్, ఆబ్కారీ, పర్యాటకశాఖల మంత్రి

### దేశానికి కేసీఆర్ పథకాలు ఆదర్శం...

రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శం. 24 గంటల విద్యుత్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాలతో రాష్ట్రం సుభిక్షమైంది. రైతుబంధు పథకం అంతర్జాతీయ ఖ్యాతినార్జించింది. ఐక్యరాజ్య సమితి సైతం దీన్ని ప్రశంసించింది. రైతులెవరైనా దురదృష్టవశాత్తూ మరణిస్తే రైతు బీమా పథకం ద్వారా వారి కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా అందుతుంది. అన్ని వర్గాల ప్రజలకు కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల ద్వారా ఆయా వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేసినట్లయింది. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ దేశం దృష్టిని ఆకర్షించారు. దేశం తెలంగాణవైపు చూస్తోంది. తెలంగాణ ఉద్యమకారుడే సీఎం కావడం వల్ల ప్రజల కష్టాలన్నీ తీరుతున్నాయి. కేసీఆర్ వంటి ముఖ్యమంత్రి దొరకడం తెలంగాణ ప్రజల అదృష్టమనే చెప్పాలి.



– తలసాని శ్రీనివాస్ యాదవ్,
పశు సంవర్ధకశాఖ మంత్రి



# వడివడిగా ప్రాజెక్టులు



## తెలంగాణ ఆవిర్భావ అనంతరం మెజారిటీ ప్రాజెక్టులు పూర్తి

- ఐదేళ్లలో 12.77 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు
- 1.25 కోట్ల ఎకరాల లక్ష్యంలో మిగిలింది మరో 54 లక్షల ఎకరాలు
- సాగు ప్రాజెక్టులకు ఇప్పటికే రూ. లక్ష కోట్లకుపైగా ఖర్చు
- 2018-19లో రికార్డు స్థాయిలో రూ. 29,876 కోట్ల వ్యయం
- ఖరీఫ్‌లో కాళేశ్వరం ద్వారా గోదావరి ఎత్తిపోతలు.. 10 లక్షల ఎకరాలకు సాగునీరు
- మొదలైన తూముల నిర్మాణం.. చెక్‌డ్యామ్‌ల కోసం ప్రణాళిక

**ఉమ్మడి రాష్ట్రంలో నీళ్లు లేక నిర్జీవంగా మారిన భూములన్నీ ఇప్పుడు నిండు సత్తువను సంతరించుకుంటున్నాయి. నీటి జాడ లేక వట్టిపోయిన చెరువులన్నీ నేడు నీటితో కళకళలాడుతున్నాయి. పడావు భూములు కాస్తా పచ్చని పంట పొలాలుగా మారుతున్నాయి. అరవై ఏళ్లుగా సాగునీటి కోసం పడ్డ అరిగోస.. ఐదేళ్ల కాలంలోనే కోటి ఎకరాల మాగాణం దిశగా వడివడిగా పరుగులు పెడుతోంది. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం 1.25 కోట్ల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంలో ఇప్పటికే 71 లక్షల ఎకరాల మార్కును దాటింది. తెలంగాణ రాష్ట్రం పురుడు పోసుకున్న ఐదేళ్ల కాలంలోనే ఏకంగా కొత్తగా 12.77 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి రాగా మరో 14.78 లక్షల ఎకరాల స్థిరీకరణ పూర్తయింది. ప్రాజెక్టులపై మొత్తంగా 2004 నుంచి ఇప్పటివరకు రూ. 1.11 లక్షల కోట్ల మేర ఖర్చవగా గత ఐదేళ్లలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏకంగా రూ. 81 వేల కోట్లు ఖర్చు చేసి కొత్త రికార్డు నెలకొల్పింది. నాలుగేళ్లలో మరో రూ. లక్ష కోట్లు ఖర్చు చేసి కోటి ఎకరాల మాగాణ లక్ష్యం దిశగా ముందుకు సాగుతోంది.**

**- సాక్షి, హైదరాబాద్**



కృష్ణా, గోదావరి నదీ జలాల్లో రాష్ట్రం హక్కుగా కలిగిన నికర, మిగులు జలాల్లోని నిర్ణీత వాటాలను సంపూర్ణంగా వినియోగంలోకి తేవడం లక్ష్యంగా చేపట్టిన ప్రాజెక్టులకు తెలంగాణ ప్రభుత్వం తొలి నుంచీ ప్రాధాన్యం ఇస్తూ

### ఈ ఏడాది సాగులోకి మరో 12 లక్షల ఎకరాలు..

వస్తోంది. ఇందులో భాగంగానే ఐదేళ్ల కాలంలో 10 ప్రాజెక్టులను పూర్తి చేయగా మరో 13 ప్రాజెక్టులను పాక్షికంగా పూర్తి చేసింది. రాష్ట్రం ఏర్పడిన కొత్తలో రాష్ట్రాన్ని కోటి ఎకరాల మాగాణగా మారుస్తామన్న ప్రభుత్వం ఆ లక్ష్యాన్ని 1.25 కోట్ల ఎకరాల మాగాణంగా మార్చేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భారీ, మధ్యతరహా, చిన్నతరహా ప్రాజెక్టులు, పథకాల కింద 70.64 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. 2004లో మొదలైన జలయజ్ఞం ప్రాజెక్టుల పూర్తి, కొత్త ప్రాజెక్టుల నిర్మాణాలతో ప్రభుత్వం ఇప్పటివరకు 16.65 లక్షల ఎకరాలను సాగులోకి తెచ్చింది. ఇందులో రాష్ట్ర ఏర్పాటు నుంచి ఇప్పటివరకు ఏకంగా 12.78 లక్షల ఎకరాలను సాగులోకి తేవడం విశేషం. ప్రధానంగా కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, దేవాదుల, సింగూరు వంటి భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల కిందే 10.94 లక్షల ఎకరాల మేర కొత్త ఆయకట్టు సాగులోకి వచ్చింది. మరో 54.05 లక్షల ఎకరాలను వృద్ధిలోకి తేవాల్సి ఉంది. ఇందులో ఈ ఏడాది ఖరీఫ్ నాటికి కనిష్టంగా దాదాపు 12 లక్షల ఎకరాలకైనా కొత్తగా సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**నాలుగేళ్ల కాలానికి ఆయకట్టు లక్ష్యాలు ఇలా...**

| ఏడాది | లక్ష్యం (లక్షల ఎకరాల్లో) |
|---|---|
| 2019 (ఖరీఫ్) | 11.72 |
| 2019-20 | 15.44 |
| 2020-21 | 11.39 |
| 2021-22 | 5.99 |
| 2022-23 | 9.52 |

రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్ల కాలంలో ఏకంగా రూ. 80వేల కోట్ల మేర సాగునీటి ప్రాజెక్టులకు నిధులు ఖర్చు చేసింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ. 23 వేల కోట్ల మేర నిధులు ఖర్చు చేయగా 2018-19 ఆర్థిక సంవత్సరంలో మునుపెన్నడూ లేనివిధంగా రూ. 30,588 కోట్లు ఖర్చు చేసింది. 2017-18లో కాళేశ్వరం ప్రాజెక్టు కోసమే రూ. 18 వేల కోట్ల మేర ఖర్చు చేశారు.

### ఐదేళ్లలో రూ. 81 వేల కోట్లు...

ఇక దేవాదుల, తుపాకులగూడెం, సీతారామ, వరద కాల్వలకు కలిపి కార్పొరేషన్ ఏర్పాటు చేయగా వాటి ద్వారా మరో రూ. 5 వేల కోట్ల మేర ఖర్చు చేశారు. మొత్తంగా కార్పొరేషన్ రుణాల ద్వారా ఇంతవరకు రూ. 33,664 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో కాళేశ్వరం కార్పొరేషన్ కిందే మొత్తంగా రూ. 28,661 కోట్ల మేర ఖర్చు జరిగింది.

**ఏయే సంవత్సరాల్లో ఎన్ని నిధులు ఖర్చు చేశారంటే... (రూ. కోట్లలో)**

| ఏడాది | నిధుల ఖర్చు |
|---|---|
| 2014-15 | 5,208.96 |
| 2015-16 | 7776.51 |
| 2016-17 | 13,614.11 |
| 2017-18 | 23,520.17 |
| 2018-19 | 30,588.20 |
| 2019-20 | 954.25 |
| మొత్తం | 81,662.20 |

**రాష్ట్రంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల సమగ్ర స్వరూపం ఇలా...**

- **38** మొత్తంగా భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు
- **2,19,535.51 కోట్లు** ప్రాజెక్టుల నిర్మాణాలకు అవసరమైన నిధులు
- **1,11,157.66 కోట్లు** ఇప్పటివరకు ఖర్చు చేసిన మొత్తం
- **1,08,377.85 కోట్లు** ఇంకా ఖర్చు చేయాల్సిన మొత్తం
- **81,662 కోట్లు** తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి చేసిన ఖర్చు
- **1,25,05,000 ఎకరాలు** రాష్ట్రం మొత్తంగా ఆయకట్టు లక్ష్యం
- **70,65,000 ఎకరాలు** ఇప్పటివరకు సాగులోకి వచ్చిన ఆయకట్టు
- **54,40,000 ఎకరాలు** ఇంకా సాగులోకి రావాల్సింది

### మొదలుకానున్న కాళేశ్వర శకం...

రాష్ట్ర సాగునీటి రంగంలో కొత్త అధ్యాయం ఆవిష్కృతం కానుంది. ఈ ఏడాది జూలై నుంచి కాళేశ్వరం ఎత్తిపోతల శకం మొదలు కానుంది. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అతితక్కువ సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి నీటిని పంట పొలాలకు తరలించేందుకు ప్రణాళిక సిద్ధమైంది. ఈ ఏడాది జూలై చివరి నుంచి కాళేశ్వరం ద్వారా కనీసం 150 టీఎంసీల నుంచి గరిష్టంగా 200 టీఎంసీల నీటిని తరలించేలా పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పనులు పూర్తవగా పంప్‌హౌస్‌లలో ఈ నెల మొదటి లేదా రెండో వారం నుంచి డ్రై రన్ నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇక ఎల్లంపల్లి దిగువన ప్యాకేజీ-6లో ఇప్పటికే 4 మోటార్ల డ్రై రన్ పూర్తయింది. ప్యాకేజీ-7లో టన్నెల్ పనులు పూర్తయ్యాయి. ప్యాకేజీ-8లో మోటార్లన్నీ సిద్ధమయ్యాయి. మల్లన్నసాగర్ రిజర్వాయర్ పనులు జరగకున్నా ప్రత్యేకంగా నిర్మిస్తున్న ఫీడర్ చానల్ ద్వారా 15 టీఎంసీల సామర్థ్యంతో చేపడుతున్న కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌కు నీటిని తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా ఎస్సారెస్పీ ఆయకట్టును స్థిరీకరించే పనులు చివరికొచ్చాయి. మొత్తంగా ఈ ఖరీఫ్‌లోనే 10 లక్షల ఎకరాల స్థిరీకరణ, మరో 90 వేల ఎకరాల మేర కొత్త ఆయకట్టుకు నీరిచ్చేలా పనులు చేస్తున్నారు.




### చెరువుల పునరుద్ధరణ సక్సెస్.. ఇక చెక్‌డ్యామ్‌లపై దృష్టి

తెలంగాణ తొలి ప్రభుత్వం చిన్న నీటివనరుల పునరుద్ధరణకు చేపట్టిన మిషన్ కాకతీయ పథకం చెరువులకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చింది. నాలుగు విడతల్లో 26,926 చెరువులను పునరుద్ధరించింది. ఇందుకోసం రూ. 3,979.53 కోట్లు ఖర్చు చేసింది. ఈ పనులతో 8.53 టీఎంసీల నీటి నిల్వ పెరగడంతోపాటు 13.57 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. ఇక ఇప్పుడు ఎక్కడి నీటిని అక్కడే కట్టడి చేసేలా గొలుసు కట్టు చెరువుల వద్ద చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి సర్కారు సిద్ధమైంది. మొత్తంగా 1,200 చెక్‌డ్యామ్‌లు, 3 వేల తూముల నిర్మాణం చేయాలని భావిస్తోంది. తూముల నిర్మాణం ద్వారా 8,350 చెరువులను నింపేలా పనులు మొదలుపెట్టింది. ఇందుకోసం రూ. 4,200 కోట్లు ఖర్చు చేయనుంది. ఇప్పటికే తూముల టెండర్ల పనులు మొదలవగా చెక్‌డ్యామ్‌లకు ఇప్పుడిప్పుడే అనుమతిస్తున్నారు.

# చెరువు నిండె.. చేను పండె!

## ఆహారధాన్యాల్లో గణనీయమైన అభివృద్ధి

**సాక్షి, హైదరాబాద్:** ఆహా.. ఉత్పత్తి అంటే ఇదీ..! తెలంగాణ పంట పడింది. రికార్డులు కొట్టుకుపోతున్నాయి. చెరువు నిండింది. పొలం పారింది. రైతుకు దిగులు లేదు. పంటకు తెగులులేదు. విత్తనాల కొరతలేదు. ఎరువుల కరువులేదు. 'రైతుబంధు'ఆదుకుంది. చేనూ చెలకా చిద్విలాసం చేశాయి. దిగుబడులు ఎగబడి పెరిగాయి. ఉత్పత్తిలో ఖరీఫ్, రబీలకు తేడా లేదు. తెలంగాణ పల్లెలు గోదావరి జిల్లాలతో పోటీ పడ్డాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఆహారధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. రెండు, మూడేళ్లుగా ఆహారధాన్యాల ఉత్పత్తిలో భారీ పురోగతి కనిపిస్తోంది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ కాకతీయ ద్వారా వేలాది చెరువులు ఉనికిలోకి రావడంతో సాగునీటి వసతి పెరిగింది. దీంతో ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగింది.



### గోదావరి జిల్లాలతో పోటీ పడి...

కేంద్ర ప్రభుత్వానికి పంపిన నివేదికల ప్రకారం రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో ఆహారధాన్యాల ఉత్పత్తి భారీగా పెరిగింది. 2014-15లో ఆహారధాన్యాల ఉత్పత్తి 72.18 లక్షల మెట్రిక్‌టన్నులు. అది ఇప్పుడు 91.93 లక్షల మెట్రిక్‌టన్నులకు చేరుకుంది. 2016-17, 2017-18 ఏళ్లల్లో రబీల్లో రికార్డుస్థాయిలో ఆహారధాన్యాలు ఉత్పత్తి అయ్యాయి. గోదావరి జిల్లాలతో పోటీపడి ఆహారధాన్యాల ఉత్పత్తి కావడం విశేషం. విచిత్రమేంటంటే... 2014-15 ఖరీఫ్‌లో 44.72 లక్షల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలు పండితే, 2016-17 రబీలోనైతే ఏకంగా 49.07 లక్షల మెట్రిక్ టన్నులు పండటం విశేషం. గత ఖరీఫ్‌లో వరి దిగుబడి గత 20 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టింది. ఏకంగా 41.04 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం (61.57 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం) పండటం విశేషం.

### గతేడాది పత్తి, పప్పుధాన్యాల దిగుబడి ఢమాల్...

గతేడాది పత్తి, పప్పుధాన్యాల ఉత్పత్తి మాత్రం పడిపోయింది. 2018-19లో పత్తి 48.71 లక్షల బేళ్లు ఉత్పత్తి అయిందని నివేదిక తెలిపింది. 2017-18లో 51.95 లక్షల బేళ్లు ఉత్పత్తి కాగా ఈసారి 3.24 లక్షల బేళ్లు తగ్గింది. పప్పుధాన్యాల ఉత్పత్తి కూడా గణనీయంగా పడిపోయింది. 2017-18లో 5.15 లక్షల టన్నులు ఉత్పత్తి కాగా, 2018-19 ఆర్థిక సంవత్సరంలో 3.85 లక్షల టన్నుల మేర ఉత్పత్తి అయింది. ఖరీఫ్‌లో పప్పు ధాన్యాల ఉత్పత్తి 2.58 లక్షల మెట్రిక్ టన్నులు రాగా రబీలో 3.85 లక్షల టన్నులు ఉత్పత్తి కానున్నట్లు ప్రభుత్వం కేంద్రానికి పంపిన నివేదికలో పేర్కొంది.

# పన్నుల రాబడి పెరుగుతోంది!



## 17 శాతం ఆర్థిక వృద్ధి నమోదైందని కాగ్ వెల్లడి

- రికార్డు స్థాయి ఆదాయం చేకూరుస్తున్న రిజిస్ట్రేషన్ల శాఖ
- జీఎస్టీ వచ్చాక 2018-19లో అత్యధిక ఆదాయం
- ఈ ఏడాది వృద్ధి రేటు 29 శాతానికి చేరిక...

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రం ఏటా పురోగమన దిశలోకి వెళుతోంది. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో బడ్జెట్ రాబడులు, వ్యయాలు, అప్పులు కలిపి ఆర్థిక వ్యవస్థ విలువ రూ. 4 లక్షల కోట్లు ఉంటే గత ఐదేళ్లలో అది రూ. 9 లక్షల కోట్లకు చేరింది. ఇందులో ముఖ్యంగా సొంత పన్నుల రాబడిలో అద్భుత ప్రగతి నమోదవుతోంది. ముగిసిన ఆర్థిక సంవత్సరంలో పన్ను రాబడి గతేడాదితో పోలిస్తే 29 శాతం వృద్ధి నమోదు చేసుకుంది. మొత్తం రూ. 77,514 కోట్ల సొంత పన్ను రాబడిని 2018-19లో లక్ష్యంగా పెట్టుకుంటే డిసెంబర్ నాటికే అది రూ. 49,203 కోట్లు వచ్చింది. మిగిలిన త్రైమాసికంలోనూ మంచి ఫలితాలు ఉండటంతో 2018-19 ఆర్థిక సంవత్సరం రూ.64,714 కోట్లతో ఆశాజనకంగా ముగిసింది. మొత్తానికి గత ఐదేళ్లలో సొంత పన్ను రాబడులు రూ. 29 వేల కోట్ల నుంచి రూ. 70 వేల కోట్లకు చేరడం గమనార్హం.

**రిజిస్ట్రేషన్లు.... సూపర్**

రెవెన్యూ రాబడులను పరిశీలిస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయం రాష్ట్రంలో గత ఐదేళ్లలో అద్భుత ప్రగతిని నమోదు చేసుకుంది. ఏటా రిజిస్ట్రేషన్ల ఆదాయం విపరీతంగా పెరుగుతోంది. ఒక్కో నెలలో ఏకంగా రూ. 500 కోట్లు దాటుతున్న రిజిస్ట్రేషన్ల రాబడులు ఖజానాకు భారీగా నిధులు తెచ్చిపెడు తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల శాఖ రికార్డులు నమోదు చేసింది. గతేడాదితో పోలిస్తే 27 శాతం అధికంగా రూ. 5,357 కోట్లు సమకూరాయి. దేశంలోనే ఈ మేర వృద్ధి సాధించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. రాష్ట్రంలో 2014-15 ఆర్థిక సంవత్స రంలో రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ. 2,531 కోట్లుగా ఉంటే అది ఐదేళ్లలో రూ. 5,357 కోట్లకు చేరింది. అంటే గత ఐదేళ్లలో రిజిస్ట్రేషన్ల ఆదాయం రెట్టింపుకన్నా ఎక్కువ పెరిగిందన్న మాట.

**జీఎస్టీలో రికార్డు...**

అమ్మకాలు, వర్తకపు పన్ను విషయంలోనూ రాష్ట్రంలో గణనీయ వృద్ధి నమోదవుతోంది. గత ఐదేళ్లలో పన్నుల ఆదాయం కూడా రెట్టింపు కన్నా ఎక్కువ కావడం గమనార్హం. 2017-18లో జీఎస్టీ అమల్లోకి వచ్చాక కూడా పన్నులు భారీగానే వసూలయ్యాయి. ఊహించిన దానికన్నా తక్కువే అయినా 2017-18లో రూ. 37,439 కోట్ల పన్నులు వసూలు కాగా, 2018-19లో ఆల్‌టైం రికార్డు సాధించింది. కేంద్రం నుంచి వచ్చే పరిహారంతోపాటు అన్ని పన్నులు కలిపి రూ. 45 వేల కోట్లకుపైనే వసూలయ్యాయి.

**17 శాతం వృద్ధి నమోదు...**

2014 మే నుంచి 2018 మార్చి వరకు రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులనుబట్టి కాగ్ నివేదికలో రాష్ట్ర ఆర్థిక వృద్ధి 17 శాతంగా నమోదు కావడం విశేషం. ఇది దేశంలోనే అత్యధికం కాగా, మన తర్వాత హరియాణా, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. వరుసగా నాలుగేళ్లపాటు రాష్ట్రం ఆర్థిక వృద్ధిలో ప్రగతి నమోదు చేసుకుందని, అన్ని రాష్ట్రాలకన్నా పన్నుల రాబడిలో తెలంగాణ మంచి వృద్ధి సాధిస్తోందని కాగ్ నివేదికలో స్పష్టం చేసింది.

**సంక్షేమ భారాలను అధిగమిస్తూ...**

సంక్షేమం, అభివృద్ధితోపాటు రాష్ట్రంలో సాగునీటి వనరుల కల్పనే ధ్యేయంగా నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఆసరా పింఛన్లు, రైతు రుణమాఫీ, రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లాంటి సంక్షేమ పథకాల అమలు కోసం ఏటా రూ. 30 వేల కోట్ల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆసరా పింఛన్ల కోసమే రూ. 12 వేల కోట్ల మేర వెచ్చించాల్సి వస్తోంది.

**అప్పులూ చేయాల్సిందే...**

రాష్ట్రం ఏర్పాటయ్యాక రూ. 1.13 లక్షల కోట్ల మేర అప్పులు చేయాల్సి వచ్చింది. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రణాళికేతర వ్యయానికి తోడు సాగునీటి ప్రాజెక్టులకు కలిపి భారీగా నిధులు వెచ్చించాల్సి రావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అప్పులు తీసుకోవాల్సి వస్తోందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనల ప్రకారం రాష్ట్ర ఆర్థిక సామర్థ్యంలో 25 శాతం మేర అప్పులు తీసుకునే అవకాశం ఉండగా ప్రభుత్వం 22 శాతం అప్పులు తీసుకుంది. తెలంగాణ ఏర్పాటైన తొలి ఏడాది రూ. 9,410 కోట్లు అప్పు తీసుకుంటే ఆ తర్వాత వరుసగా రూ. 18,856 కోట్లు, రూ. 35,280 కోట్లు, రూ. 26,738 కోట్లు, రూ. 23,470 కోట్ల మేర అప్పులు తీసుకోవాల్సి వచ్చింది. 2019-20 ఆర్థిక సంవత్సరానికిగాను ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనలకు అనుగుణంగా మరో రూ. 29,800 కోట్ల మేర అప్పులు తీసుకునే అవకాశం ఉంది.

1896 జూలై 2న గుగ్లీమో మార్కొనీకి రేడియో పేటెంట్ హక్కులు లభించాయి.



# లేఖ తెరిచాడు.. బుక్కయ్యాడు



పక్కవారి సీక్రెట్స్ తెలుసుకోవడం, వారికి వచ్చిన లెటర్స్ చదవడం కొందరికి అదో సరదా.. పెద్ద నేరమేమీ కాదు కానీ మర్యాద కాదంటూ మందలిస్తుంటారు. అయితే స్పెయిన్‌లో మాత్రం చాలా పెద్ద నేరం. ఎంత పెద్ద నేరం అంటే రెండేళ్ల జైలు శిక్ష పడేంత పెద్ద నేరం. తాజాగా స్పెయిన్‌లోని సెవిల్లే ప్రాంతంలో ఓ సంఘటన జరిగింది. తన పదేళ్ల కుమారుడిపేరు మీద వచ్చిన లేఖను ఓ తండ్రి తెరిచి చదివాడని కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. అసలు విషయం ఏంటంటే ఆ బాలుడి తల్లి తరపు అత్తమ్మ ఆ లేఖ రాసింది. అందులో ఆ బాలుడి తండ్రిపై గృహహింస కేసుకు సంబంధించిన వివరాలను ఆరా తీసింది. ఆ తండ్రిని విమర్శిస్తూ కొన్ని వ్యాఖ్యలు రాసింది. అయితే తన భార్య తరపు వారు తనను మానసికంగా వేధిస్తున్నారని, తనపై కావాలనే గృహ హింస కేసు పెట్టారంటూ కోర్టులో ఆ లేఖను సాక్ష్యంగా సమర్పించాడు. అయితే ఇక్కడే బెడిసికొట్టింది. అసలు వేరే వారికి వచ్చిన లేఖను ఎలా చదువుతారంటూ కోర్టు తిరిగి ప్రశ్నించింది. ఆ పిల్లాడి గోప్యతకు భంగం కలిగించారంటూ బాలుడి తల్లి తరపు న్యాయవాదులు కోర్టులో వాదించారు. అంతే అతడికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించింది.



కేన్సర్ బారిన పడుతున్న చిన్నారులకు భరోసా కల్పిస్తూ.. కేన్సర్ రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు అమెరికాలోని న్యూయార్క్ జాన్ ఎఫ్. కెన్నడీ అంతర్జాతీయ విమానాశ్రయంలో జెట్ బ్లూ ఏ 320 విమానాన్ని తాడుతో లాగే పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న బృందం 100 అడుగుల దూరం వరకు లాగాలి. తక్కువ సమయంలో లాగిన బృందాన్ని విజేతలన్న మాట. 'జాయినింగ్ అగైనెస్ట్ కేన్సర్ ఇన్ కిడ్స్' అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

## మూడు రోజులు తేలికపాటి వర్షాలు

సాక్షి, హైదరాబాద్: ఉత్తర కోస్తాంధ్ర, పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. అలాగే గల్ఫ్ ఆఫ్ మార్ట్ బాన్ నుంచి దక్షిణ కోమోరిన్, మాల్దీవుల ప్రాంతం వరకు షియర్ జోన్ ఏర్పడింది. దీంతో రాష్ట్రంలో ఆదివారం అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే సోమవారం ఒకటి రెండుచోట్ల భారీ వర్షాలు, మరికొన్ని చోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ఇదిలా వుండగా శనివారం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. అనేకచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంది. నల్లగొండలో అత్యధికంగా 42 డిగ్రీలు నమోదు కాగా, ఆదిలాబాద్, ఖమ్మంలలో 41 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

## 11న అసిస్టెంట్ లైబ్రేరియన్ సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్య సంచాలక విభాగంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ ఉద్యోగాలకు ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఈ నెల 11న ఉదయం 10.30 గంటలకు టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో చేపడతామని టీఎస్‌పీఎస్సీ ఉప కార్యదర్శి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఈ నెల 7వ తేదీన నిర్వహించాల్సిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రకటించారు. పూర్తి వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

## ఎస్సీ యువతకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్, కెల్ట్రాన్ (కేరళ స్టేట్ ఎలక్ట్రానిక్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) సంయుక్తంగా నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కెల్ట్రాన్ సెంటర్ ఇన్‌చార్జి జి.భూపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న నిరుద్యోగ ఎస్సీ యువత ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మూడు నెలల పాటు ఈ శిక్షణ కొనసాగుతుందని, ఈ మధ్యకాలంలో అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ ఇస్తామని తెలిపారు. అదేవిధంగా వసతి, భోజన సౌకర్యాన్ని కల్పిస్తామని ఆసక్తిగల యువత వెంటనే బోడుప్పల్‌లోని కెల్ట్రాన్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో సందర్శించాలన్నారు. కంప్యూటర్ కోర్సులతో పాటు సాఫ్ట్ స్కిల్స్, ఇంగ్లిష్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లో కూడా శిక్షణ ఇస్తామని చెప్పారు. వివరాలకు 7993420512, 6303657417 నంబర్లలో సంప్రదించొచ్చని తెలిపారు.

## బాలకార్మిక వ్యవస్థపై షార్ట్‌ఫిల్మ్‌లకు బహుమతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణను బాలకార్మిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే క్రమంలో కార్మిక శాఖ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా బాలకార్మిక వ్యవస్థ గురించి సరైన అవగాహన కల్పించే షార్ట్‌ఫిల్మ్ కాంటెస్ట్‌ను నిర్వహిస్తోంది. అత్యుత్తమ షార్ట్‌ఫిల్మ్, డాక్యుమెంటరీలకు ప్రథమ బహుమతి కింద రూ.50 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.25 వేలు, అత్యధిక ప్రజాదరణ పొందిన యూట్యూబ్ చిత్రానికి రూ.10 వేల బహుమానం ఇవ్వనున్నట్లు స్టేట్ రిసోర్స్ సెంటర్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ చైల్డ్ అండ్ అడోల్‌సెంట్ డైరెక్టర్ గంగాధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ షార్ట్‌ఫిల్మ్/డాక్యుమెంటరీ సీడీ/డీవీడీని డైరెక్టరేట్ కార్యాలయానికి లేదా directorsrctg@gmail.comకు ఈమెయిల్ ద్వారా జూలై 31లోగా పంపించాలన్నారు. మరిన్ని వివరాలకు 9492555351, 8008888073 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

## తెలంగాణ పోలీసులకు పతకాల ప్రకటన

- ముగ్గురికి ముఖ్యమంత్రి సర్వోన్నత పోలీసు పతకం
- 654 మందికి సేవా పతకాలు ప్రకటించిన హోంశాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ హోంశాఖ పలువురు పోలీసులకు పతకాలను ప్రకటించింది. ముఖ్యమంత్రి సర్వోన్నత పోలీసు పతకం అవార్డులకు ముగ్గురు అధికారులు ఎంపికయ్యారు. విధి నిర్వహణలో అత్యంత ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. అవార్డు పొందిన వారిలో ఎం.రమణకుమార్ ఏఎస్పీ (ఏసీబీ), ఎం.గంగాధర్ ఇన్‌స్పెక్టర్, సైబరాబాద్, ఎం.శ్రీధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్, ఐటీ, రాచకొండ ఉన్నారు. వీరిని ఎంపిక చేస్తూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేదీ శనివారం జీవో విడుదల చేశారు.

**పోలీసు సేవా పతకం కూడా**

వీరితోపాటు హోంశాఖ పరిధిలోని వివిధ విభాగాలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫైర్ సర్వీసెస్, ఎస్పీఎఫ్, ఏసీబీ విభాగాల్లో ఉత్తమ సేవలందించిన వారికి కూడా పోలీసు సేవా పతకాలను హోంశాఖ ప్రకటించింది. తెలంగాణ శౌర్యపతకానికి (10 మంది), మహోన్నత పతకం (14 మంది), ఉత్తమ సేవా పతకం (89 మంది), కఠిన సేవా పతకం (47 మంది), సేవా పతకానికి (461 మంది) వీరితోపాటు ఉత్తమ సేవా పతకానికి 15 మంది ఎంపికయ్యారు. ఈ మేరకు హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేదీ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు
### పార్లమెంటరీ పార్టీ సమావేశానికి హాజరు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి శనివారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పాల్గొన్నారు. యూపీయే చైర్‌పర్సన్ సోనియా గాంధీ నివాసంలో జరిగిన ఈ సమావేశానికి సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన ఎంపీలు, రాజ్యసభ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సోనియాగాంధీని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలిగా ఎన్నుకున్నారు. సోనియా పేరును మన్మోహన్‌సింగ్ ప్రతిపాదించగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

**పార్లమెంటులో మెరుగైన పనితీరు కనబరుస్తా: ఉత్తమ్**

ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన తాను ఈసారి లోక్‌సభకు ఎన్నికవ్వడం సంతృప్తికరంగా ఉందని, పార్లమెంటు సమావేశాల్లో మెరుగైన పనితీరు కనబరుస్తానని ఉత్తమ్ పేర్కొన్నారు. పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఒక్కరిదే బాధ్యత కాదని, అది అందరి సమష్టి బాధ్యత అన్నారు. పార్టీ బలోపేతానికి రాహుల్ ఎంతో కృషి చేశారని, పార్టీకి ఆయన సేవలు అవసరమని, దేశానికి కాంగ్రెస్ అవసరం కాబట్టి రాహుల్ తన రాజీనామాను వెనక్కు తీసుకోవాలని తనతోపాటు కార్యకర్తలందరూ కోరుతున్నారన్నారు. ఇక తెలంగాణలో బీజేపీకి అదృష్టవశాత్తు నాలుగు సీట్లు వచ్చాయి తప్ప రానున్న రోజుల్లో ఆ పార్టీ బలపడే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్‌కు గ్రామ పంచాయతీల వారీగా ఉన్న బలమైన కేడర్ బీజేపీకి లేదన్నారు. ఇక రాహుల్ తన రాజీనామా నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరుతూ టీపీసీసీ, ఓయూ నేతలు ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేపట్టారు. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ కుంతియా, ఉత్తమ్, కోమటిరెడ్డి శిబిరాన్ని సందర్శించి దీక్షలు విరమించాలని కోరారు. వారి విజ్ఞప్తులను రాహుల్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. రాహుల్ తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని టీపీసీసీ నేతలు మానవతారాయ్, నాయిని యాదగిరి, సాజిద్ బేగ్‌లు తెలిపారు.

# వామ్మో నీటి లోటు..543 టీఎంసీలు!

- కృష్ణా, గోదావరి సాగునీటి ప్రాజెక్టుల్లో పరిస్థితి దయనీయం
- కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల్లో 372 టీఎంసీల మేర నిల్వలు ఖాళీ
- ఎగువ ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్రలను కలుపుకుంటే మరో 223 టీఎంసీల లోటు
- గోదావరిలోనూ గడ్డు పరిస్థితులు
- ఎగువ నిండే వరకు దిగువ అవసరాలకు ఎదురుచూపులే
- సకాలంలో వర్షాలు కురవకుంటే 26 లక్షల ఎకరాలపై ప్రభావం

సాక్షి, హైదరాబాద్ : లోటు వర్షపాతం, ఎగువ నుంచి కరువైన ప్రవాహాల కారణంగా గడిచిన ఏడాది నిర్జీవంగా మారిన కృష్ణా, గోదావరి పరీవాహకంలోని ప్రధాన ప్రాజెక్టులన్నీ జూన్ నుంచి ఆరంభమైన కొత్త వాటర్ ఇయర్‌లో నీటి రాకకోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నాయి. ఈ ఏడాదైనా నైరుతి కరుణిస్తుందనే గంపెడాశతో ఉన్నాయి. ప్రస్తుతం రెండు బేసిన్‌ల పరిధిలో ఏకంగా 543 టీఎంసీల నీటి లోటు ఉండగా, అవి పూర్తి స్థాయిలో నిండి రాష్ట్ర సాగు, తాగునీటి అవసరాలు తీరాలంటే సకాలంలో సమృద్ధిగా కురిసే వానలపై భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఏమాత్రం అవి మొఖం చాటేసినా రెండు బేసిన్‌ల పరిధిలో 26లక్షల ఎకరాలపై ఆ ప్రభావం పడనుంది.

**నోరెళ్లబెట్టిన ప్రాజెక్టులు..**

రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టులన్నీ ప్రస్తుతం తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. గత ఏడాది ఆగస్టు వరకు కూడా నీటి ప్రవాహాలు లేకపోవడంతో కృష్ణాబేసిన్ ప్రాజెక్టులకు నీటి రాక కరువైంది. దీని ప్రభావం రాష్ట్ర పరిధిలోని నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాలపై పడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఈ మూడు ప్రాజెక్టుల్లో 537 టీఎంసీలకుగానూ ఏకంగా ప్రస్తుతం 372.46 టీఎంసీల నీటి లోటు ఉంది. ఇందులో సాగర్‌లో ప్రస్తుతం 130 టీఎంసీల నీటి లభ్యత కనబడుతున్నా, ఇదంతా కనీస నీటి మట్టాలకు దిగువన ఉన్నదే. ఇందులో గరిష్టంగా రెండు తెలుగు రాష్ట్రాలు 8 టీఎంసీలకు మించి వాడుకునే అవకాశం లేదు. ఇక శ్రీశైలంలో 215 టీఎంసీలకు గాను 32 టీఎంసీల లభ్యతగా ఉండగా, ఇప్పటికే కనీస నీటి మట్టాలకు దిగువకు వెళ్లి ఇరు రాష్ట్రాలు నీటిని తీసుకుంటున్నాయి. జూరాలలోనూ కేవలం 2.31 టీఎంసీల నీటి నిల్వలే ఉన్నాయి. మొత్తంగా 12 టీఎంసీలకు మించి నీటి లభ్యత లేదు. ఇక ఎగువన కర్ణాటక ప్రాజెక్టుల్లోనూ తీవ్ర నీటి లోటు ఉంది. ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర ప్రాజెక్టుల్లో 223 టీఎంసీల నీరు చేరితే కానీ అవి నిండే పరిస్థితులు లేవు. ఎగువన సుమారు 180 టీఎంసీల మేర నీరు చేరితే గానీ దిగువ రాష్ట్ర ప్రాజెక్టులకు వరద వచ్చే అవకాశాలు లేవు. ఈ స్థాయిలో నీటి రాక రావాలంటే జూలై, ఆగస్టు నెలలో ఎగువన సమృద్ధిగా వర్షాలు కురవాలి. ఒకవేళ ఎగువన సరైన వానలు లేకుంటే దిగువకు ప్రవాహాలు మొదలయ్యేందుకు సెప్టెంబర్, అక్టోబర్ కూడా పట్టిన సందర్భాలు చాలానే ఉన్నాయి. అదే జరిగితే జూరాల, సాగర్‌ల కింద ఖరీఫ్ పంటల సాగుపై స్పష్టత కొరవడుతుంది. సాగు నీటి ప్రాజెక్టుల్లోకి సకాలంలో నీరు చేరని పరిస్థితుల్లో మొత్తంగా 11 లక్షల ఎకరాల ఆయకట్టుపై ప్రభావం పడే అవకాశం ఉంది.

**గోదావరి నిర్జీవం..**

ఇక గోదావరి బేసిన్ ప్రాజెక్టుల్లోనూ గడ్డు పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఎస్సారెస్పీ, నిజాంసాగర్, సింగూర్, కడెం, ఎల్లంపల్లిలలో ప్రస్తుత లభ్యత జలం కేవలం 18 టీఎంసీలు మాత్రమే ఉండటం, 172 టీఎంసీల మేర నీటి లోటు ఉండటం కలవరపెడుతోంది. ఖరీఫ్‌లో ఈ ప్రాజెక్టుల కింద సుమారు 15 లక్షల ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉంది. తీవ్ర నీటి కొరత దృష్ట్యా ప్రభుత్వం తన తొలి ప్రాధాన్యం తాగునీటి అవసరాలకేనని తేల్చి చెబుతోంది. మిషన్‌భగీరథ అవసరాలకు రెండు బేసిన్‌ల ప్రాజెక్టుల నుంచి కనిష్టంగా 60 టీఎంసీల నీటిని పక్కన పెట్టాకే సాగు అవసరాలకు నీటి విడుదల ఉంటుందని స్పష్టంగా చెబుతోంది. ప్రస్తుతం ఈ రెండు బేసిన్‌ల పరిధిలో లభ్యత జలం 30 టీఎంసీలకు మించి లేకపోవడం, మరో 30 టీఎంసీల నీరు వచ్చే వరకు వేచి ఉండాల్సిన పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ సాగు అంతా వర్షాలపైనే ఆధారపడి ఉంది.

నీళ్లు లేక వెలవెలబోతున్న కృష్ణమ్మ



గోదావరిలో ఇలా..



**కర్ణాటక, రాష్ట్ర ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఇలా.. (టీఎంసీల్లో)**

| ప్రాజెక్టు | వాస్తవ నీటి నిల్వ | ప్రస్తుత నిల్వ | లోటు |
|---|---|---|---|
| (కృష్ణా బేసిన్) | | | |
| జూరాల | 9.65 | 2.51 | 7.35 |
| శ్రీశైలం | 215.81 | 32.60 | 183.21 |
| సాగర్ | 312.05 | 130.15 | 181.90 |
| ఆల్మట్టి | 129.72 | 23.95 | 105.77 |
| నారాయణపూర్ | 37.64 | 18.23 | 19.41 |
| తుంగభద్ర | 100.86 | 2.31 | 98.35 |
| (గోదావరి బేసిన్..) | | | |
| సింగూర్ | 29.91 | 0.49 | 29.42 |
| నిజాంసాగర్ | 17.80 | 0.46 | 17.34 |
| ఎస్సారెస్పీ | 90.31 | 5.88 | 84.43 |
| కడెం | 7.60 | 2.43 | 5.17 |
| లోయర్ మానేరు | 24.07 | 3.95 | 20.12 |
| ఎల్లంపల్లి | 20.18 | 5.65 | 14.53 |



శనివారం సచివాలయంలో టీ వాలెట్‌ను ఆవిష్కరిస్తున్న మీ-సేవ కమిషనర్ వెంకటేశ్వరరావు, జయేశ్ రంజన్, అకున్ సబర్వాల్

# టీ వాలెట్‌తో రేషన్ షాపుల లింక్

**పౌరసరఫరాల కమిషనర్ అకున్ సబర్వాల్ వెల్లడి**

సాక్షి, హైదరాబాద్: జూన్‌లో 1,700 రేషన్ షాపులను టీ వాలెట్ అప్లికేషన్‌తో అనుసంధానం చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ అకున్ సబర్వాల్ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇది తోడ్పాటుగా ఉంటుందని తెలిపారు. శనివారం సచివాలయంలో ఆయన టీ వాలెట్‌ను ఆవిష్కరించారు. అనంతరం అకున్ సబర్వాల్ మాట్లాడుతూ.. ఈ సేవలను ఆగస్టు నెలాఖరులో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తామని చెప్పారు. రంగారెడ్డిలో రెండు నెలలపాటు పైలట్ ప్రాజెక్టుగా పరిశీలించామని తెలిపారు. ఇప్పటికే మీ సేవ, ఈ సేవ, పీఎస్సీ, దోస్త్, విజయా డెయిరీ వంటి సేవలు టీ వాలెట్‌తో లింక్ అయ్యాయని చెప్పారు. కొత్తగా రేషన్ షాపులకు అనుసంధానం చేస్తున్నామని వివరించారు. మీ సేవ కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలో ఏకైక టీ వాలెట్ ఇదే అని, డిజిటల్ పేమెంట్స్‌కు గ్యారెంటీ ఇస్తున్నామని చెప్పారు. ఈ వాలెట్ ద్వారా డబ్బులు డ్రా చేసుకునే వీలును నిజామాబాద్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా కల్పిస్తున్నామని తెలిపారు. ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ.. నోట్లపై ఆధారపడకుండా డిజిటల్ ఉపయోగం పెంచాలని చూస్తున్నామని పేర్కొన్నారు. టీ వాలెట్ వాడకంలో ఎలాంటి చార్జీ ఉండదని తెలిపారు.

# యురేనియం ఉత్పత్తి నాలుగు రెట్లు పెంపు..!

- చిట్రియాల్ ప్రాజెక్టుకు డీపీఆర్ సిద్ధం
- దేశవ్యాప్తంగా 13 కొత్త యురేనియం గనులు
- రూ.10,500 కోట్ల పెట్టుబడితో తవ్వకాలు
- యూసీఐఎల్ సీఎండీ సీకే అస్నానీ



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏకే బాధురి

సాక్షి, హైదరాబాద్: పెరుగుతున్న అణు ఇంధన అవసరాలను తీర్చేందుకు యురేనియం ఉత్పత్తిని నాలుగురెట్లు ఎక్కువ చేయనున్నట్లు యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సి.కె.అస్నానీ తెలిపారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా 13 కొత్త గనులను ప్రారంభిస్తామని.. ఇప్పటికే అందుబాటులో ఉన్న గనులను మరింత విస్తరిస్తామని ఆయన శనివారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. అణు ఇంధన సముదాయం 49వ వ్యవస్థాపక దినోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కొత్త గనుల వివరాలను వెల్లడించారు. నాగార్జున సాగర్ సమీపంలో ఇప్పటికే గుర్తించిన యురేనియం నిక్షేపాలను వెలికితీసేందుకుగాను చిట్రియాల్ వద్ద ఏర్పాటు చేయతలపెట్టిన గనికి చెందిన డీపీఆర్ సిద్ధమైందని తెలిపారు. అన్ని రకాల అనుమతులు తీసుకున్న తరువాత ఈ ప్రాజెక్టు ప్రారంభమవుతుందని చెప్పారు. దీంతోపాటు రాజస్తాన్‌లోని రోహిల్, కర్ణాటకలోని గోగి, ఛత్తీస్‌గఢ్‌లోని జజ్జన్‌పూర్‌లలో కొత్త యురేనియం గనులు ఏర్పాటవుతాయని అన్నారు. కొత్తగా చేపట్టనున్న 13 యురేనియం ప్రాజెక్టుల ద్వారా రానున్న ఏడు - ఎనిమిదేళ్లలో దేశ యురేనియం ఉత్పత్తి ఇప్పుడున్నదానికి నాలుగు రెట్లు ఎక్కువ అవుతుందని వివరించారు. కర్ణాటకలోని గోగి కేంద్రంలో లభించే ముడిఖనిజం మిగిలిన వాటికంటే ఎంతో నాణ్యమైందని.. అక్కడ తక్కువ ఖర్చుతో ఎక్కువ యురేనియం రాబట్టేందుకు అవకాశం ఉందని తెలిపారు. కడప జిల్లా తుమ్మలపల్లెలోని యురేనియం గనిలో వెలికితీతకు చెందిన సమస్యలన్నింటినీ అధిగమించామని, ప్రస్తుతం అక్కడి నుంచి ఉత్పత్తి సాఫీగా జరుగుతోందని తెలిపారు.

**ఘనంగా వ్యవస్థాపక దినోత్సవం...**

దేశ అణు ఇంధన అవసరాలను తీర్చడంలో అణు ఇంధన సముదాయం అనేక సవాళ్లను అధిగమించి.. అత్యున్నత స్థాయిలో పనిచేస్తోందని సంస్థ సీఎండీ డాక్టర్ దినేశ్ శ్రీవాస్తవ తెలిపారు. దేశ అంతరిక్ష, వ్యూహాత్మక అవసరాలకు కూడా తగు విధంగా ఉపకరిస్తున్నట్లు శనివారం జరిగిన 49వ వ్యవస్థాపక దినోత్సవాల్లో ఆయన చెప్పారు. కేవలం యురేనియం ఇంధన బండిళ్లను తయారు చేయడమే కాకుండా.. అందుకు అవసరమైన అన్ని విడిభాగాలను కూడా పూర్తి స్వదేశీ సాంకేతికతతో తయారు చేస్తున్న సంస్థ ఈ దేశంలో ఎన్‌ఎఫ్‌సీ ఒక్కటేనని అన్నారు. ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ బాధురి మాట్లాడుతూ దేశ అణుశక్తి కార్యక్రమం సక్రమంగా నడుస్తోందంటే.. అందుకు న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ భాగస్వామ్యం అత్యంత కీలకమైందని స్పష్టం చేశారు. దేశంలో అణుశక్తి ఉత్పత్తి ప్రారంభమైన తొలినాళ్లలో కొంతమంది విదేశీ భాగస్వాములు మనకు నాసిరకం పరికరాలు అంటకట్టేవారని.. ఎన్‌ఎఫ్‌సీ పుణ్యమా అని అంతర్జాతీయ స్థాయిలో ఎవరికీ తీసిపోని విధంగా విడిభాగాలను.. ముఖ్యంగా అణురియాక్టర్లలో వాడే ప్రత్యేకమైన గొట్టాలను తయారు చేసుకోగలుగుతున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌సీ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సి.ఫణిబాబు, భారత అణుశక్తి సంస్థ జాయింట్ సెక్రటరీ డాక్టర్ మెర్విన్ అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

# అడ్డదారుల్లో బంగారం అక్రమ రవాణా

- పేస్టులా మార్చి ఒకరు..క్యాప్సుల్స్ రూపంలో మరొకరు రవాణా
- మలద్వారంలో దాచి అక్రమ రవాణా
- కస్టమ్స్, డీఆర్ఐ అధికారుల అదుపులో స్మగ్లర్లు



శంషాబాద్: దుబాయ్ నుంచి శంషాబాద్‌కు వచ్చిన ఇద్దరు వేర్వేరు ప్రయాణికుల నుంచి కస్టమ్స్, డీఆర్ఐ అధికారులు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒకవ్యక్తి వద్ద 405 గ్రాముల బంగారం పేస్ట్ బయటపడింది. శుక్రవారం అర్ధరాత్రి ఇండిగో 6ఈ 025 విమానంలో వచ్చిన మహ్మద్ అన్షాద్ కదలికలను అనుమానించిన అధికారులు అతడి లగేజీని తనిఖీ చేశారు. తనిఖీల్లో ఎక్కడా బంగారం బయటపడలేదు. అయితే, అతడిని అధికారులు విచారించగా బంగారాన్ని మలద్వారంలో దాచుకుని తీసుకొచ్చినట్లు వెల్లడించాడు. దీంతో అధికారులు వెంటనే అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లి బంగారాన్ని బయటికి తీయించారు. దీని విలువ రూ.13,08,215 ఉంటుందని అధికారులు నిర్ధారించారు. అన్షాద్ తరచూ ఇదే విధంగా బంగారం తీసుకొస్తున్నట్లు విచారణలో బయటపడింది.

**క్యాప్సుల్స్ రూపంలో..**

ముందస్తు సమాచారం మేరకు డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు ఎయిర్‌పోర్టులో దుబాయ్ నుంచి వచ్చిన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. ఆ తనిఖీల్లో ఎటువంటి బంగారం బయటపడలేదు. దీంతో అతడిని టెర్మినల్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించి మలద్వారంలో దాచి తీసుకొచ్చిన నాలుగు బంగారు క్యాప్సుల్స్‌ను బయటికి తీశారు. ఆ బంగారం విలువ నిర్ధారించలేదు. ఈ విషయమై అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు.



డీఆర్ఐ అధికారుల తనిఖీల్లో బయటపడిన బంగారం క్యాప్సుల్స్













Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792